www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
ఆదివారం
29-12-2024
సంపుటి : 01 | సంచిక : 237 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్

V3 NEWS



# ఐక్యమైన రెండు విప్లవ పార్టీలు

## నూతనోత్సాహంతో సాగిన రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభ


- పార్టీల శ్రేణుల ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన
- దేశం కోసం విప్లవకారులు అందరూ ఐక్యం కావాలి
- జాతీయ అధికార ప్రతినిధి దర్శన్ సింగ్ కట్కర్

సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ కి చెందిన రెండు విప్లవ పార్టీలు విలీనం అయ్యాయి. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేంద్ర, రాష్ట్ర నాయకత్వం హాజరైన కార్యక్రమంలో ఈ విలీనం జరిగింది. సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ వివిధ కారణాల రీత్యా 2013 నుంచి రెండుగా చీలిపోయి పనిచేస్తున్నాయి. తిరిగి ఈ రెండు పార్టీలు కలిసిపోవాలని నేతల అభిప్రాయానికి రావడంతో విలీనం జరిగింది. ఆ రెండు విప్లవ పార్టీలు తిరిగి ఒకటిగా విలీనం కావడం విప్లవ శ్రేణులకు శుభపరిణామమని పలువురు నేతలు అభిప్రాయపడుతున్నారు. నక్సల్బరి, గోదావరి లోయ, శ్రీకాకుళం పోరాటాల ప్రేరణతో ఏర్పడిన న్యూడెమోక్రసీకి ఘనమైన విప్లవ చరిత్ర ఉంది. వివరాలు 4లో...



## రీజినల్ రింగ్‌రోడ్డు నిర్మాణంలో కీలక ముందడుగు

- టెండర్లు పిలిచిన కేంద్రం
- గిర్మాపూర్ నుంచి యాదాద్రి వరకు ఎక్స్‌ప్రెస్ రహదారి నిర్మాణం
- రూ.5,555 కోట్లతో రోడ్డు నిర్మాణానికి టెండర్లు ఆహ్వానం




2

## జనవరి 7న విచారణకు రావాలి

- ఫార్ములా ఈ-రేసు కేసులో కేటీఆర్‌కు ఈడీ నోటీసులు
- ఏసీబీ ఎఫ్ఐఆర్ ఆధారంగా విచారిస్తున్న ఈడీ



2



అశ్రునయనాలతో ఆర్థిక సంస్కర్తకి

# కడసారి వీడ్కోలు



## అధికార లాంచనాలతో ముగిసిన అంత్యక్రియలు

ఢిల్లీలోని నిగమ్‌బోధ్ ఘాట్‌లో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు శనివారం పూర్తయ్యాయి. సైనిక లాంఛనాలతో మన్మోహన్ అంత్యక్రియలు జరిగాయి. నిగంబోధ్ ఘాట్‌లో మన్మోహన్ భౌతికకాయానికి రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని మోదీ, రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా నివాళులర్పించారు. కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ మన్మోహన్ అంతిమయాత్రలో పాల్గొన్నారు. అశ్రునయనాల మధ్య సంస్కరణల యోధుడికి తుది వీడ్కోలు పలికారు అభిమానులు. నిగమ్‌బోధ్ ఘాట్‌కు మన్మోహన్ అభిమానులు కాంగ్రెస్ కార్యకర్తలు భారీగా తరలివచ్చి నివాళులర్పించారు. 2

- 11 కి.మీ మేర సాగిన అంతిమ యాత్ర
- నిగమ్ బోధ్‌లో రాష్ట్రపతి, ప్రధానితో సహా ప్రముఖుల నివాళులు
- ముగిసిన మాజీ ప్రధాని అంత్యక్రియలు
- అంజలి ఘటించిన త్రివిధ దళాల అధిపతులు

ఈ నెల 30న ప్రత్యేకంగా సమావేశం కానున్న తెలంగాణ అసెంబ్లీ 2

## పుస్తకాల్లో అనంతమైన జ్ఞానం ఉంది

### నమిలి మింగేయాలనేంత క్షుణ్ణంగా చదవాలి

శుభకార్యాలకు వెళ్లినప్పుడు బొకేలకు బదులుగా పుస్తకాలు ఇవ్వండి

హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను సందర్శించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



**విశ్వంభర, హైదరాబాద్:** శుభకార్యాలకు వెళ్లినప్పుడు బొకేలకు బదులుగా పుస్తకాలు ఇవ్వాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచించారు. శనివారం ఆయన హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను సందర్శించి మాట్లాడారు. ''పుస్తకాల్లో అనంతమైన జ్ఞానం ఉంది. నిరక్షరాస్యుల కోసం ఆడియో బుక్స్ కూడా అందుబాటులోకి వచ్చాయి. పుస్తకాలను నమిలి మింగేయాలనేంత క్షుణ్ణంగా చదవాలి. హైదరాబాద్ బుక్ ఫెయిర్ సంప్రదాయబద్ధంగా పుస్తకాల్ని ప్రమోట్ చేస్తోంది. మానవ నాగరికత వర్ధిల్లినంతకాలం పుస్తకాలు ఉంటాయి. ఈ-బుక్స్ కంటే పుస్తకాల్లోనే మజా ఉంటుంది. రచయితతో డైరెక్ట్‌గా మాట్లాడుతున్నట్టు ఉంటుంది. విశ్వం గురించి తెలియాలంటే పుస్తకాలు చదవాల్సిందే. ఈ-పుస్తకాలు చదివితే ఆ ఫీల్ ఉండదని పలువురు చెబుతున్న మాట. పెద్దలు అందరూ యువతను పుస్తకాల వైపు ప్రోత్సహించాలి'' అని గవర్నర్ సూచించారు.

## 200ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడాం

- ఇప్పటివరకు 5,800 ఫిర్యాదులు అందాయి
- హైడ్రా చర్యల వల్ల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లు, అక్రమ నిర్మాణాలపై ప్రజల్లో అవగాహన పెరిగింది
- కొత్తగా ప్లాట్లు, ఫ్లాట్లు కొనేవారు జాగ్రత్తగా ఉంటున్నారు
- హైడ్రా కమిషనర్ రంగనాథ్



2

## నాగార్జున సాగర్ డ్యామ్ వద్ద హైడ్రామా

భద్రత విషయంలో గందరగోళం 2

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
| --- | --- |
| ₹ 105 | ₹ 127 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 184 | ₹ 210 |

190 కొత్త '108' వాహనాల కొనుగోలుకు

## ఏపీ ప్రభుత్వం నిర్ణయం



2

- 108 అంబులెన్స్ సిబ్బంది, డ్రైవర్లకు అదనంగా రూ.4వేలు
- అందుబాటులోకి కొత్తగా 58 మహాప్రస్థానం వాహనాలు
- ప్రతి మండలంలో జన ఔషధి స్టోర్స్ ఏర్పాటు చేయాలి
- వైద్య ఆరోగ్యశాఖపై చంద్రబాబు సమీక్ష

## సాగు చేసే భూమికే పెట్టుబడి సాయం

- పథకం అమలులో కచ్చితత్వం కోసం ఉపగ్రహ డేటా వినియోగిస్తాం
- గ్రామాలు, సర్వే నెంబర్ల వారీగా సాగు వివరాలు సేకరిస్తాం
- రైతు భరోసాపై మంత్రి తుమ్మల సమీక్ష



2



## తెలుగు భాషా, సంస్కృతిని పరిరక్షించుకోవాలి

### మన పాలకులూ భాషాభివృద్ధికి కృషి చేయాలి

- తెలుగుకు మద్దతిచ్చేవారికే ఓటు అని ప్రజలతో చెప్పించాలి
- పత్రికలు, ఛానళ్లు తెలుగు అభివృద్ధికి పాటుపడాలి
- ఎన్టీఆర్ వల్ల తెలుగు భాషకు.. ప్రజలకు గౌరవం పెరిగింది
- భాష లేకపోతే.. ఎన్ని ఉన్నా చరిత్ర లేని అనాథలం..అక్షరం లేని అభాగ్యులం
- తెలుగు భాష పలుకుబడి వినసొంపైనది.. సంగీతంలా ఉంటుంది: మాజీ చీఫ్ జస్టిస్ ఎన్వీరమణ
- ఘనంగా ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు ప్రారంభం

**విశ్వంభర, విజయవాడ:**

మాతృ భాషను భవిష్యత్తు తరాలకు పదిలంగా అందించడమే లక్ష్యంగా.. ప్రపంచ ఆరో తెలుగు రచయితల మహాసభలు విజయవాడలో ఘనంగా ప్రారంభమయ్యాయి. సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ, మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్ జ్యోతి ప్రజ్వలన చేశారు. అంతకుముందు వీరు తెలుగు తల్లి విగ్రహానికి అంజలి ఘటించారు. ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, మండలి బుద్ధ ప్రసాద్, విశ్వహిందీ పరిషత్తు జాతీయ అధ్యక్షుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, ఈనాడు ఏపీ సంపాదకుడు ఎం. నాగేశ్వరరావు, తెలంగాణ శాసనమండలి సభ్యుడు, కవి గోరటి వెంకన్న, సినీ గేయ కవి భువనచంద్ర, ఆచార్య కొలకలూరి ఇనాక్ మిగతా2లో...

# 200ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడాం

**విశ్వంభర, హైదరాబాద్:** హైడ్రా ఇప్పటికే 200 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడిందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హైడ్రా వార్షిక నివేదికను రంగనాథ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ.. హైడ్రా చర్యల వల్ల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లు, అక్రమ నిర్మాణాలపై ప్రజల్లో అవగాహన పెరిగిందన్నారు. ఇప్పుడు కొత్తగా ప్లాట్లు, ఫ్లాట్లు కొనేవారు జాగ్రత్తగా ఉంటున్నారని తెలిపారు. ''హైడ్రా ఇప్పటివరకు 8 చెరువులు, 12 పార్కులను కాపాడింది. సాంకేతిక పరిజ్ఞానంతో చెరువులకు సరిహద్దులు, బఫర్‌జోన్‌లు నిర్ణయిస్తున్నాం. ఎన్ఆర్‌ఎస్ఈతో సమన్వయం చేసుకుని శాటిలైట్ చిత్రాలు సేకరిస్తున్నాం. ఏరియల్ డ్రోన్ చిత్రాలు కూడా తీసుకుంటాం. ప్రభుత్వ భూములకు జియో ఫెన్సింగ్ చేసేందుకు చర్యలు చేపట్టాం. చెరువులకు సంబంధించి 2000 నుంచి 2024 వరకు ఉన్న చిత్రాలు సేకరిస్తున్నాం. హైడ్రాకు ఇప్పటివరకు 5,800 ఫిర్యాదులు అందాయి. నాలాలకు సంబంధించి కూడా కిర్లోస్కర్‌తో సమన్వయం చేసుకుంటున్నాం. మున్సిపాలిటీల్లో అనధికార నిర్మాణాలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయి. హైడ్రా అంటే.. కేవలం కూల్చేందుకే అన్నట్టు దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వ భూములు, చెరువులు, పార్కులు కాపాడటమే హైడ్రా ప్రధాన కర్తవ్యం. భూముల రక్షణతో పాటు వరద నివారణ చర్యలు చేపడతాం. హైడ్రాకు డాప్లర్ రాడార్‌ను సమకూర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాం. డాప్లర్ రాడార్ ఉంటే కచ్చితమైన వాతావరణ అంచనాలు సేకరిస్తాం. హైడ్రా తరపున త్వరలోనే ఒక ఎఫ్ఎమ్ ఛానెల్ పెట్టేందుకు ప్లాన్ చేస్తున్నాం. దాని ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు వాతావరణ సమాచారం తెలిపేందుకు వీలుంటుంది'' అని రంగనాథ్ తెలిపారు.

# ఈ నెల 30న ప్రత్యేకంగా సమావేశం కానున్న తెలంగాణ అసెంబ్లీ

- **మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ నివాళులర్పించనున్న శాసనసభ**

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ఈ నెల 30వ తేదీన జరగనుంది. సోమవారం ఉదయం 10 గంటలకు సభ ప్రారంభం కానుంది. మన్మోహన్ మృతికి సంతాప సూచకంగా కేంద్ర ప్రభుత్వం 7 రోజుల సంతాప దినాలను కూడా ప్రకటించింది.సంతాప దినాల్లో భాగంగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు శాసన సభ నివాళులర్పించనుంది.

# రీజినల్ రింగ్‌రోడ్డు నిర్మాణంలో కీలక ముందడుగు..

**విశ్వంభర, హైదరాబాద్:** రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణంలో కీలక ముందడుగు పడింది. ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగంలో నాలుగు లేన్ల ఎక్స్‌ప్రెస్ రహదారి నిర్మాణ పనులకు కేంద్ర ప్రభుత్వం టెండర్లు పిలిచింది. గిర్మాపూర్ నుంచి యాదాద్రి వరకు ఎక్స్‌ప్రెస్ రహదారి నిర్మాణం చేపట్టనున్నారు. మొత్తం నాలుగు భాగాలుగా విభజించి.. రూ.5,555 కోట్లతో రోడ్డు నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించారు. రెండేళ్లలో ఆర్ఆర్ఆర్ నిర్మాణం పూర్తి చేయాలని నిబంధనల్లో పొందుపర్చారు.

**ప్యాకేజీ-1:** సంగారెడ్డి జిల్లా గిర్మాపూర్-రెడ్డిపల్లి(34.518.మీ).
**ప్యాకేజీ-2:** రెడ్డిపల్లి నుంచి ఇస్లాంపూర్ వరకు 26 కి.మీ నిర్మాణం.
**ప్యాకేజీ-3:** ఇస్లాంపూర్ నుంచి ప్రజ్ఞాపూర్ వరకు 23 కి.మీ నిర్మాణం.
**ప్యాకేజీ-4:** ప్రజ్ఞాపూర్ నుంచి యాదాద్రి జిల్లా రాయగిరి(43 కి.మీ)

# జనవరి 7న విచారణకు రావాలి

**విశ్వంభర, హైదరాబాద్:** ఫార్ములా ఈ-రేసు కేసులో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు ) ఈడీ నోటీసులు ఇచ్చింది. జనవరి 7న విచారణకు రావాలని అందులో పేర్కొన్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌కు, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డికి కూడా ఈడీ నోటీసులు ఇచ్చింది. జనవరి 2, 3న విచారణకు రావాలని అరవింద్, బీఎల్ఎన్ రెడ్డికి ఇచ్చిన నోటీసుల్లో పేర్కొన్నారు. ఏసీబీ ఎఫ్ఐఆర్ ఆధారంగా పీఎంఎల్ఏ కింద ఈడీ విచారణ చేస్తోంది.

# 190 కొత్త '108' వాహనాల కొనుగోలుకు ఏపీ ప్రభుత్వం నిర్ణయం



**విశ్వంభర, అమరావతి:** వైద్య ఆరోగ్యశాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక ప్రతిపాదనలకు సీఎం ఆమోదం తెలిపారు. ఇకపై 108, 104 సేవలకు సింగిల్ సర్వీస్ ప్రొవైడర్ ఉండనున్నారు. 190 కొత్త 108 వాహనాల కొనుగోలుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 108 అంబులెన్స్ సిబ్బంది, డ్రైవర్లకు అదనంగా ఇకపై రూ.4వేలు ఇవ్వనున్నారు. అందుబాటులోకి కొత్తగా 58 మహాప్రస్థానం వాహనాలు రానున్నాయి. ప్రతి మండలంలో జన ఔషధి స్టోర్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రివెంటివ్ హెల్త్ కేర్‌కు ప్రాధాన్యం ఇచ్చేలా వైద్య శాఖ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సీఎం సూచించారు. వైద్య శాఖలో పెండింగ్‌లో ఉన్న సమస్యలు, తీసుకురానున్న సంస్కరణలపై చర్చించారు. మంత్రి సత్య కుమార్‌తో పాటు, వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

## సాగు చేసే భూమికే పెట్టుబడి సాయం..

**విశ్వంభర, హైదరాబాద్:** సంక్రాంతి నుంచి రైతు భరోసా ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో రైతు భరోసాపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం సమీక్ష నిర్వహించారు. రిమోట్ సెన్సింగ్ డేటా ఆధారంగా సాగు విస్తీర్ణం గుర్తించటంపై చర్చించారు. సాగు విస్తీర్ణం అంచనా వేయగల కంపెనీల ప్రతినిధులతో చర్చలు జరిపారు. ''సాగు చేసే భూమికే పెట్టుబడి సాయం ఇవ్వడం మా ఉద్దేశం. వ్యవసాయశాఖ అధికారుల వద్ద రైతుల పేర్లు నమోదు జరుగుతోంది. పథకం అమలులో కచ్చితత్వం కోసం ఉపగ్రహ డేటా వినియోగిస్తాం. గ్రామాలు, సర్వే నెంబర్ల వారీగా సాగు వివరాలు సేకరిస్తాం'' అని మంత్రి తెలిపారు.

# తెలుగు భాషా, సంస్కృతిని పరిరక్షించుకోవాలి

మొదటిపేజీ తరువాయి

తదితరులు మహాసభల్లో పాల్గొన్నారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తెలుగు మహనీయుల ఫొటో ప్రదర్శనను అతిథులు తిలకించారు. ఈ సందర్భంగా మాజీ చీఫ్ జస్టిస్ ఎన్వీరమణ ''తెలుగు భాషను కాపాడుకుందాం. ఆత్మాభిమానాన్ని పెంచుకుందాం అనే నినాదంతో ఐక్యత చాటేందుకు నలుమూలల నుంచి విజయవాడకు తరలివచ్చిన వారందరికీ వందనాలు''అన్నారు. ''తెలుగు తల్లి ముద్దుబిడ్డ, మహోన్నత వ్యక్తి, తుది శ్వాస వరకూ తెలుగు భాష, సంప్రదాయాల పరిరక్షణ కోసం పోరాడిన యోధుడు రామోజీరావు సభా వేదిక నుంచి మిమ్మల్నందర్నీ చూస్తుంటే.. యావత్ తెలుగు ప్రపంచం నా ముందు సాక్షాత్కరిస్తోంది. విశ్వవ్యాప్తంగా ఉన్న తెలుగువారు మన సంస్కృతి, భాషను మరిచిపోకూడదని.. తెలుగు జాతి కీర్తి ప్రతిష్ఠలు నిత్యం వెలుగొందాలని కోరుకునే వ్యక్తిని నేను. తెలుగు భాషను దేశంలో వంద మిలియన్లకు పైగా మాట్లాడతారు. తెలుగుభాష పలుకుబడి వినసొంపైనది. అది సంగీతంలా ఉంటుంది. సామాన్య ప్రజలు కూడా కవితా ధోరణిలో మాట్లాడగలిగే అందమైన భాష తెలుగు. ఇంత అద్భుతమైన మన తల్లి భాష తెలుగును.. వ్యాపార, రాజకీయ ప్రయోజనాల కోసం వేరే భాష, సంస్కృతి వచ్చి కొల్లగొట్టడాన్ని మనం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరాదు''''తెలుగు భాషా, సంస్కృతిని పరిరక్షించుకున్నప్పుడే మనం గొప్పవారమవుతాం. జాతి మనుగడకు, వికాసానికి ధైర్యం కావాలి. భాష లేకపోతే.. ఎన్ని ఉన్నా చరిత్ర లేని అనాథలం, అక్షరం లేని అభాగ్యులం. మన సంస్కృతి, భాష చిరకాలం నిలిచి ఉండేలా.. శ్రీశ్రీ, ఆరుద్ర, విశ్వనాథ సత్యనారాయణ, సినారెలాంటి గొప్ప కవులు, రచయితలు.. భానుమతి, సూర్యకాంతం, జమున, సావిత్రి, గుమ్మడి, జగ్గయ్య, అక్కినేని, ఎన్టీఆర్, రేలంగి, ఎస్వీఆర్,



ఘంటసాల, మంగళంపల్లి బాలమురళీకృష్ణ, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఇలా ఎందరెందరో దిగ్గజాల ఘనమైన వారసత్వం మనది. ఈ వారసత్వం మరవకండి. మీరు గుర్తుంచుకోండి.. మీ పిల్లలకు గుర్తు చేయండి. 'భాష అనేది భావ వ్యక్తీకరణకు ఒక సాధనం. ప్రస్తుత కర్తవ్యం అభివృద్ధితోపాటు.. భాషా సంస్కృతులను మనం రక్షించుకోవాలి''''ఎన్టీఆర్ వల్ల తెలుగు భాషకు.. ప్రజలకు గౌరవం పెరిగింది. ప్రభుత్వ అవార్డులకన్నా.. సమాజాన్ని మేల్కొలిపే రచనలే మిన్న. తెలుగును పరిపుష్టం చేసేలా ప్రభుత్వాలు ఆలోచించాలి. పత్రికలు, ఛానళ్లు తెలుగు అభివృద్ధికి పాటుపడాలి. తమిళనాడు తరహాలో మన పాలకులూ భాషాభివృద్ధికి కృషి చేయాలి. తెలుగుకు మద్దతిచ్చేవారికే ఓటు అని ప్రజలతో చెప్పించాలి. అలా చెప్పిస్తేనే.. మాతృభాష అభివృద్ధి, వైభవం దక్కుతుంది'' అని జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు.మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్ మాట్లాడుతూ దేశంలో అత్యధిక ప్రజలు మాట్లాడే నాలుగో భాష తెలుగు అన్నారు. ఆంగ్ల భాష మాట్లాడితేనే గొప్ప అనే అభిప్రాయం తప్పు అని తెలిపారు.''దేశంలో అత్యధిక ప్రజలు మాట్లాడే నాలుగో భాష తెలుగు. ప్రపంచంలో అత్యధిక ప్రజలు మాట్లాడే 14వ భాష మన తెలుగు. కవిత్రయం వంటి కవుల కారణంగా తెలుగుకు ప్రాచుర్యం వచ్చింది. దేశభాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణ దేవరాయలు ప్రశంసించారు. తెలుగు భాషా.. సంగీతమా అని రవీంద్రుడు మెచ్చుకున్నారు'' అని శైలజా కిరణ్ తెలిపారు.''రామోజీరావుకు తెలుగు భాషన్నా.. తెలుగు రాష్ట్రాలన్నా ఎంతో ఇష్టం అన్నారు. మనది అని అనుకునేదాన్ని మనం చాలా జాగ్రత్తగా చూసుకుంటాం. కాపాడుకుంటాం. అలాగే తెలుగు భాష మనందరిది. చాలా ముఖ్యమైనది. అందుకే మనమంతా కలసికట్టుగా మన భాషాభివృద్ధి కోసం కృషి చేద్దాం'' అని ఆమె పిలుపునిచ్చారు.

**తరలివచ్చిన భాషాభిమానులు..**

విజయవాడ నగరంలోని కె.బి.ఎన్.కళాశాల ప్రాంగణంలో శనివారం, ఆదివారం జరిగే ఈ వేడుకల కోసం దేశవిదేశాల నుంచి 1500 మందికి పైగా కవులు, రచయితలు, భాషాభిమానులు తరలివచ్చారు. పొట్టి శ్రీరాములు సభా ప్రాంగణంలోని చెరుకూరి రామోజీరావు ప్రధాన వేదికతో పాటు మరో రెండు వేదికలనూ.. సదస్సులు, కవితా, సాహిత్య సమ్మేళనాల కోసం సిద్ధం చేశారు. ప్రపంచ తెలుగు రచయితల సంఘం, కృష్ణా జిల్లా రచయితల సంఘం, కె.బి.యన్.కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో వీటిని నిర్వహిస్తున్నారు.మహాసభల్లో భాగంగా చెరుకూరి రామోజీరావు ప్రధాన వేదికతో పాటు మరో రెండు వేదికలపై రెండు రోజుల్లో 25కు పైగా సదస్సులు, కవితా, సాహిత్య సమ్మేళనాలు జరుగుతాయి. వీటిలో 800 మందికి పైగా భాషాభిమానులకు వేదికలపై పాల్గొనే అవకాశం కల్పిస్తున్నారు. వెయ్యి మందికి పైగా దివంగతులైన ప్రముఖ కవుల ముఖచిత్రాలతో మహాసభల ప్రాంగణంలో ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రాంగణంలోని అన్ని ప్రాంతాల్లోనూ కనిపించేలా దారిపొడవునా కవుల ముఖచిత్రాలే దర్శనమిస్తున్నాయి.రాజకీయ, న్యాయ, పరిపాలనలో తెలుగు ప్రాధాన్యం పెంచే దిశగా ప్రత్యేక సదస్సులు జరుగుతాయి. పత్రికలు, ప్రసార మాధ్యమాలు, ప్రచురణ సంస్థల్లో మాతృభాష ప్రాధాన్యంపైనా సదస్సులు ఏర్పాటు చేశారు. ఇతర రాష్ట్రాలు, మహిళా ప్రతినిధులకు ప్రత్యేకంగా సదస్సులు, తెలుగు భాషా పరిశోధనపై, సాహితీ, విద్యారంగ ప్రముఖులు, భాషోద్యమం, శాస్త్రసాంకేతిక రంగం.. ఇలా అన్నింటిలోనూ మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వాలనే కోణంలో కార్యక్రమాలను వేర్వేరుగా నిర్వహించనున్నారు.



# అశ్రునయనాలతో ఆర్థిక సంస్కర్తకి కడసారి వీడ్కోలు

**ఢిల్లీ:** ప్రఖ్యాత ఆర్థికవేత్త, మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ పార్థివదేహానికి శనివారం అంత్యక్రియలు పూర్తి అధికార లాంచనాలతో నిర్వహించారు.. ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయం నుండి ప్రారంభమైన అంతిమయాత్ర నిగమ్‌బోద్ ఘాట్ వరకు 11 కిలోమీటర్ల మేర సాగింది. ఆర్థిక సంస్కరణలవాదికి తుది వీడ్కోలు పలికేందుకు పార్టీలకతీతంగా రాజకీయ నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున అంతిమయాత్రలో పాల్గొన్నారు. అంతిమయాత్ర సమయంలో మన్మోహన్ సింగ్ పార్థివదేహం ఉన్న సైనిక వాహనంలోనే రాహుల్ గాంధీ ఇతర కాంగ్రెస్ నేతలు కుర్చుకుని స్మశాన వాటికకు చేరుకున్నారు. మిలటరీ వాహనంపై నిగమ్ బోధ్ ఘాట్‌కు పార్థివదేహాన్ని అధికార, సైనిక లాంఛనాలతో తీసుకొచ్చారు. ఆ సమయంలో రోడ్డుకు ఇరువైపులా పెద్ద ఎత్తున జనం నిల్చున్నారు. పూలు చల్లుతూ అంజలి ఘటించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా, కిరణ్ రిజిజు, కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా హాజరై మాజీ ప్రధానికి తుది వీడ్కోలు పలికారు. త్రివిధ దళాల అధిపతులు మన్మోహన్‌కు నివాళులర్పించారు. అంత్యక్రియలకు ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హాజరయ్యారు. భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నాంగ్యల్ వాంగ్‌చుక్, విదేశీ ప్రతినిధులు పాల్గొన్నారు. మన్మోహన్ సింగ్ మృతికి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సంతాపం తెలిపారు. మాజీ ప్రధాని సతీమణి గురుశరణ్ సింగ్, కుటుంబసభ్యులకు బైడెన్ దంపతులు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈమేరకు వైట్‌హౌస్ ఓ ప్రకటన విడుదల చేసింది. సిక్కుల సంప్రదాయంలో మన్మోహన్ సింగ్ అంత్యక్రియలను నిర్వహించారు. ఆ సమయంలో సిక్ పెద్దలు సంప్రదాయబద్ధమైన కృపాణులను ధరించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు ప్రార్థనలను నిర్వహించారు .అనంతరం మన్మోహన్ సింగ్ చితికి ఆయన కూతురు నిప్పంటించారు.అంతకుముందు ఏఐసీసీ ఆఫీస్‌లో మన్మోహన్‌కు ప్రజలు, కాంగ్రెస్ నేతలు నివాళులర్పించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన నేతలు మన్మోహన్ సింగ్‌కు ఘననివాళులర్పించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, ఎంపీ మల్లురవి మన్మోహన్‌కు అంజలి ఘటించారు. ఏపీ కాంగ్రెస్ నేతలు పల్లంరాజు, కేవీపీ రామచంద్రరావు మన్మోహన్ భౌతికకాయానికి పుష్పాంజలి ఘటించారు.








## నాగార్జున సాగర్ డ్యామ్ వద్ద హైడ్రామా



**విశ్వంభర, నాగార్జున సాగర్:** నాగార్జున సాగర్ డ్యామ్ వద్ద హైడ్రామా చోటుచేసుకుంది. జల వివాదం నేపథ్యంలో నాగార్జుసాగర్ డ్యామ్ పర్యవేక్షణ బాధ్యతలను కేఆర్ఎంబీ.. సీఆర్‌పీఎఫ్‌కు అప్పగించింది. ఇరు వైపులా ఆయా రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని ఎస్‌పీఎఫ్ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం కీలక పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ వైపు విధులు నిర్వహిస్తోన్న సీఆర్‌పీఎఫ్ బలగాలు పర్యవేక్షణ బాధ్యతను ఉపసంహరించుకున్నాయి. వారి స్థానంలో ఎస్‌పీఎఫ్ సిబ్బంది రంగంలోకి దిగారు. అయితే, ఏపీ వైపు సీఆర్‌పీఎఫ్ బలగాలు ఉపసంహరణకు ఉన్నతాధికారులు అంగీకరించలేదు. కేంద్రం నుంచి వచ్చిన స్పష్టమైన ఆదేశాలు చూపించాలని అధికారులు డిమాండ్ చేశారు. అదే సమయంలో డ్యామ్ వద్ద విధుల్లో కొనసాగాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో తెలంగాణ వైపు మళ్లీ సీఆర్‌పీఎఫ్ బలగాలు బాధ్యతలు తీసుకున్నాయి.ఈ విషయంపై డ్యామ్ ఎస్ఈ శ్రీధరరావును వివరణ కోరగా.. సీఆర్‌పీఎఫ్ బందోబస్తు గురించి తమకు ఎలాంటి సమాచారం లేదని.. ఈ విషయాన్ని కేఆర్ఎంబీ చూస్తుందని తెలిపారు. సీఆర్‌పీఎఫ్ సహాయ కమాండెంట్ సహీర్ వివరణ కోరగా.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే ఉదయం డ్యాంపై భద్రతను ఉపసంహరించి.. సాయంత్రం తిరిగి విధుల్లోకి చేరినట్లు చెప్పారు.

# అన్నా వర్సిటీలో అత్యాచారంపై మహిళా పోలీస్ అధికారిణిలతో సిట్..

### బాధితురాలికి రూ.25 లక్షల పరిహారం

**చెన్నై:** అన్నా యూనివర్సిటీ క్యాంపస్‌లో విద్యార్థినిపై జరిగిన అత్యాచారం ఘటనపై దర్యాప్తు కోసం మహిళా పోలీస్ అధికారిణులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయాలని మద్రాస్ హైకోర్టు పేర్కొంది. అలాగే బాధితురాలికి రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని శనివారం ఆదేశించింది. తమిళనాడు రాజధాని చెన్నైలోని అన్నా యూనివర్సిటీ క్యాంపస్‌లో విద్యార్థినిపై లైంగిక దాడి జరిగింది. బాధితురాలి ఫిర్యాదుతో ఒక వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. విద్యార్థి సంఘాలతోపాటు ప్రతిపక్షాలు ఈ సంఘటనపై ఆగ్రహం వ్యక్తం చేశాయి.కాగా, ఈ కేసు దర్యాప్తును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)కి బదిలీ చేయాలంటూ మద్రాస్ హైకోర్టు పిటిషన్ దాఖలైంది. జస్టిస్ ఎస్ఎం సుబ్రమణ్యం, జస్టిస్ వీ లక్ష్మీనారాయణలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై శనివారం విచారణ జరిపింది. కేసు దర్యాప్తు కోసం ముగ్గురు మహిళా ఐపీఎస్ అధికారిణులతో కూడిన సిట్‌ను ఏర్పాటు చేయాలని కోర్టు పేర్కొంది. బాధితురాలికి రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే బాధిత విద్యార్థిని చదువు ప్రభావితం కాకుండా చూడాలని, అన్నా యూనివర్శిటీ ఆమె నుంచి ఎలాంటి ఫీజులు వసూలు చేయకూడదని మద్రాస్ హైకోర్టు స్పష్టం చేసింది.

# జనవరి 1 నుంచి ఇండియన్ రైల్వే కొత్త టైమ్‌టేబుల్..!

**ఢిల్లీ:** కొత్త సంవత్సరంలో జనవరి 1 నుంచి నూతన టైమ్‌టేబుల్‌ను అమలు చేయనున్నట్లు భారతీయ రైల్వే విభాగం ప్రకటించింది. 2025 జనవరి 1 నుంచి కొత్త టైమ్ టేబుల్‌ను అమలు చేయనుంది. 'ట్రెయిన్ ఎట్ ఎ గ్లాన్స్' 44వ ఎడిషన్‌కు సంబంధించిన ప్రస్తుత టైమ్‌టేబుల్ 2024 డిసెంబర్ 31 వరకు అమల్లో ఉంటుంది. ఆ తర్వాత రోజు నుంచి కొత్త టైమ్‌టేబుల్ అమల్లోకి వస్తుంది.2025 నాటికి మొత్తం 136 వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు, రెండు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు, నమో భారత్ ర్యాపిడ్ రైళ్లను ప్రారంభించాలని రైల్వే శాఖ యోచిస్తోంది. నూతన రైల్వే టైమ్‌టేబుల్‌లో ఏముంటుంది..? కొత్తగా ఎలాంటి మార్పులు వస్తాయి..? తదితర వివరాలపై స్పష్టత రావాల్సి ఉంది. సాధారణంగా రైల్వే శాఖ ప్రతి ఏడాది జూన్ 30 లోపు 'ట్రెయిన్ ఎట్ ఎ గ్లాన్స్' వర్కింగ్ టైమ్ టేబుల్‌ను విడుదల చేస్తుంది. జూలై 1 నుంచి కొత్త టైమ్ టేబుల్ అమల్లోకి వస్తుంది.అయితే ఈ ఏడాది నిబంధనలను సవరించారు. జనవరి 1 నుంచి కొత్త టైమ్ టేబుల్ అమల్లోకి వచ్చేలా ప్లాన్ చేశారు. ఇదిలావుంటే మహా కుంభమేళా 2025కు సన్నాహకంగా ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) ఈ కార్యక్రమానికి హాజరయ్యే లక్షలాది మంది భక్తులకు ప్రపంచస్థాయి సౌకర్యాలను కల్పిస్తున్నది. దాదాపు 3 వేల ప్రత్యేక రైళ్లను నడపడంతోపాటు లక్ష మందికిపైగా ప్రయాణికులకు ఆశ్రయం కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.జనవరి 10 నుంచి ఫిబ్రవరి 28 వరకు మహాకుంభ్ గ్రామ్‌లో బస కోసం ఆన్‌లైన్ బుకింగ్స్ అందుబాటులో ఉన్నాయి. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్, టూరిజం డిపార్టుమెంట్ వెబ్‌సైట్, మహాకుంభ్ యాప్‌లో అదనపు సమాచారం అందుబాటులో ఉండటంతో.. వాటి ద్వారా సులభంగా రిజర్వేషన్ చేసుకునే అవకాశం ఉంది.

# ఆటుపోట్లను అధిగమిస్తూ అభివృద్ధి దిశగా తెలంగాణ ప్రభుత్వం

### తెలంగాణ బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్



**విశ్వంభర,హైదరాబాద్ :** ఏడాది ప్రగతి బాటలో రేవంత్ సర్కార్ ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ముద్ర ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయని ఆటు పోట్లను అధిగమిస్తూ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరకాలం ముగించిందని బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. శనివారం ఆయన పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేస్తూ మూసి, ఫోర్త్ సిటీ, ఆర్ ఆర్ ఆర్, మెట్రో, గురుకులాల్లో సమీకృత భవనాలు, ఆర్థికంగా ఆటుపోట్లు ఉన్న ప్రగతి బాటలో రేవంత్ ప్రభుత్వం ఒక సంవత్సరం పూర్తి చేసుకుంది అన్నారు. ఏడాది క్రితం అతలాకుతలంగా అప్పుల కుప్పగా ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ రాష్ట్ర రాబడులు నిర్దేశించిన వ్యయాలకే సరిపోయే పరిస్థితి ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు కనిపించని దుస్థితి ఉండేదని నిరాశ జనకంగా రెవిన్యూ విద్య వైద్యం సాగునీటి తదితర రంగాల ఉద్యోగులకు అందాల్సిన ప్రయోజనాలు తీవ్ర నిరాశ నిస్పృహల పాలు చేసినా ధైర్యంగా ముందుకు అడిగేసిన రేవంత్ మార్కు పాలన ఇది అని అన్నారు.

సొంత ముద్ర సరికొత్త ప్రాజెక్టులు

గత ముఖ్యమంత్రులు మాదిరిగానే తన మార్కు అభివృద్ధి కూడా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి భావించి ఉండవచ్చునని అన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు హైటెక్ సిటీని వైయస్ రాజశేఖర్ రెడ్డి రింగు రోడ్డు నిర్మించినట్లుగానే అభివృద్ధిలో సొంతముద్ర ఉండాలని రేవంత్ ఆలోచించారని అందులో భాగంగానే మూసి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు, ఫోర్త్ సిటీ, రీజనల్ రింగ్ రోడ్డు, వట్టి మూడు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు చేపట్టారని అన్నారు. మూసి ప్రక్షాళన పునర్జీవనమే లక్ష్యంగా చేపట్టిన మూసి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు మొత్తం హైదరాబాదు నగరానికి కొత్త కళ తీసుకొని వస్తుంది అనడంలో అతిశయోక్తి లేదు అన్నారు.

సమీకృత గురుకులాలు

ప్రస్తుతం రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ వర్గాల వారికి వేరువేరుగా గురుకులాలు పాఠశాలలు ఉండేవని వాటిని ఒకే గొడుగు కిందకు తీసుకరావాలని రేవంత్ సర్కార్ నిర్ణయం తీసుకుందని వీటన్నిటిని ఒక ప్రాంగణంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పేరిట ప్రతి నియోజకవర్గాల్లో ఒకటి చొప్పున నిర్మించాలని కోవడం ఒక ముందడుగు అని మరోవైపు సాగునీటి రంగాల్లో ఏడాది కాలంలోనే పదివేల కోట్ల వరకు ఖర్చు చేసిందని ఇక ఎన్నికల సందర్భంగా ప్రకటించిన ఆరు గ్యారెంటీలలో కొన్నిటిని ప్రభుత్వం అమలు చేసి చూపించిందని రాజీవ్ ఆరోగ్య శ్రీ, ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల లోపు ఉచిత గృహ విద్యుత్తు, వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు బియ్యం సబ్సిడీ ఉపకార వేతనాలు డైట్ చార్జీల పెంపు కళ్యాణ లక్ష్మి సాదిముబారక్ తదితర పథకాలన్నింటికి 61 వేల 190 కోట్లు ఖర్చు చేసిన ఘనత తమ ప్రభుత్వానిది అని అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రగతి పదం సకల జనహితం ప్రజా ప్రభుత్వం అని అన్నారు.

# వరంగల్ జిల్లాలో డబ్ల్యూజేఐ ఆవిర్భావం



**విశ్వంభర, వరంగల్:** భారతీయ మజ్దూర్ సంఘ్ కు అనుబంధంగా ఏర్పడి పాత్రికేయుల సంక్షేమం కోసం జాతీయ స్థాయిలో కృషి చేస్తున్న వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) వరంగల్ జిల్లాలో ఆవిర్భవించింది. . స్థానిక బాల సముద్రంలో శనివారం జరిగిన సన్నాహక సమావేశానికి జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. డబ్ల్యూజేఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాడూరి కరుణాకర్, రాష్ట్ర కార్యదర్శి శివనాద్రి ప్రమోద్ కుమార్,రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య రామయ్యలు ఈ సమావేశంలో ప్రసంగించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ఇతర యూనియన్లు విఫలమయ్యాయని వారు ఆరోపించారు. అరవయ్యేళ్లుగా జర్నలిస్టులకు ప్రాతినిధ్యం వహిస్తున్నామని చెప్పుకుంటున్న సంఘాల వైఫల్యమే నేటి పాత్రికేయుల దుస్థితికి కారణమని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో నిఖార్సయిన సంఘంగా డబ్ల్యూజేఐ జాతీయ స్థాయిలో ఆవిర్భవించిందని పేర్కొన్నారు. 17 రాష్ట్రాలలో కార్యకలాపాలు నిర్వర్తిస్తూ పాత్రికేయుల సమస్యలపై పోరాడుతోందని తెలిపారు. క్షేత్ర స్థాయిలో పనిచేసే విలేకరులకు ఏ ఆపద వచ్చినా డబ్ల్యూజేఐ అండగా ఉంటుందని తెలిపారు.

జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధి, సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిరంతరం పనిచేసే డబ్ల్యూజేఐలో వరంగల్ జిల్లా జర్నలిస్టులు పెద్ద ఎత్తున చేరాలని కోరారు. కొద్ది రోజుల్లోనే తెలంగాణలో తాము అతి పెద్ద జర్నలిస్టు సంఘంగా ఆవిర్భవించగలమన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

**పాత్రికేయులకు పురస్కారాలు..**

పాత్రికేయులను ప్రోత్సహించేందుకు జనవరిలో రాష్ట్ర స్థాయిలో పురస్కారాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. జనవరి పదో తేదీలోగా ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఈ సందర్భంగా పురస్కారాలకు సంబంధించిన బ్రోచర్ ను విడుదల చేశారు.







ఉప్పల్ మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీలో బీజేపీ వీ సందీప్ యాదవ్ నిర్వహించిన అయ్యప్పస్వామి మహా-పడిపూజకు హాజరైన బీజేపీ ఈటెల రాజేందర్, ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్, వీహెచ్‌పీ రవింతుల శశిధర్.
- విశ్వంభర, ఉప్పల్

# కొత్త సంవత్సరం వేళ.. చలో అయోధ్య..

### హోటల్స్ అన్నీ ఫుల్..!

**అయోధ్య:** కొత్త సంవత్సరం వేళ అయోధ్య నగరం పర్యటకులతో కళకళలాడనుంది. నూతన ఏడాదిలోకి అడుగుపెట్టడం, అలాగే బాలరాముడు కొలువుదీరి సంవత్సరం పూర్తి కావొస్తుండటంతో భారీగా భక్తులు తరలిరానున్నారు. దాంతో ఎలాంటి నిర్వహణ లోపాలు తలెత్తకుండా అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే దర్శన వేళలు పెంచుతూ రామ జన్మభూమి తీర్థక్షేత్రట్రస్ట్ నిర్ణయం తీసుకుంది.

''భక్తులకు స్వాగతం పలికేందుకు అంతా సిద్ధంగా ఉంది. జనవరి 15 వరకు హోటల్ గదులన్నీ ముందుగానే బుక్ అయ్యాయి'' అని స్థానిక హోటల్ యజమాని అంకిత్ మిశ్రా వెల్లడించారు. చాలా తక్కువ సంఖ్యలో మాత్రమే గదుల లభ్యత ఉందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇదే అదనుగా కొందరు హోటళ్ల యజమానులు ఒక్కరోజుకు రూ.10వేల వరకు వసూలు చేస్తున్నట్లు వెల్లడించాయి. ''రాముడి ఆలయం, హనుమాన్‌గఢి, లతాచౌక్, గుప్తర్ ఘాట్, సూరజ్‌కుండ్, ఇతర ప్రఖ్యాత స్థలాల వద్ద భారీగా భద్రతా ఏర్పాటు చేశాం'' అని అయోధ్య పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు.ఈ ఏడాది జనవరి 22న అయోధ్య రామమందిరం లో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ అత్యంత వైభవంగా జరిగిన సంగతి తెలిసిందే. ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా బాలరాముడికి గర్భగుడిలో ప్రాణప్రతిష్ఠ శాస్త్రోక్తంగా జరిగింది. ఆ వేడుకకు దేశ, విదేశాల్లోని అత్యంత ప్రముఖులు, స్వామీజీలు కలిపి దాదాపు 7 వేల మంది విచ్చేశారు. రాజకీయ, సినీ, క్రీడా రంగానికి చెందిన ప్రముఖులు ప్రాణప్రతిష్ఠ వేడుకను ప్రత్యక్షంగా వీక్షించి పులకించిపోయారు.అయోధ్య, వారణాసి ఆలయాలను దర్శించుకునే భక్తుల కారణంగా..ఉత్తరప్రదేశ్‌కు పర్యటకులు భారీగా తరలివస్తుంటారు. ''రామ మందిర ప్రారంభం తర్వాత మొదటి ఆరు నెలల్లో యూపీకి పర్యటకుల రాక గణనీయంగా పెరిగింది. ఒక జనవరిలోనే రికార్డు స్థాయిలో ఏడుకోట్లమంది సందర్శించారు'' అని ఇటీవల యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.



# రేవంత్ రెడ్డి మాటల ముఖ్యమంత్రి తప్ప.. చేతల ముఖ్యమంత్రి కాదు : హరీశ్‌రావు



**విశ్వంభర, హైదరాబాద్:** యువత ముందుకు వచ్చి హాస్టళ్లను దత్తత తీసుకొని పిల్లలకు సేవ చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. పిల్లలకు సేవ చేస్తే భగవంతునికి సేవ చేసినట్టే.. మానవ సేవయే మాధవ సేవ అని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా నాసరపుర కేంద్రంలోని అర్బన్ రెసిడెన్సియల్ బ్రిడ్జి స్కూల్‌లోని విద్యార్థులకు స్వెట్లర్లు, దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. డిసెంబర్ 31 దావత్‌లను బంద్ చేసి.. ఆ డబ్బుతో హాస్టళ్లను దత్తత తీసుకోవాలని రాష్ట్రంలోని యూత్, యువజన సంఘాలకు పిలుపునిచ్చారు.చలికాలంలో హాస్టల్‌లో వేడి నీళ్లు రాక, ప్రభుత్వం దుప్పట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని హరీశ్‌రావు తెలిపారు. గత 4 నెలల నుంచి మెస్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ ఛానల్ పెట్టి రాష్ట్రంలో ఒక్క రూపాయి బిల్లు పెండింగ్ లేదని శాసన సభ సాక్షిగా చెప్పారని ప్రస్తావించారు. ఇదేనా గ్రీన్ ఛాలెంజ్ అని ప్రశ్నించారు. జీతం అగొచ్చు కానీ మెస్ బిల్లులు మాత్రం ఆగవు అన్న సీఎం మాట ఏమైందని నిలదీశారు. ముఖ్యమంత్రి మాటలు కోటలు దాటుతున్నాయి కానీ చేతలు గడప దాటడం లేదని విమర్శించారు.

రేవంత్ రెడ్డి మాటల ముఖ్యమంత్రి తప్ప చేతల ముఖ్యమంత్రి కాదని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి పరిపాలన మీద పట్టు కోల్పోయారని.. ఈ ప్రభుత్వం ఫెయిల్ అనిపిస్తుందని చెప్పారు. అసెంబ్లీలో చెప్పిన మాటలు అమలు కాకపోవడం దారుణమని విమర్శించారు. ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేయడం లేదని మండిపడ్డారు. మహాలక్ష్మి, తులం బంగారం ఎటు పోయాయని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి మాటలు అధికారులు వినడం లేదా లేక ముఖ్యమంత్రి ఉత్త మాటలు చెప్పానని అధికారులకు చెబుతున్నారా అని సందేహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి అంటే అధికారులకు భయం లేదా విలువ లేదా.. గౌరవం లేదా అని నిలదీశారు.

తక్షణమే అన్నిచోట్ల మెస్ చార్జీలు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. అన్ని శాఖలు మీ దగ్గర పెట్టుకొని ఎందుకు రివ్యూ చేయడం లేదని నిలదీశారు. ఢిల్లీ పైసలు ఇచ్చినా గల్లీ విడుదల చేయడం లేదని విమర్శించారు. రూ.1300కి పెంచిన మెస్ ఛార్జిలు ఇప్పటికీ అమలు కాలేదని తెలిపారు. అర్బన్ రెసిడెన్షియల్‌లో రూ.1,050 మెస్ ఛార్జిలు మాత్రమే ఇస్తున్నారని పేర్కొన్నారు. 1 నుంచి 7 తరగతి వరకు 1300, ఎనిమిదో తరగతికి రూ.1500 మెస్ ఛార్జిలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాస్మోటిక్ ఛార్జిలు ఇంకా 100 రూపాయలు మాత్రమే ఇస్తున్నారని.. వాటిని 150 రూపాయలకు పెంచి ఇవ్వాలన్నారు. తల్లిదండ్రులకు దూరంగా రెసిడెన్షియల్ స్కూళ్లలో ఉన్న విద్యార్థులపై ప్రభుత్వం మరింత బాధ్యతగా ఉండాలని హరీశ్‌రావు సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి ఏ విషయంలో కూడా మాట నిలుపుకోలేదని హరీశ్‌రావు విమర్శించారు. ఏ విషయంలోనూ చెప్పిన మాటకు క్షేత్రస్థాయిలో పొంతన లేదని అన్నారు. అసెంబ్లీ లో చెప్పినట్లుగా తక్షణమే మెస్ బిల్లులు, కాస్మోటిక్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.





నేను సేవ చేసిన న్యాయ వ్యవస్థ పుస్తకాన్ని ఆవిష్కరించిన భారత దేశ సమాచార కమిషన్ మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్, మాజీ న్యాయమూర్తి మంగారి రాజేందర్.
(విశ్వంభర, హైదరాబాద్)

# ఫార్ములా- ఈ కేసులో నిందలే తప్ప.. నిజాలు లేవు : కేటీఆర్



**విశ్వంభర, హైదరాబాద్:** ఫార్ములా ఈ కార్ రేసు కేసులో కాంగ్రెస్ ప్రభుత్వం తనపై చేస్తున్నది ఉద్దేశపూర్వక, నిరాధారమైన నిందారోపణలే తప్ప నిజాలు ఎంత మాత్రం లేవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. సర్కార్ మోపిన అబద్ధాలను తాను ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలపై ఆయన కౌంటర్ దాఖలు దాఖలు చేశారు. ఆ కౌంటర్‌లో అనేక విషయాలను వెల్లడించారు.ఫార్ములా ఈ కార్ రేసు విషయంలో కాంగ్రెస్ సర్కార్ తనపై చేస్తున్న ఆరోపణల్లో ఎంతమాత్రం నిజం లేదని ఆ కౌంటర్‌లో కేటీఆర్ బదులిచ్చారు. ఫార్ములా ఈరేస్ సీజన్ 10 నిర్వహణను స్పాన్సర్ లేకపోవడం వల్లే ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని వివరించారు. ఈ మొత్తం వ్యవహారంలో కుట్ర లేదని.. అవినీతి అంతా కన్నా లేదని స్పష్టం చేశారు. హైదరాబాద్ ప్రతిష్ఠను పెంచడం కోసం తీసుకున్న నిర్ణయం మాత్రమే అని తెలిపారు. ఫార్ములా ఈరేస్ మరో సీజన్‌ను కూడా హైదరాబాద్‌లో నిర్వహించడానికి తీసుకున్న ఒక విధానపరమైన నిర్ణయం మాత్రమే పేర్కొన్నారు.


ఫార్ములా ఈరేస్‌కు సంబంధించి ప్రభుత్వం చేస్తున్న వాదన అర్థరహితమని కేటీఆర్ అన్నారు. ఎన్నికలున్న నేపథ్యంలో ఎన్నికల ప్రవర్త నియమావళిని అతిక్రమించారని చేస్తున్న ప్రభుత్వ వాదనను ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. 'ఎలక్షన్ కోడ్ ఉల్లంఘన జరిగితే ఎలక్షన్ కమిషన్ నోటీసులు ఇవ్వాలి. అది ఇప్పటి వరకు జరగలేదు. ఎలక్షన్ కమిషన్ తరుపున మీరు ఎందుకు వకాల్తా పుచ్చుకున్నారు? అని ప్రశ్నించారు. ఫార్ములా ఈరేస్ వల్ల రాష్ట్రానికి రూ.700 కోట్ల ప్రయోజనం చేకూరిందని నీల్సన్ రిపోర్ట్ పేర్కొన్న విషయాన్ని ఆయన ఉదహరించారు. ఫార్ములా ఈరేస్ చేజారిపోకూడదని రూ.54 కోట్ల చెల్లింపులను గతంలో తాను ప్రాతినిధ్యం వహించిన శాఖ జరిపిందన్నారు. చెల్లింపులు అక్రమం కాదని స్పష్టం చేశారు. అయితే, రూ.54 కోట్లు కాస్త 600 కోట్లు ఎట్లా అయ్యాయి? ఆ లెక్క ఇప్పటివరకు తమకు కనిపించలేదని అన్నారురు. అది పూర్తిగా నిరాధారమైన ఆరోపణ అని తేల్చిచెప్పారు. ఫార్ములా ఈరేస్‌లో మొత్తం రూ. 600 కోట్ల అవినీతి జరిగిందని ఊకదంపుడుగా, ఉద్దేశపూర్వకంగా ఆరోపణలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రూ. 600 కోట్ల అవినీతి అని తన మీద బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.హెచ్ఎండీఏ అధికారాలకు లోబడే రూ. 54 కోట్లు చెల్లింపులు ఫార్ములా ఈ సంస్థకు బదిలీ జరిగిందని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం చెప్పే రూ. 8 కోట్లు టాక్స్ రిటర్న్స్ మాత్రమే అని.. స్పాన్సర్ ఆ పన్నును భర్తీ చేస్తారని తెలిపారు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ద్వారా జరిగిన చెల్లింపులు అన్నీ నిబంధనల ప్రకారమే జరిగాయని అన్నారు. 'రూ. 54 కోట్లు ఫార్ములా ఈ నిర్వాహకులకు ఇచ్చినప్పుడు, ఒకవేళ మీరన్నట్టు అవినీతి జరిగితే మరి ఫార్ములా ఈ సంస్థ మీద కేసు ఎందుకు వేయలేదు? ఇప్పటి వరకు నాకు రూపాయి కూడా ముట్టినట్టు మీరు చూపించలేకపోయారు. ఇవి కక్షపూరిత ఆరోపణలే కానీ నేరం జరిగిందని చెప్పే రుజువులు కాదు. ఫార్ములా ఈ వల్ల ఒకవేళ నష్టం జరిగితే అది కేవలం రేవంత్‌రెడ్డి అర్థరహిత నిర్ణయాలు, ఆలోచన లేని పనుల వల్ల మాత్రమే జరిగింది' అని కేటీఆర్ దాఖలు చేసిన కౌంటర్‌లో స్పష్టం చేశారు.






# మానవతా మధురిమను పూయించడానికి...

# అమ్మ పిలుస్తోంది




**ఆయన పెదవి విప్పితే చాలు:** పున్నాగలు పుట్లకుపుట్లుగా పూస్తాయి. ఆయన కలం కదిపితే చాలు; జుంటి తేనెలు బుస్సబుస్స పొంగుకొస్తాయి. ఆయన గళం కలిపితే చాలు; ఆమని ఎంతో మధురంగా హిందోళం అలపిస్తుంది. ఆయన అక్షరాలను ఆసువోస్తే చాలు; పచ్చదనం ఎంతో రమణీయంగా ఉప్పొంగుతుంది. ఆయన తరగతి గదిలో అడుగు పెడితే చాలు; అజ్ఞానపు చీకట్లు తోకముడిచి, విజ్ఞాన వీచికలు విస్తరిస్తాయి. అతడు వేలాది విద్యార్థుల హృదయాలపై చెరగని సంతకం చేసిన ఆదర్శ ఉపాధ్యాయుడు. అతడు మనిషి కోసం కలం పట్టిన కవి. అతడు మానవత కోసం గళం విప్పిన రవి. అతడు కవనవనంలో అర్ధగౌరవాన్ని ఏపుగా పెంచి పోషించిన ఆధునిక భారవి. తెలంగాణ మట్టిలో పుట్టిన గట్టిపిండమతడు. అతడే మన మహోపాధ్యాయ, మధురకవి, డా. లింగంపల్లి రామచంద్ర గారు. "కవిగా, విమర్శకుడుగా, అధ్యాపకుడుగా గణనీయమైన సేవలందించిన వాఙ్మయమూర్తి డా. లింగంపల్లి రామచంద్రగారు. అతని సృజనాత్మక ప్రతిభకు 'అమ్మ పిలుస్తోంది', 'ఆకాశం నా సంతకమే' లాంటి కవితా సంపుటులు తులలేని తార్కాణాలు. అతని విమర్శనాత్మక పటిమకు "సినారె కవితా లోకనం", 'శ్రీరంగరాజు కేశవరావు సాహిత్యం-పరిశీలన" లాంటి గ్రంథాలు గీటురాళ్ళు". అని జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, డా. సి.నా.రె. గారిచే శ్లాఘించబడ్డారు.

సుప్రసిద్ధ సాహితీవేత్త డా. లింగంపల్లి రామచంద్ర గారు కవిగా 'ఆత్మ అక్షరమైన వేళ', 'ఎప్పుడూ వసంతానివే' అనే రెండు వచన కవితా సంపుటుల ద్వారా తన సృజనాత్మక ప్రతిభను దశదిశలా చాటుకున్నారు. తెలుగు సాహితీ క్షేత్రంలో కవిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. అటు పిమ్మట1997 ఈశ్వర నామ వత్సరంలో అపురూపంగా 'అమ్మపిలుస్తోంది' అని ముచ్చటగా మూడవ కవిత్వ సంపుటిని సాహితీలోకం ముందుంచారు. ఇందులో కవి ఇరవై తొమ్మిది వస్తు వైవిధ్యమైన శీర్షికలతో కవిత్వాన్ని ఆలంకారికంగా, తనదైన అభివ్యక్తితో రమణీయమైనశైలిలో కమణీయంగా వండి వార్చారు. ఈ కావ్యం ఆసాంతం చదివితే; షడ్రసోపేతమైన భోజనం చేసిన అనుభూతి కగులుతుంది. పాఠకునికి గొప్ప సంతృప్తి మిగులుతుంది; సామాజిక సందేశం అందుతుంది. మాతృభాష పట్ల మమకారం, దేశభక్తిభావం ఉప్పొంగుతాయి. రామచంద్రకవి నిశ్శబ్ద భావుకుడు, అధ్యయశీలి, సహృదయుడు, అన్నింటికి మించి మానవతావాది. ఆయన రాసిన కవిత్వంలోనే అవన్నీ అక్షరరూపంలో సాక్షాత్కరిస్తాయి. బహుముఖ ప్రజ్ఞాశాలి, డా. లింగంపల్లి రామచంద్ర గారి కవిత్వాన్ని తూచడానికి సరితూగే తూనికరాళ్ళు నా చెంతన లేవు. కానీ అతని కవిత్వ రచనా రుచిని చూపించే ప్రయత్నం మాత్రం చేస్తాను. మహాకవి దాశరథి కృష్ణమాచార్యులు ఓ చేత్తో అంగారాన్ని, మరో చేత్తో శృంగారాన్ని అద్భుతంగా పండించినట్టు, లింగంపల్లి రామచంద్ర గారు భిన్నత్వంలో ఏకత్వంగా భాషిల్లే భారతీయ అస్తిత్వతత్త్వాన్ని మరియు సామాజిక అస్తిత్వాన్వేషణతో సాగే సామాజిక అస్తిత్వవాదాన్ని ఈ గ్రంథంలో సమాంతర రేఖలుగానే ప్రోదిచేశారు. తానొక కవిత్వపు చెట్టై భారతీయతత్త్వ శాంతికాముకతను పూయించారు. లోకానికి మానత్వపు మధిరిమను రుచిచూపించారు.

శాంతి, సౌఖ్యం, సత్యం, అహింసలు పరిఢవిల్లిన కర్మభూమిలో... "ఎలుకలూ పందికొక్కులూ సమష్టిగా తవ్వి / పోగులు పోసిన పేదవాని ఇల్లులా వుంది / కష్టజీవులు చెమటోడ్చి సంపాదించిన ధనాన్ని / దొంగలు దోచుకొని విసరివేసిన సత్తుపెట్టెలా వుంది / గజాసురులను లాగలేక లాగలేక పంచప్రాణాలు బిగబట్టి / రెండు రూపాయల కోసం పిండియైపోతున్న రిక్షావాని ఎముకల గూడులా వుంది" వర్తమానం. ఈ కవితలో వికృత రూపాల విళయతాండవాన్ని కవి ప్రతీకాత్మకంగా కళ్ళముందుంచారు. నిత్యం అడ్డూ అదుపూ లేకుండా కొనసాగుతున్న దుశ్శాసన పైశాచికత్వాలను దునుమాడుతారు. చెట్టు పేరు చెప్పి పండ్లు అమ్ముకుని, పండగ చేసుకునే పెత్తనాలను వేలెత్తి చూపుతారు. చిరిగిన విస్తరిలాగా దుర్భరమైన అనాథ బాలల జీవితాలను ఎత్తి చూపుతారు. పచ్చని సమాజ సస్యను చీడల్లా పట్టిపీడిస్తున్న స్వార్థం, పదవీ వ్యామోహం, విద్వేషం, అంగబలం, అర్థబలం, అధికారబలం, అవినీతి, ఆశ్రితపక్షపాతం, బంధుప్రీతి, లంచగొండితనాలను నిర్మోహమాటంగా ఎండగడతారు. సుమారు మూడు దశాబ్దుల క్రితం రామచంద్ర గారు "వర్తమానం" కవిత రాశారు. ఈనాటి వర్తమానానికి కూడా ఆయన కవిత్వం దర్పణం పడుతున్నది. నిచ్చెన పేరుతో రాసిన కవితలో "రాలిపడ్డ ఒక్క నక్షత్రం చాలు / రోదసి చిల్లులు పడిందని చెప్పడానికి / ఎముకలగూళ్ళు పాటలు పాడితే / ఇక్కడి మేడలు దిగొచ్చి ముద్దెట్టుకోవు / మొగ్గలను నిమిరితే పువ్వులై సువాసించవు" అంటుంది కవి హృదయం. తాను ఉపాధ్యాయులుగా ఎందరో పేద పిల్లల జీవితాలను తడిమి చూశారు. వారి హేయమైన జీవితాలను చూడలేక కన్నీళ్ళను రాల్చారు. ఆ పూరి గుడిసెల్లో వెలుతురు ఎగజిమ్మడానికి చదువొక్కటే ఆధారమని, చదువును సాధనంగా మలుచుకొని, అంచెలంచెలుగా ఎదుగుతూ జీవిత శిఖరాలను చేరుకోవాలని కవి కాంక్షించారు. ప్రజాకవి కాళోజీ అన్నట్టూ "వ్యక్తిత్వం-కవిత్వం రెండూ ఆదర్శాన్ని కలిగి ఉన్నట్టివే. నిజాయితీగా ఉండి నిజాయితీ కోసం రచనలు చేస్తున్న డా. లింగంపల్లి రామచంద్ర సహజంగా మానవతావాది". అవును నిఖార్సైన మనిషితనాన్ని నిటారుగా నిలబెట్టడానికి నినదించిన అక్షరాల పిడికిలి ఆయన. మానవ కల్యాణానికి కంకణం కట్టుకున్న కవి ధీశాలి.

తెలంగాణలో మతాల అడ్డుగోడలు తెలియకుండా, అంతరాలు ఎరుగకుండా మనుషులంతా కలిసి మెలిసి జీవించే ఆదర్శ విధానమున్నది. ఇక్కడ హిందూముస్లీంలు గంగాజమునా తహజీబులా అన్నదమ్ముల్లా సహజీవనం చేస్తారు. ఒకరి సంస్కృతీ సంప్రదాయాలను మరొకరు గౌరవించుకుంటారు. అందుకే ఇరువురి జీవన విధానాల్లో ఆదాన ప్రదానాలు జరిగిన ఆనావాళ్ళు అనేకంగా కనిపిస్తాయి. ఇలా సమరస భావంతో పచ్చపచ్చగా సాగిపోతున్న జీవితాల్లో నీచ రాజకీయం ఉచ్చులు పేనిన వైనాన్ని కవి చాలా ఆర్ద్రంగా అక్షరీకరించారు. "మన గాయాల రక్తాన్ని వాళ్ళు / పండగ చేసుకొంటున్నారు చూడు / నీకు అగ్నిగోళాలు యిచ్చారు / నాకు బాంబులను యిచ్చారు / అగ్ని జ్వాలల్లో మనం తగలబడిపోతుంటె / అందలం వాళ్ళు కులికిపోతున్నారు". అంటూ ఇద్దరి మనస్సుల్లో ద్వేషాన్ని చిలికి, దూరాలను పెంచిన ఊసరవెల్లి రంగుల రాజరికపు గుట్టురట్టు చేశారు రామచంద్ర గారు. మతతత్త్వపు మంటలతో చలి కాగుతున్న మేక వన్నె మెకాల ముసుగు తీశారు. 'మతములన్నియు మాసిపోవును... జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును' అన్నారు మహాకవి గురజాడ. ఇప్పుడు అటువంటి సమాజం కనుచూపు మేరలో కనిపించడం లేదు. నేటి భారతంలో రాజకీయ వ్యాపారానికి మతమే ముడిసరకవడం బాధాకరం. 'మానవత్వం వద్దు... మతతత్వమే ముద్దు' అంటున్న అరాచక మూకల మూలంగా రాజ్యాంగ మౌలిక సూత్రమైన లౌకికవాదం తెగిన గాలిపటమవుతోంది. పోనుపోను పదును తేలుతున్న మత విద్వేషాల విచ్చుకత్తుల ధాటికి 'మనమంతా మానవులం... మనదంతా ఒకే కుటుంబం' అనే భారతీయ సాంస్కృతిక ఔన్నత్యం ఛిద్రమవుతోంది. 'ఇది 21వ శతాబ్దం, మతం పేరిట మనమెక్కడికి దిగజారుతున్నా'మంటూ సుప్రీం కోర్టు సైతం ఇటీవల తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. 'విద్వేష నేరాలను ఉపేక్షిస్తే ఏదో ఒకరోజు అవి మీ తలుపూ తడతాయి. ఆపై అమాయకుల ప్రాణాలెన్నో కడతేరిపోతా'యని సర్వోన్నత న్యాయస్థానం అందరినీ హెచ్చరించింది కూడా. మతసామరస్యం మంటగలుస్తున్నందుకు రామచంద్రకవి తల్లడిల్లుతారు. మదిమదిలో మానవతా బీజాక్షరాలను జల్లుతారు. ఇకనైనా బాధితులు మేలుకోవాలి. మత కలహాలు మానుకోవాలి. తల్లి భారతికి ఇద్దరూ రెండు కళ్ళలాంటి వారే. హిందూముస్లీం భాయీభాయీగా ఇరువురు కలిసి 'ఏకపతాక'ను ఎగరేయాలని కవి పిలుపునిచ్చారు.

నైతికంగా పతనవుతున్న జాతిని చూసిన రామచంద్రకవి, తన అంతర్వేదనను అక్షరాలా వ్యక్తం చేస్తారు. ఆ ఆవేదనే ప్రాణసంవేదనగా నిలిచిన ఆయన 'జీవన గీత'ను పరిశీలిద్దాం. "నేల భూకంపాలను కప్పేసుకున్నప్పుడు / నింగి మడచిన గొడుగులా మారిపోతుంది / నింగి అణ్వస్త్రాలను మింగేసినప్పుడు / నేల కురూపిలా మిగిలిపోతుంది / వీణతీగెల మీద ప్రవహిస్తున్న పాటలో / మనస్సు రాగాలను నెమరువేసుకుంటుంది". ఇది సమాజం పట్ల కవికున్న నిబద్ధతను తెలుపుతుంది. అరాచకాలు అంతమవ్వాలన్న ఆకాంక్షను, శాంతిపూలు పూయించాలన్న తపనను వెల్లడిస్తుంది. మనసులో మాలిన్యం పొంగులెత్తుతున్నప్పుడు ఇంటి ముందు కుండీలలో గులాబీలు పూయించడమెందుకు? అని నిలదీసే ఖలేజానిస్తుంది. మనస్సులో క్రౌర్యం పడగలు విప్పుతున్నప్పుడు మణిదీపాలను వెలిగించడమెందుకు? అని అధిక్షేపించే ధిక్కార స్వరమిస్తుంది. ఆటవికం, అమానవీయం, అహేతుకం, అనాగరికం, అప్రజాస్వామ్యం అంతమై మానవతా పరిమళాలు లోకాన వెల్లివిరియాలని పరితపించే మనసునిస్తుంది. "ప్రతి కవితలో వస్తుపరంగానూ, రూపపరంగానూ, సమానమైన శక్తిని రామచంద్ర ప్రదర్శిస్తాడు. వస్తువు తనకున్న దానికి న్యాయం చేస్తూనే ప్రక్రియాపరమైన ప్రయోజనాన్ని కూడా సంతరించడంలో కృతార్థుడయ్యాడు. అభివ్యక్తిలో తనదైన ముద్రను సాధించాడు" అని ఆచార్య నాయిని కృష్ణకుమారి గారు కితాబిచ్చినట్టు రామచంద్రకవి కవితా వస్తువు ఎంపికలో, అభివ్యక్తి ప్రకటనలో, శిల్ప నిర్మాణంలో పాటించిన పద్ధతి, నడిపించిన శైలిని చూస్తుంటే ఆయన ప్రదర్శించిన విన్నాణం ద్యోతకమవుతుంది. మానవీయ కోణాన్ని దర్శింప చేసిన తీరుకు పాఠకుడు ముగ్ధుడవుతాడు. దివ్యమైన, నవ్యమైన, భవ్యమైన, భరతభూమిని ఎన్నో కలాలు కీర్తించాయి. మరెన్నో గళాలు అర్చించాయి. ప్రపంచానికే జ్ఞానభిక్ష పెట్టిన పుణ్యభూమి గొప్పతనాన్ని గురించి ఎంత చెప్పినా ఎక్కువే కదా!. భరతమాత ముద్దుబిడ్డడైన ఒక మహాకవి కలం నుండి జాలువారిన ఈ పద్యామృతాన్ని చవిచూద్దాం. "సగర మాంధాతాది షట్చక్రవర్తుల... మాతలకు మాత సకలసంపత్సమేత".

అమ్మలను కన్న అమ్మని... సకల సంపదలకు నెలవైనదంటూ గుణ్టం జాషువా భరతమాత గొప్పదనాన్ని మనోహరంగా వర్ణించారు. ఇప్పుడు డా. లింగంపల్లి రామచంద్ర గారు భారత దేశం ఔన్నత్యాన్ని, ప్రాశస్త్యాన్ని 'నాద బిందువులు'గా అభివర్ణించిన తీరు అద్భుతం. "ఈ దేశపు సంస్కృతికి సంకేతంగా / కోకిలల కాకలీ కూజితాలలో / చెట్లు మిగిల్చిపోయిన ఆశ్రమాల నీడలలో / రుక్కులు ఒలికించిన అక్షరాల జాడలలో / రుషులు పంచిన జీవన మధూళిమలో / నా ప్రజావళి సేద తీర్చుకుంటూంది / వేల సంవత్సరాలు వెళ్ళిపోయినా నవనవంగా శోభిస్తుంది" అంటారు. ఇక్కడి అణువణువూ నాద బిందువుల్లో తడిసిపోయింది. అభ్యుదయ కాముకత్వాన్ని అలుముకున్నది. జంతు సంస్కృతిని పాతరేసిన పవిత్ర భూమి ఇదేనని భారతమాత విశిష్టతను కవిత్వీకరించారు.

ఒక సమస్యను సాధించుకోవడానికి అధములు అనేక సమస్యలను సృష్టించుకుంటారు. హింసాత్మక ధోరణులతో వాటిని ఇంకింతా జటిలం చేసుకుంటారు. ఉన్మాదంతో పెట్రేగి, ఉక్కిరిబిక్కిరై పోతుంటారు. ఇలా సమాజ శాంతికి భంగం కలిగించే దుష్ట వైఖరులను రామచంద్రకవి ఏగించుకుంటారు. ఎలుకల బాధకు ఇల్లు తగులబెట్టే మూర్ఖత్వాన్ని ఈసడించుకుంటారు. "ద్వేషాన్ని పెంచుకునే వాళ్లకు / ప్రతి నిమిషం అగ్ని కణంలా తాకుతుంది / ప్రేమను పంచే వాళ్లకు / అన్ని రుతువులు వసంతాలలా గుబాళిస్తాయి" ఇందులో అక్షరామృతం ఒలికించారు. చదువుతో గుడిసెలను వెలిగించుకోవచ్చు. సంస్కృతితో దేశాన్ని నడిపించుకోవచ్చు. అందుకోసం తాను అక్షర సైనికుడి అవతారమెత్తుతారు. "కోకిలల కోసం తెచ్చిన ఆమనిని / కాకాలు తన్నుకు పోతున్నాయి / చకోరాల కోసం తెచ్చిన చంద్రిమను / రాబందులు ఎత్తుకుపోతున్నాయి". ఆ అన్యాయాలను, అక్రమాలను, అరాచకాలను, అమానవీయపోకడలను చూస్తూ, ఊరుకోలేనని హెచ్చరించారు. అమానుషాన్ని తుడిచిపెట్టి, దౌష్ట్యాన్ని తుదముట్టించి, మానవతా గుర్తున్న జెండాను ఎవరు వేస్తానని శపథం చేస్తారు కవి. 'నా పాట'ను స్వేచ్ఛగా ఆలపిస్తూ, మానవత గుర్తున్న జెండాను ఎగురవేస్తారు. ఊహలకు కళ్ళు ఉండాలి కానీ జీవితమంతా వసంతం పులుముకుంటుంది. అందుకే మనస్సుతో చూడడం నేర్చుకో, కళ్ళతో వెతకడం నేర్చుకో అప్పుడే మానవత నిలుస్తుంది దేవతగా అని ఆశాభావం వ్యక్తపరిచారు. సంఘంలో శాంతి సామరస్యాల సాధనకు బాధ్యత గల పౌరునిగా ముందు నిలిచారు. దినదినం భారతదేశంలో విజాతీయ విషసంస్కృతి మూల్యాల ప్రభావం పెట్రేగిపోతున్నదని, జాతీయ భావానికి పెనుముప్పు విటిల్లుతున్నదని, ఈ పీడల పీచమణచడానికి కవిగా కలాన్ని చేబూని పోరాడతానంటున్నాడు. "ఎప్పుడో ఒకప్పుడు మనిషన్నవాడు కలాన్ని చేత్తోపట్టుకొని / అమ్మనుదుటి కాశ్మీర తిలకాన్ని కాపాడుతాడు". దేశ సమైక్యత, సమగ్రత, సార్వభౌమత్వాలను కాపాడుకోవడంలో కలంకారుల కర్తవ్యాన్ని ప్రబోధించారు. "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" విశ్వజనీనమైన వాల్మీకి వాక్యాన్ని గుర్తుకు తెచ్చారు. ఎవరికైనా కన్నతల్లి, కన్ననేల, స్వర్గం కంటే కూడా గొప్పవి కదా!. చెమట బిందువులు ఆవిరైన శరీరం నుంచి నెత్తుటి చుక్కలు సమస్యల్ని చుట్టేసుకున్న జ్ఞాపకాలకు రామచంద్రకవి అక్షర రూపమిస్తూ... "నరాల్లో ప్రవహిస్తున్న విద్యుత్తును / మింటికెగిసిన మేడలే జుర్రుకుంటున్నాయి / నిగనిగ మెరిసే చూపును / ఖాళీగేట్లే దోచేసుకుంటున్నాయి / చర్మం మీది లావణ్యాన్ని / పూలకుండీలు సొంతం చేసుకుంటున్నాయి". తరతరాలుగా నిరాటంకంగా నిర్భయంగా కొనసాగుతున్న శ్రమదోపిడీని నిరసించారు. "విరామ మెరుగక పరిశ్రమించే బలం ధరిత్రికి బలికివించే, కర్షక వీరుల కాయం నిండా, కాలవ కట్టే ఘర్మ జలానికి, ఘర్మ జలానికి, ధర్మ జలానికి, ఘర్మజలానికి ఖరీదులేదోయ్! అన్న శ్రీశ్రీ 'ప్రతిజ్ఞ'ను స్ఫురింపజేశారు. 'నువ్వూ-నేనూ' శీర్షికతో రాసిన కవిత త్యాగమయ జీవితాలను చిత్రించింది. సమాజ హితం కోసం పాటుపడేవారి పడరాని పాట్లను వివరించింది. ప్రకృతిలో ఆనంద ధనువైన 'శబ్ద మధువు'ను స్వాభావికంగా సౌందర్యాత్మకంగా రామచంద్రకవి చిత్రించారు. స్నిగ్ధ మనోహర భావరేఖలను 'మెరుపుల మరకలు'లో ఎంతో ఆహ్లాదకరంగా ఆకర్షణీయంగా గీచారు. పాఠకున్ని అక్షరాల ఆనంద డోలికల్లో ముంచెత్తుతారు. దానవత్వాన్ని దహించి, మానవత్వపు పరిమళాలను పంచిన మరో కవిత 'శిఖరమై దీపించు". భావ దారిద్ర్యాన్ని వదిలిపెట్టి, మానవతను దీపంగా పట్టుకుని సాగిపొమ్మంటుంది 'బతుకు పుస్తకం'. కళ్ళల్లోని తీయని కాంతులతో లోకాన్ని సమ్మోహిస్తూ నడిపిస్తున్నది మానవతేనని... 'పుట్టినరోజు' కవితలో అనంత సందేశానివై ఈ జాతిని నడిపించాలని, లోకాన్ని నాకంగా వెలిగించాలని కవి కోరుకుంటారు. ఇలా అక్షరాక్షరంలో డా. లింగంపల్లి రామచంద్ర గారి స్వభావం మూర్తీభవించిన మానవతావాదం గోచరిస్తుంది.

'దేవుడూ! ఒక్కమాట' అంటూనే లోకం పోకడనంతా కవి ఏకరువు పెడతారు. లోకంలో పాప భారం పెరిగిపోతున్న తీరుకు కలవరపడతారు. ధర్మసంస్థాపన చేయడానికి, దుష్టశిక్షణ, శిష్టరక్షణ గావించడానికి మళ్లీ జన్మించమని పరమాత్మతో ప్రాధేయపడతారు. 'ఎక్కడ స్త్రీలు గౌరవింపబడుతారో... అక్కడ దేవతలు కొలువై ఉంటారు' అని ఆర్యోక్తి. కాని కామంతో కండ్లు మూసుకుపోయిన మృగాళ్ళు మహిళలపై జరుపుతున్న మారణకాండను 'కాలింగ్ బెల్'లో కవి నిర్ద్వంద్వంగా ఖండించారు. ప్రేమంటే... నిశ్శబ్ద గీతిక, అనురాగ వీచిక, జ్వాలాకీలిక, నలిగిపోతున్న మానవతను చూసి కంటతడి పెట్టేది. 'ఇదీ ప్రేమ'ని అసలుసిసలైన భాష్యం చెప్పారు. 'మాతృ హృదయం'లో పిల్లలను మహాత్ముని పెదవుల మీది చిరునవ్వులు, శాంతిదూత చేతుల్లోని పావురాలుగా అభివర్ణించారు. పిల్లలు మండుతున్న మనసును చల్లబరిచే చంద్రుడు, జాతిని జాగృతపరిచే వైతాళికుడు, చీకట్లను కడిగివేసే సూర్యుడు, వంశానికి వన్నెతెచ్చే కులదీపకుడు కావాలని రామచంద్ర కవి ప్రేరేపిస్తారు. ఆత్మీయత మనసులో ఉదయించనప్పుడు, తనవాన్ని ద్వేషించే గుణం తొలగనప్పుడు, ఎదుటివాని గుండెల్లో సూదులు గుచ్చడం మాననప్పుడు, మనసులోని దేవున్ని గెంటేసినప్పుడు, ఈ చదువులూ సంస్కారాలు 'ఎందుకు' అని అధిక్షేపిస్తారు. 'రేపటి యుగాల్ని మోసే భుజాలు' ఎలా ఉంటాయో అక్షరాల్లో చక్కగా రూపు కట్టించారు. 'ఫలించే వృక్షానికే రాతి దెబ్బలు' భర్తృహరిచెప్పినట్టు, సంఘసంస్కర్తలపై జరుగుతున్న పిడివాదుల దాడులను 'సందేశం'లో కవి విశదపరిచారు. తనను ఇంతటి వాడిగా నిలబెట్టిన, తన 'అన్నా!' స్మృతిలో రాసిన కవిత కన్నీళ్లను పెట్టిస్తుంది.

'కళ్ళు పడగలైనప్పుడు' జరిగే అనర్థాలను సూటిగా కళ్ళకు కట్టించారు. కూలిపోతున్న మానవ విలువలకు ప్రాణం పోయడానికి 'మరో సూర్యుడు' మనిషి రూపంలో రావాలని రామచంద్ర కవి ఆశిస్తున్నారు. 'సిరా వొదిలేసిన అక్షరాలు' దోస్తీ కట్టినప్పుడు పదబంధాలవుతాయని, అవి ప్రసూన మాలికలవుతాయని, అవి పరిమళ భరితాలవుతాయని, అపుడే భూగోళం గుండెమీద మానవతా జెండాగా రెపరెపలాడతాయంటారు. "మనస్సు నుంచి మనిషిని విడదీసే క్రౌర్యం నశించాలని / మనిషి నుంచి మంచిని హరించే కాపట్యం అంతరించాలని / సమసమాజం రేపటిలోకి పయనించాలని / ప్రతి అధరం మీద చిరునవ్వులు లాస్యం చేయాలని / అందరిలో భారతాత్మను వెలిగించండని / అమ్మ గొంతెత్తి పిలుస్తోంది / అమ్మ సందేశ మిస్తోంది / అమ్మ ఆదేశిస్తోంది / రా తమ్ముడూ మన ఇంట్లోకి / మానవత్వం పరిమళిస్తూన్న ఈ దేవళంలోకి" ఆహ్వానం పలుకుతారు. అభ్యుదయ సమాజ నిర్మాణానికి పూనుకుంటారు. మానవ వికాసానికి దోహదకారులైన భారతేతిహాసాల ధర్మమార్గం, భగవద్గీతా సారం, బైబిలు, ఖురానుల హితోపదేశాలు అనేక కవితల్లో అంతస్సూత్రంగా సాగుతాయి. అర్వాచీన సమాజానికి భగవాన్ బుద్ధుని బోధనలు, గాంధేయవాదమే శిరోధార్యమనే భావన. ప్రతి మనిషిలో సత్ప్రవర్తన, క్రమశిక్షణ, సామాజిక స్పృహ, సర్వ మానవ సౌభ్రాతృత్వం వెల్లివిరియాలనే కోరిక. ఇంకా ఇందులో ఆధ్యాత్మిక సొబగులు, నైతిక విలువలు, మానవతా మధురిమలు, సామాజిక బాధ్యతలు, ప్రకృతి ఆరాధన భావాలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. సహజకవి డా. లింగంపల్లి రామచంద్ర గారి కంటపడ్డ ప్రతి వస్తువు అతి సహజాతి సహజంగా అలవోకగా అక్షరరూపం దాల్చుతుందనడంలో అతిశయోక్తి లేదు. అతని కవితల్లోని శబ్ద సౌందర్యం, భావ గాంభీర్యం పాఠకుల్ని మైమరపింపజేస్తుంది. అతని అల్లికలో విశిష్టమైన పదచిత్రాలు, ప్రతీకలు, పదబంధాలు, సామెతలు, సంకేతాలు అణువణువునా తొణికిసలాడుతాయి. ఆయన రచనలోని ఎత్తుగడ, గమనం, ముగింపు, కమనీయమైన శైలి, రమణీయమైన ఆలంకారికత, కరుణసార్ద్రమైన కవితామృతాన్ని వర్షిస్తుంది. అతని కవిత్వంలో సౌందర్యోపాసనతో పాటు సామాజిక దృక్పథం అడుగడుగునా పాఠకుల్ని అలరింపజేస్తుంది. డా. లింగంపల్లి రామచంద్ర గారి సాహిత్యంపై ఇంకా లోతైన పరిశోధన జరగాల్సిన అవసరం ఎంతో ఉంది. వారి అశీతి సందర్భంగా హృదయ పూర్వకమైన శుభాకాంక్షలు. వారి అమ్మపిలుస్తోంది పొత్తంపై అభిప్రాయం రాయడానికి అవకాశం కల్పించిన ఆత్మీయ సాహితీ మిత్రులు డా. పోరెడ్డి రంగన్న గారికి అభివాదములు. సెలవిప్పటికీ... స్నేహమెప్పటికీ...



-కూకట్ల తిరుపతి,
కవి, రచయిత కరీంనగర్
9949247591




# ఐక్యమైన రెండు విప్లవ పార్టీలు

**విశ్వంభర, హైదరాబాద్:** రెండు సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభ హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా జరిగింది. ఈ సభకు ముందు రాష్ట్ర వ్యాప్తంగా హాజరైన న్యూ డెమోక్రసీ పార్టీల శ్రేణుల ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం న్యూడెమోక్రసీ పార్టీ అరుణ పతాకాన్ని పార్టీ సీనియర్ నాయకులు వక్కవంతుల కోటేశ్వరరావు ఎగురవేశారు. అనంతరం సుందరయ్య విజ్ఞాన కేంద్రం మెయిన్ హాల్ లో జరిగిన సభలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జాతీయ అధికార ప్రతినిధి దర్శన్ సింగ్ కట్కర్ మాట్లాడుతూ గత 10 సంవత్సరాల కాలంగా రెండు పార్టీల ఐక్యత ప్రయత్నాలు జరిగాయని, ఐక్యత కోసం సాగించే ప్రతి ప్రయత్నం విశ్వాసంతో ముందుకు తీసుకెళ్లి పోతుందని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో బలమైన రెండు విప్లవ స్రవంతులు ఐక్యం కావడం విప్లవ ఉద్యమానికి మరింత బలం చేకూరుస్తుంది అన్నారు. ఈ ఐక్యత దేశవ్యాప్తంగా ఉన్న విప్లవ పార్టీలు చీలికల వల్ల జరిగిన నష్టాన్ని గురించి పునర్ ఆలోచింపజేస్తుందన్నారు. విప్లవ కారులందరూ ఒకే పార్టీగా ఏర్పడాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. దేశ ప్రజల మధ్య సోదర భావాన్ని బీజేపీ ఆర్ఎస్ఎస్ ఫాసిస్టు శక్తులు దెబ్బతీస్తున్నాయన్నారు. బీజేపీ పరిపాలన కాలమంతా కార్పొరేట్లకు కొమ్ముగాసి పేద ప్రజలపై పన్నుల భారం వేయడంతో పాటు సామాజికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా దాడిని కొనసాగిస్తుందన్నారు. దీనిని నిలువరించాల్సిన ఇండియా కూటమి దృఢంగా నిలబడలేక పోతుందన్నారు. ఇండియా కూటమి మతోన్మాద బీజేపీ ఆర్ఎస్ఎస్ కు వ్యతిరేకంగా తగిన విధంగా కర్తవ్యాలను బాధ్యతను నిర్వర్తించడం లేదని దానిని విప్లవకారులు, ప్రగతిశీల శక్తులు పరిపూర్తి చేయాలన్నారు. చతిస్గడ్ లో విప్లవోద్యమాన్ని అణిచివేయాలనే నేపంతో ప్రజలపై దాడులు కొనసాగిస్తూ దారుణమైన మారణకాండకు మోడీ ప్రభుత్వం తెగబడుతుందన్నారు. రైతాంగ వ్యతిరేక మూడు చట్టాలు, నాలుగు లేబర్ కోడ్స్, విద్యుత్ చట్టం, న్యూ ఎడ్యుకేషన్ పాలసీ, ఒకే దేశం ఒకే ఎన్నిక దేశంలో పాసుగంలో భాగమే అన్నారు. దీనికి వ్యతిరేకంగా అన్ని కమ్యూనిస్టు విప్లవ సంస్థల ఐక్యమై ప్రజల తరఫున బలమైన వర్గ పోరాటాలను నిర్మించాలన్నారు.

న్యూడెమోక్రసీ పార్టీ జాతీయ నేతలు వేములపల్లి వెంకటరామయ్య, సాదినేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ న్యూడెమోక్రసీ పార్టీ చేపట్టిన పోరాటాల వల్లనే ఏజెన్సీ ప్రాంతంలో లక్షలాది ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచామన్నారు. ఏజెన్సీ ప్రాంత ప్రజలకు తాగు, సాగునీరు, విద్య వైద్యం మౌలిక సదుపాయాలను పోరాడి సాధించామన్నారు. బలమైన పోరాటాలతోని అనేకమైన హక్కులు, చట్టాలను సాధించామన్నారు. ఈ ఉద్యమం కోసం అనేకమంది అమరులయ్యారని వారి త్యాగాల పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తామన్నారు. రెండు న్యూ డెమోక్రసీ పార్టీల విలీనం విప్లవ శ్రేణుల్లో నూతన ఉత్తేజాన్ని కలిగిస్తుందని అన్నారు. ఈ స్ఫూర్తితో బలమైన పోరాటాలను నిర్మిస్తామన్నారు. అంతిమంగా నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని సాధిస్తామన్నారు. న్యూడెమోక్రసీ పార్టీ కేంద్ర నాయకులు వై సాంబశివరావు, జేవి చలపతిరావు, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, పి. ప్రసాద్, కే గోవర్ధన్,జి. ఝాన్సీ, వి సంధ్య, ఆవునూరి మధు, సీఎస్ సాగర్ లు మాట్లాడుతూ ప్రజా పోరాటాల పునాదిగా ఏర్పడిన న్యూడెమోక్రసీ పార్టీ దేశవ్యాప్తంగా అనేక పోరాటాల్లో పాల్గొన్నదన్నారు. శ్రీకాకుళం, గోదావరి లోయ పోరాటాల వారసత్వాన్ని కొనసాగిస్తుందన్నారు. దేశవ్యాప్తంగా అనేక విప్లవ సంస్థలతో ఐక్యత చర్చలు జరుపుతున్నామని సాధ్యమైన అన్ని విప్లవ పార్టీలతో ఐక్యమవుతామన్నారు. ఐక్యం కాలేని విప్లవ సమస్యలతో ప్రజా సమస్యల ఎజెండాగా ఐక్య కారచరణను కొనసాగిస్తామన్నారు. సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ, మతోన్మాద ఫాసిజ పెను ప్రమాదానికి వ్యతిరేకంగా ప్రజలందరినీ ఐక్యం చేస్తామన్నారు. విప్లవకారులందరూ ఐక్యం కావలసిన ఆవశ్యకత ఉందన్నారు. రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీనం పూర్తి అయిందని శ్రేణుల్లో నూతన ఉత్తేజం కనిపిస్తుందన్నారు. దీని స్ఫూర్తితో ప్రజా సమస్యలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని స్థిరమైన ప్రతిఘటన పోరాట ప్రాంతాలను ఏర్పరుస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు.

# కబేలాను కాపాడాలని ఆరెకటిక సంఘం ఆందోళన




**విశ్వంభర, గౌలిపురా:** హైదరాబాద్ గౌలిపురా మున్సిపల్ కబేలాను కాపాడాలని, భూకబ్జాదారులతో కుమ్మక్కైన జీహెచ్ఎంసీ అధికారులను సస్పెండ్ చేయాలని కోరుతూ ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో శనివారం జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ గౌలిపుర మున్సిపల్ కబేలా పాత నగరంలో అత్యంత పురాతనమైనదని, గత 70 ఏళ్లకు పైగా కొనసాగుతున్నదని. 1955 నుండి పహానీ, రెవిన్యూ రికార్డులలో 4.22 ఎకరాల స్థలంలో కబేలా ఉన్నట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని శ్రీనివాస్ తెలిపారు. గత అనేక ఏళ్లుగా కొందరు కబ్జాదారులు కబేలాను ఆక్రమించే ప్రయత్నాలు చేసి ఓడిపోయారు. 2010 లో హైదరాబాద్ కలెక్టర్ నవీన్ మిట్టల్ కబ్జాదారులకు అనుకూలంగా 4.22 ఎకరాల కబేల స్థలాన్ని మ్యుటేషన్ చేశారు. తదనంతరం వచ్చిన కలెక్టర్ నటరాజన్ గుల్జార్ అక్రమ మ్యూటేషన్ ను సవాల్ చేసినప్పటికీ న్యాయవివాదాల్లో చిక్కుకున్నది. పాత నగరానికి మాంసం అందించే ఈ కబేల వివాదాల కారణంగా మూతబడడంతో దీనిపై ఆధారపడి ఉపాధి పొందుతున్న వందలాది ఆరెకటిక, యాదవ, దళిత కుటుంబాలు రోడ్డున పడ్డారని శ్రీనివాస్ తెలిపారు. మున్సిపల్ కబేలాను కబ్జాదారుల నుండి కాపాడడానికి జీహెచ్ఎంసీ వివిధ కోర్టులో ప్రయత్నించినప్పటికీ గత ఏడాది కొందరు జీహెచ్ఎంసీ అధికారులు కుట్రపూరితంగా కబ్జాదారుల కనుకూలంగా హైకోర్టులో అఫిడవుట్ వేయడంతో కోర్టు కబ్జాదారులకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. కబ్జాదారులకు అనుకూలంగా వ్యవహరించిన జీహెచ్ఎంసీ అధికారులను, స్టాండింగ్ కౌన్సిల్ అడ్వకేట్ ను తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామని శ్రీనివాస్ అన్నారు. 1961 లో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ తీర్మానం చేసి గౌలిపుర కబేల ప్రాంతంలోనే మూడు ఎకరాల స్థలం కొనుగోలు చేశారు. ఈ మూడు ఎకరాల స్థలం ఎటుపోయిందో అధికారులు తేల్చలేకపోతున్నారని ఎద్దేవ చేశారు. తక్షణమే ఈ స్థలాన్ని గుర్తించి కబేలాకు కేటాయించాలని కోరుతున్నాం. కొద్దిపాటి స్థలంలో కొనసాగుతున్న కబేలాను 8 కోట్లు ఖర్చుపెట్టి ఆధునీకరణ చేశారు. కానీ వాటర్, కరెంట్, డ్రైనేజీ సౌకర్యాలు లేకపోవడంతో నిరుపయోగంగా మారిందని. కబేలాలో సౌకర్యాలు వెంటనే ఏర్పాటు చేయాలని, కబ్జాదారుల స్వాధీనంలో ఉన్న భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవడానికి అన్ని ప్రయత్నాలు మొదలు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. అనంతరం ప్రతినిధి బృందం జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంభర్తిని కలిసి విజ్ఞాపన పత్రం ఇచ్చారు. ధర్నాలో ఆరెకటిక సంఘం అధ్యక్షులు యశ్వంతరావు, ప్రధాన కార్యదర్శి రమేష్, స్లాటర్ హౌస్ వర్కర్స్ యూనియన్ నాయకులు శివకుమార్, సీపీఎం యాకుత్ పురా జోన్ కార్యదర్శి ఎం బాలు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయితీ కార్మికులకు సమ్మెకు మద్దతు తెలిపిన తుడుం దెబ్బ



**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేటలో రెండో రోజు సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులకు తుడుం దెబ్బ జిల్లా నాయకులు మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ కొత్త ప్రభుత్వ ఏర్పడి సంవత్సరం దాటినా కార్మికులకు ఇచ్చిన డిమాండ్లు మాత్రం ఇప్పటి వరకు నెరవేర్చలేదు, గత నాలుగైదు నెలల నుంచి జీతాలు పడక కార్మికులు నానా ఇబ్బంది పడుతున్నారని, ఇల్లు గడవని పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వం మాయమాటలు చెప్పి పబ్బం గడుపుతుంది తప్ప ఉద్యోగస్తులకు సామాన్యులకు న్యాయం జరిగడం లేదని, పంచాయతీ కార్మికులు చేస్తున్నటువంటి సమ్మెను ప్రభుత్వం గుర్తించి వారి డిమాండ్ లను వెంటనే నెరవేర్చాలనీ, కార్మికులకు అన్యాయం జరిగితే సహించేది లేదని, వారికోసం ఎంత దూరమైనా వెళ్ళడానికి సిద్ధమని తుడుం దెబ్బ జిల్లా నాయకులు తంబల్ల రవి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బండారు సూర్యనారాయణ, తంబల్ల రవి, వాసం పోలయ్య, కారం నాగేంద్ర, కాంతారావు, భాగ్యరాజు, గంటా నాగేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామానికి చెందిన కీర్తిశేషులు బురమోని తిరుపతయ్య యాదవ్ కు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మంజూరైన 60 వేల రూపాయల సీ.ఎం.ఆర్.ఎఫ్ చెక్కును వారి కుటుంబ సభ్యులకు స్థానిక కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చెర్ల వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎం అంబాజీ, మాజీ ఉపసర్పంచ్ లు ఎం.ఏ. అజీజ్, బి నర్సింలు, సీనియర్ నాయకులు ఏ వెంకట్ రెడ్డి, టి కృష్ణయ్య గౌడ్, ఏం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## మారకద్రవ్యాల బారిన పడకుండా మాస్టర్ వాలంటీర్లు కృషి చేయాలి



**విశ్వంభర, సరూర్ నగర్:** సమాజంలోని యువతను మారకద్రవ్యాల బారిన పడకుండా మాస్టర్ వాలంటీర్లు కృషి చేయాలని ఎస్.ఎల్ సి.ఏ. డైరెక్టర్ కోమలి అన్నారు. శనివారం స్టేట్ లెవెల్ కోఆర్డినేటింగ్ ఏజెన్సీ (న్యూ హోప్ అసోసిఏషన్) ఆధ్వర్యంలో నషాముక్త్ భారత్ అభియాన్ మాస్టర్ వాలంటీర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం సరూర్ నగర్ లోని రంగారెడ్డి జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలోని మహిళా సాధికార కేంద్రం నందు నిర్వహించారు. ఈ సందర్భంగా కోమలి మాట్లాడుతూ త్రాగుడుకు భానిసలైన వారిని ఓ అడిక్షన్ సెంటర్లలో చేర్పించి వారు మాదకద్రవ్య వ్యసనం నుండి బయట పడేలా చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా సంక్షేమ అధికారిణి సిహెచ్ సంధ్యారాణి పాల్గొని మాస్టర్ వాలంటీర్లు పాత్ర, ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీశైలం, సైకాలజిస్ట్ శ్రీనివాస్, ట్రైనర్ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహాలకు స్థలం కేటాయించండి



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్ పట్టణంలో దివంగత నేతలు ఉత్తమ పార్లమెంటేరియన్ జైపాల్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర రెడ్డి మరియు మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ విగ్రహాల ఏర్పాటుకు స్థలం కావాలని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డి కి ఆమంగల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీపతి శ్రీనివాస్ రెడ్డి, పీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, ఏఎంసీ ఛైర్మన్ గీత నరసింహ, మాజీ సర్పంచ్ కేశవులు, పార్టీ మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, మాజీ అధ్యక్షుడు మంగ్లీ రాములు, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో కొనసాగుతున్న పుస్తక ప్రదర్శనకు శనివారం పుస్తక ప్రియుల తో సందడి నెలకొన్నది. పుస్తక ప్రదర్శన కార్యక్రమంలో భాగంగా చిన్నారులు వేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నవి. నేడు పుస్తక ప్రదర్శనకు వచ్చిన గవర్నర్ నృత్యం చేయుటకు వచ్చిన చిన్నారులను అభినందించారు.
(విశ్వంభర, హైదరాబాద్)

## కలెక్టరేట్ ముందు గ్రామ పంచాయతీ ఉద్యోగుల ధర్నా




**విశ్వంభర, మహబూబాబాద్:** గ్రామపంచాయతీ ఉద్యోగుల లను గుర్తించి కనీసం వేతనం చెల్లించాలంటూ జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్నటువంటి గ్రామపంచాయతీ ఉద్యోగులందరు జీఓ 51 ని సవరించి మల్టి పర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని గ్రామపంచాయతీ లలో పనిచేసే వారికి కేటగిరి వారీగా వేతనాలు పెంచాలని శనివారం జిల్లాలో ఉన్న అన్ని గ్రామ పంచాయతీల సిబ్బంది జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే జనవరి 4 నుండి నిరవధిక సమ్మెకు సిద్ధమవుతామని వారు హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రంలో 12,790 గ్రామ పంచాయతీ ల్లో 60,000 మంది కార్మికులు వివిధ కేటగిరిలలో పనిచేస్తున్నారని గత ప్రభుత్వం జీవో 51 నీ విడుదల చేసి కార్మికుల మెడకు ఉరితాడు బిగిస్తూ మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని ప్రవేశపెట్టిందని ఈ విధానం వల్ల కార్మికులు చాలా ఇబ్బందులు ఎదుర్కొని ఇతర పనులపై నైపుణ్యం లేక మరణిస్తున్నారని అలా మరణించిన వారికి నష్టపరిహారం కూడా చెల్లించడం లేదని వారన్నారు. చెల్లిస్తున్నదే అతి తక్కువ వేతనాలు అవి కూడా 5, 6 నెలలకు ఒక్కసారి ఇస్తుండటం తో కుటంబ పోషణ భారమై అప్పులపై ఇబ్బందులు ఎదురుకుంటున్నామని వారు అన్నారు. జెఏసీ పాత బకాయిలు కోసం ఆందోళనలు చేస్తే ప్రభుత్వం బడ్జెట్ కేటాయించిందని అది ఇప్పటికి కార్మికులకు అందలేదని వారు వాపోయారు. వెంటనే మా సమస్యలను పరిస్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో జిల్లాలోని వివిధ గ్రామాల గ్రామపంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

## జెండర్ మనసుకు సంబంధించినది

**- జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్ రెడ్డి**




**విశ్వంభర, ఎల్బీనగర్:** ఆడ, మగ అనేవి భౌతిక పరమైన అంశాలు కావని, జెండర్ అనేది మనసుకు సంబంధించినదని రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్ రెడ్డి అన్నారు. ట్రాన్స్ జెండర్ల సమస్యలు హక్కులు అనే అంశంపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఎల్బీనగర్ లోని రంగారెడ్డి జిల్లా కోర్టులో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో లింగ వివక్ష ఇప్పటివరకూ మహిళలపైనే కొనసాగిందని, ఇప్పుడూ ట్రాన్స్ జెండర్లు కూడా ఈ జాబితాలో చేరిపోయారన్నారు. వివక్షను చట్టాలెప్పుడూ సమర్థించవన్నారు. ట్రాన్స్ జెండర్ల హక్కుల పరిరక్షణకు ట్రాన్స్ జెండర్ ప్రొటెక్షన్ యాక్టు ఏర్పాటయిందన్నారు. అనంతరం మెట్రొపాలిటన్ సెషన్స్ జడ్జి పట్టాభి రామారావు ట్రాన్స్ జెండర్ ప్రొటెక్షన్ యాక్టు వివరించారు. అనంతరం క్యూ టీ సెంటర్ నిర్వాహకులు ఆదిత్య మాట్లాడుతూ జెండర్ అనేది క్రోమోజోములు, హార్మోనల్ ఇంబాల్యన్స్ కి కూడా సంబంధించినది కాదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పొన్న శ్రీదేవి, అదనపు జిల్లా న్యాయమూర్తులు, సీనియర్ సివిల్ జడ్జిలు, జూనియర్ సివిల్ జడ్జిలు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యదర్శి, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## కౌకూర్‌లో నూతన యోగా తరగతులు ప్రారభం




**విశ్వంభర, మేడ్చల్:** రణవీర్ అండ్ శ్రేయస్ స్పోర్ట్స్ స్టూడియోలో సీనియర్ సిటీజన్స్ కోసం యోగా తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ నూతన బ్యాచ్‌కు మాస్టర్ రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఓక్ వాలి ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ స్వరూప్ రెడ్డి విచ్చేసారు. ఈ సందర్భంగా మాస్టర్ రమేష్ మాట్లాడుతూ యోగా అనేది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని, ఇది మనస్సు, శరీరం మరియు ఆత్మను కలుపుతుందన్నారు. ముఖ్యంగా సీనియర్ సిటీజన్స్ యోగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, వయసుతో వచ్చే అనారోగ్య సమస్యలను నివారించడంలో, మానసిక ఒత్తిడిని తగ్గించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. సీనియర్ల శారీరక స్థితిని బట్టి వివిధ రకాల ఆసనాలు, ప్రాణాయామాలు నేర్పిస్తామన్నారు. ఒత్తిడి లేని, శాంతియుత వాతావరణంలో యోగా సాధన చేయడానికి అవకాశం ఉంటుందని, ఆరోగ్యవంతమైన జీవనం కోసం ఈ యోగా తరగతులలో చేరాలనుకున్నవారు ఈ నెంబర్ కు 8885551847 సంప్రదించాలని తెలిపారు. యోగ తరగతుల అనంతరం, వారి ఆరోగ్యానికి యెంతో కృషి చేస్తున్న మాస్టర్ విద్యార్థులు అభినందించి వారిని ఘనంగా సత్కరించారు. అలాగే ముక్య అతిథి స్వరూప్ రెడ్డిని మాస్టర్ రమేష్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమం లో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

### మృతుని కుటుంబానికి

## ఇన్సూరెన్స్ చెక్ అందజేత

**విశ్వంభర, శంకరంపేట:** మల్కాపూర్ వాసి విజయరామరాజు గుండె సంబంధిత వ్యాధితో ఇటీవల మరణించడం జరిగింది. మరణాంతరం విజయరామరాజు యొక్క నామిని అయిన అతని భార్య సునీత కి అల్వాల్ ఎస్బీఐ లైఫ్ బ్రాంచ్ మేనేజర్ భాస్కర్ బోండల, అక్కపల్లి హేమలత లైఫ్ మిత్ర ఏజెంట్ నాగేష్ ఆధ్వర్యంలో ఎస్బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ నందు విజయరామరాజు కూతురు మధుర పేరు పైన స్మార్ట్ స్కాలర్ చిల్డ్రన్స్ పాలసీ ద్వారా డెత్ క్లెయిమ్ 5,00,000 అందించారు. వీరితోపాటు ఎల్ఎం ఫిరంగి యాదగిరి, ఎల్ఎం ఎస్ నగేష్, ఎల్ఎం రమేష్, ఎల్ఎం సంతోష్ ఉన్నారు.



## గ్రామపంచాయతీ సిబ్బంది డిమాండ్లు పరిష్కరించాలి

**విశ్వంభర, కడ్తాల్:** అధికారాన్ని చేజిక్కించుకోవడమే లక్ష్యంగా, అమలుకు సాధ్యం కానీ అనేక హామీలతో ప్రస్తుత ప్రభుత్వం తెలంగాణ ప్రజానీకాన్ని, ఉద్యోగస్తులను మోసం చేసిందని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నరసింహ్మా రెడ్డి అన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలో తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మిక ఉపాధి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల నిరసన సమ్మెకు మద్దతు తెలిపి, గ్రామపంచాయతీ సిబ్బంది డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ సిబ్బంది డిమాండ్ చేస్తున్న రూ. 18,500 ల కనీస వేతనం ఇస్తూ పర్మినెంట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సిబ్బంది ప్రతి ఒక్కరికి 5,00,000 రూపాయల వైద్య బీమా సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్, మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ మంగళ్ పల్లి నరసింహ, బీఆర్ఎస్ యూత్ వింగ్ పట్టణ అధ్యక్షుడు కొప్పు కృష్ణ, వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు మాధవులు, మాజీ బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు క్యామ వెంకటేష్, రాయికంటి సురేష్, సిద్ది గారి సురేష్ పాల్గొన్నారు.



## వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహాన్ని ఆవిష్కరించిన సబితా ఇంద్రారెడ్డి, మధుసూదనాచారి

**విశ్వంభర, మీర్ పెట్:** మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ చందనం చెరువు సమీపంలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం ను మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారిలు హాజరై ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కాలజ్ఞానాన్ని బోధించిన మహా యోగి, ఆత్మజ్ఞాన ప్రబోధకులు, ప్రపంచానికి తత్త్వబోధ చేసిన జగద్గురువు వైఎస్ఆర్ జిల్లా లోని కందిమల్లయ్యపల్లెలో చాలాకాలం నివసించి కాలజ్ఞానం రచించి కీ.శ. 1693లో సజీవ సమాధి నిష్ఠనొందారు. శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి వలన ప్రసిద్ధి పొందుట చేత కందిమల్లయ్యపల్లె తర్వాతి కాలములో బ్రహ్మంగారి మఠంగా ప్రసిద్ధి చెందింది. ప్రపంచంలో ఏ వింత జరిగిన ఇది వీరబ్రహ్మేంద్రస్వామి తన కాలజ్ఞానంలో ఆనాడే చెప్పారు అంటూ ప్రజలు గుర్తుకు తెచ్చుకుంటూ ఉంటారు. కాలజ్ఞానంలో చెప్పినవన్నీ జరిగాయి, జరుగుతున్నాయి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

**- సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మి నర్సింహ్మా రెడ్డి**




**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ మండలం కైలాస పురి మహేశ్వర మహా పిరమిడ్ ధ్యాన వేడుకలలో సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి, ప్రవాస భారతీయుడు డాక్టర్ రాకేష్ రెడ్డి లట్టుపల్లి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందొచ్చని అన్నారు. అదేవిధంగా అమెరికాలో స్థిరపడిన డాక్టర్ రాకేష్ రెడ్డి మాట్లాడుతూ వైద్యంతో నయంకాని మానసిక రుగ్మతలు ధ్యానం వలన పరిష్కరింపబడతాయని అన్నారు. వివిధ ప్రాంతాల నుండి మహేశ్వర మహా పిరమిడ్ కి విచ్చేసిన ధ్యాన ప్రియులకు వసతుల ఏర్పాటులో ఛైర్మన్ విజయభాస్కర్ రెడ్డి మరియు ట్రస్ట్ సభ్యులు చూపుతున్న చొరవ వెలకట్టలేనిదని అన్నారు. పత్రీజీ కారణజన్ముడని, శాఖాహార జగత్ కొరకు వారు తలపెట్టిన ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగి మధుసూదన్ రెడ్డి, రామకృష్ణ, నరసింహ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగుల భారీ ర్యాలీ



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా కేంద్రం లోని తహశీల్దార్ కార్యాలయం నుండి సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మెలో భాగంగా శనివారం ఐదు కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు మాంకాలి వీరన్న ఆధ్వర్యంలో అనంతారం అనంతాద్రి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం వరకు పాదయాత్రగా నడిచి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 23 రోజులుగా సమ్మె చేస్తున్న 300 మంది సమగ్ర శిక్ష ఉద్యోగులు కలిసి పాదయాత్రగా బయలుదేరి అనంతాద్రి శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని దేవుడి పాదాల వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగుల యొక్క వినతి పత్రాన్ని ఉంచడం జరిగిందని తెలాపారు. ఆ దేవుడు కనికరించి రాష్ట్ర ముఖ్యమంత్రి మనసు కరిగించి మా సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ప్రార్థించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు మహంకాళి వీరన్న, 16 కేజీబీవీల ప్రత్యేక అధికారినిలు ఊకె మున్ని, కొత్త శ్రీనివాస్ గౌడ్, బాబులాల్, రవి, ప్రభాకర్ అనిల్, బిక్షపతి, స్వాతి, రాజశ్రీ, జిల్లా కమిటీ, వివిధ విభాగాల సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ వేడుక

**విశ్వంభర, నెల్లికుదురు:** కాంగ్రెస్ పార్టీ 140వ, ఆవిర్భావ వేడుక ఆ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రం నెల్లికుదురు అంబేద్కర్ సెంటర్లో శనివారం కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా డీసీసీ ఉపాధ్యక్షులు గుగులోతు బాలాజీ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ జెల్ల వెంకటేష్ మాట్లాడుతూ ఎంతోమంది పోరాటం చేసి దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన ఘన చరిత్ర కాంగ్రెస్ పార్టీదన్నారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అందుకే రాష్ట్రంలో కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకువచ్చి సోనియాగాంధీ రుణం తీర్చుకున్నామన్నారు. కార్యక్రమంలో రత్నపురపు యకయ్య, జిలకర యాలాద్రి,నరేందర్,ఎల్లారెడ్డి,భాస్కర్ నాయక్, ఆగ్రోస్ నరేందర్ రెడ్డి,క్రాంతి రెడ్డి,మంగునాయక్,కిరణ్,చంటి,శ్రీనివాస్,వంశీ,రమేష్,దేవేందర్,సమరం,నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



# అక్రమ నిర్మాణాల తొలగింపు

**సబ్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్**

**విశ్వంభర, మిర్యాలగూడ:** మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలో పెద్ద ఎత్తున ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని, వాటిని అడ్డుకునేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారని సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ తెలియజేశారు. కొందరు వాటిని లెక్కచేయకుండా అక్రమ నిర్మాణాలు, రోడ్లు, నాలాలను ఆక్రమించుకుంటున్నారని. మున్సిపాలిటీ పరిధిలో జరిగిన ఆక్రమణలు, అక్రమ నిర్మాణాల గురించి కమిషనర్ మా దృష్టికి తీసుకువచ్చారని సబ్ కలెక్టర్ తెలిపారు. సాగర్ రోడ్ లోని సర్వే నంబర్ 992 లో ఆక్రమణల తొలగింపు నిబంధనలకు అనుసరించి చేపట్టామని, అట్టి భూమి రికార్డు పరంగా ఆబాది గ్రామ కంఠం భూమి, ఆ భూమికి సంబంధించిన లింక్ డాక్యుమెంట్స్ లేవు. అక్కడ ఏర్పాటు చేసిన చెప్పుల దుకాణానికి బిల్డింగ్ అనుమతి కానీ, ట్రేడ్ లైసెన్స్ లేదు. ప్రభుత్వ నిబంధనల మేరకు వారికి నోటీసులు ఇచ్చాం. ఎలాంటి స్పందన లేకపోవడంతో నిబంధనల మేరకు కూల్చివేతలు చేపట్టామని సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలో ప్రణాళిక బద్ధంగా ఆక్రమణన్నిటిని తిరిగి స్వాధీనం చేసుకుంటున్నాం. సిబ్బంది తక్కువగా ఉండటం వలన ఎక్కువ సమస్యాత్మకంగా ఉన్న వాటిని ముందుగా తొలగించి, మిగిలిన వాటిని ఒక్కొక్కటిగా తొలగిస్తాం. న్యాయపరమైన సలహాలు ఉన్నతాధికారుల సూచనల మేరకే అక్రమణ ల తొలగింపు చేపడుతున్నాం. ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటే కఠిన చర్యలు తప్పవని ఆయన అన్నారు. అనుమతి లేని షాపును తొలగించాలని గతంలోనే వారికి నోటీసులు అందజేశామని. యాజమాన్య అగ్రిమెంట్ కానీ, షాపు పర్మిషన్ కానీ, ట్రేడ్ లైసెన్స్ లేకుండానే ఏర్పాటు చేయడం జరిగిందని. తామిచ్చిన నోటీస్ పై వారు కోర్టును ఆశ్రయించగా, నాలుగు వారాల గడువు ఇచ్చామని. అనంతరం కూల్చి వేయాల్సిందిగా కోర్టు ఉత్తర్వులు జారీ అయిన నేపథ్యంలోనే




డీటీఎఫ్ ఫోర్సుతో కూల్చివేతలు చేపట్టామని సబ్ కలెక్టర్ అన్నారు. తాము ఏ వర్గానికి కొమ్ము కావాల్సిన అవసరం లేదని, ప్రభుత్వానికి అందరూ సమానమే తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరించని వారు ఎవరైనా ఇది పద్ధతి అవలంబిస్తాం అని సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ తెలియజేయడం జరిగింది.

## ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ను సందర్శించిన మధుసూదనాచారి



**విశ్వంభర, మీర్ పేట్:** మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ను శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదన చారి సందర్శించారు. ఈ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం శాసనసభ్యురాలు పి.సబితా ఇంద్రరెడ్డి మధుసూదన చారిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పూల బొకేను అందజేసి సత్కరించింది. ఈ కార్యక్రమంలో మీర్ పేట్ బి.ఆర్.యస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి, వారితో పాటు పాల్గొన్న వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేష్ గౌడ్, బడంగ్పేట్ బి.ఆర్.యస్ పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, కార్పొరేటర్లు బొక్క రాజేందర్ రెడ్డి, ధనలక్ష్మి రాజ్ కుమార్, నాయకులు పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మన్మోహన్ సింగ్ కి రెండవ రోజు సంతాపం పాటించిన కాంగ్రెస్ నాయకులు



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల వారం రోజులపాటు సంతాప దినాలు ప్రభుత్వం ప్రకటించిన దరిమిలా, రామన్నపేట మండల కేంద్రంలోని సుభాస్ సెంటర్లో రెండో రోజు సంతాప దినం సందర్భంగా మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించినారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్, కాంగ్రెస్ నాయకులు వనం చంద్రశేఖర్, ఆముద లక్ష్మణ్, మీర్జా అస్లాం బేగ్, గురుకుల శివ, కొమ్ము శేఖర్, పున్న అమరేందర్, మహమ్మద్ జానీ, మొహమ్మద్ రిజ్వాన్, లవణం సాయి, మీర్జా ఇద్యతుల్లా బేగ్, గంగాపురం శంకర్, బాలగోని సత్తయ్య, రవి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి మహా పడిపూజ

**- ఇరుముడి మహోత్సవంలో పాల్గొన్న అందెల శ్రీరాములు**



**విశ్వంభర, మహేశ్వరం:** మహేశ్వరం మండలం తుమ్మలూరు గ్రామంలో మాజీ ఉప సర్పంచ్ గంట అర్పిత వెంకట్ రెడ్డి నిర్వహించిన శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ ఇరుముడి మహోత్సవంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ 41 రోజుల కటోర దీక్షతో పూజలు నిర్వహించి శబరికి బయలుదేరుతున్న స్వాములకు అయ్యప్ప స్వామి వారి దయ కృప ఉండాలని, అందరూ కూడా క్షేమంగా వెళ్లి రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు మద్ది రామ్ రెడ్డి, మాజీ వార్డ్ సభ్యులు గోల్కొండ రఘువీర్, సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, పాపిరెడ్డి, నరసింహ. మల్లయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ

**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ ఓల్డ్ సిటీ గౌలిపురలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ శ్రీ కన్యకా పరమేశ్వరి ట్రస్ట్ భవనంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా బుగ్గారం దయానంద్ గుప్తా ఎమ్మెల్సీ, బలిసారవి కుమార్ గురుస్వామి ఆధ్వర్యంలో సరాబు శివకృష్ణ స్వామి కన్నె స్వామి, సరాబు సంతోష్ కుమార్, శ్రీ సరాబు విశ్వేశ్వరయ్య గుప్తా,శ్రీ రంగి సంతోష్ కుమార్ గుప్తా కన్నె స్వామి, ఈ యొక్క మహా పడి పూజ నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. అయ్యప్ప స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## జిల్లా స్థాయి ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం

**విశ్వంభర, భూపాలపల్లి:** టస్సార్, పత్తి మరియు మిర్చి ఎగుమతి చేసేందుకు జిల్లా స్థాయి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నుండి టస్సార్, పత్తి మరియు మిర్చీలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎగుమతి చేసేందుకు జిల్లా స్థాయి వెబ్సైట్ రూపొందించాలని తెలిపారు. రైతుల పారిశ్రామికాభివృద్ధికి మరియు ఉపాధి, గ్రామీణ వ్యవసాయ ఉత్పత్తులను గుర్తించడానికి, వ్యాపారాలు నిర్వహణకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని ఆయన తెలిపారు. ఉత్పత్తులను ఎగుమతి చేయడానికి గల అడ్డంకులను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లానుండి ఉత్పత్తుల ఎగుమతుల అభివృద్ధికి అవసరమైన కార్యాచరణ చర్యలు చేపట్టాలని సూచించారు. అటువంటి ఉత్పత్తుల యొక్క బేస్ లైన్ డేటాను రూపొందించాలని స్పష్టం చేశారు. ఉత్పత్తి



నాణ్యత మరియు నైపుణ్యాభివృద్ధిని మెరుగుపరచడానికి ఉత్పత్తిదారులను ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహద పడుతుందని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను అనుసంధానం చేస్తూ రైతులు సద్వినియోగం చేసుకునే విదంగా అవగహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశానికి వర్చువల్ ద్వారా హైదరాబాద్ నుండి డైరెక్టర్ జనరల్ ఫారెన్ ట్రేడ్ ప్రతినిధి శైలజ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, పరిశ్రమల శాఖ జీఎం సిద్దార్థ, నాబార్డు డీడీఎం రవి కుమార్, వ్యవసాయ అధికారి విజయ భాస్కర్, ఉద్యాన వనశాఖాధి వెంకటేశం, సెరికల్చర్ అధికారి సమ్మయ్య, ఖాదీ గ్రామీణాభివృద్ధి శాఖ ఏడి రాఘవరావు, జిన్నింగ్ మిల్లు, రైస్ మిల్లర్ల, టస్సార్ కో ఆపరేటివ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## వామపక్ష లౌకిక ప్రజాస్వామ్య శక్తులు ఏకం కావాలి

**- సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య**



**విశ్వంభర, మహేశ్వరం:** భారత కమ్యూనిస్టు పార్టీ 100 వసంతాల ఉత్సవాల సందర్భంగా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలో పార్టీ మండల కార్యదర్శి పల్నాటి యాదయ్య ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య హాజరై ఆయన మాట్లాడుతూ భారతదేశంలోని వామపక్ష లౌకిక ప్రజాస్వామ్య శక్తులను ఐక్యం చేసి కేంద్రంలో నరేంద్ర మోడీ బీజేపీ నాయకత్వంలోని ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మిక, రైతాంగ వ్యతిరేక మతోన్మాద విధానాలపై ఐక్య ఉద్యమాలు చేపట్టాల్సిన తక్షణ కర్తవ్యం ఉన్నదని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. నేడు దేశంలో మత, జాతి, కుల, వైరుధ్యాలు, కార్పోటు సంస్థల అంతులేని దోపిడి నేపథ్యంలో సమగ్రత, సమైక్యత, సౌభ్రతత్వం, సమానత్వంతో కూడిన లౌకిక ప్రజాస్వామ్య భారతం కొరకు నిలకడగా ఉద్యమిస్తుందని అన్నారు. ప్రజల ఉజ్వల చరిత్ర కలిగిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. వివిధ సంస్కృతులు భాషలు, మతాలు కలిగి భిన్నత్వంలో ఏకత్వం, ఏకత్వంలో భిన్నత్వం కలిగిన వసుదైక కుటుంబం. భారత్ మహోజ్వల చరిత్ర కలిగిన భారత్ ను కాపాడుకోవడంలో అహర్నిశలు కృషి చేస్తున్న పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మహేశ్వరం నియోజకవర్గ కార్యదర్శి బి దత్తు నాయక్, మండల నాయకులు పి దేవేంద్ర గౌడ్, రాములు, రాజు, కలమ్మ, పుష్పమ్మ, రాణి, యాదమ్మ నరసింహ కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యానవనంలో సౌకర్యాలు కల్పించాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**విశ్వంభర, భూపాలపల్లి:** జయశంకర్ ఉద్యానవనం లో సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శనివారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధి సుభాష్ కాలనిలోని ఆచార్య జయశంకర్ ఉద్యాన వనాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ శనివారం పరిశీలించారు. ఉద్యానవనంలోని ఓపెన్ జిమ్, పిల్లలు ఆటలు ఆడుకోవడానికి ఏర్పాటు చేసిన ఆట వస్తువులను పరిశీలించారు. పిల్లల ఆటవస్తువులు శిధిలావస్థకు చేరుకున్నాయని వాటి స్థానంలో కొత్త ఆట వస్తువులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఓపెన్ జిమ్ ప్రాంగణంలో వేసిన రబ్బరు టైల్స్ పాడైపోయాయని వాటిని మార్చాలని, ఓపెన్ జిమ్ పరికరాలను మరమ్మత్తులు చేయించాలని



మున్సిపల్ అధికారులకు సూచించారు. ఉద్యానవనంలో మొక్కల పెంపకాన్ని పరిశీలించిన కలెక్టర్ నిర్వహణ బావుందని సంతృప్తి వ్యక్తం చేశారు. జయశంకర్ ఉద్యానవనం అభివృద్ధికి కావలసిన ప్రతిపాదనలు రూపొందించాలని మున్సిపల్ అధికారులను అదేశించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయ లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, పట్టణ ప్లానింగ్ అధికారి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## దూరంగా 'టెట్' సెంటర్లు.. ఇబ్బందుల్లో అభ్యర్థులు

**బీఈడీ సంఘం రాష్ట్ర నేత కిరణ్ కుమార్**

**విశ్వంభర, నెల్లికుదురు:** జనవరి 2నుంచి నిర్వహించే టెట్ పరీక్ష సెంటర్లను అభ్యర్థులకు దూరంగా కేటాయించడం సరైంది కాదని బీఈడీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోటగిరి కిరణ్ కుమార్ గౌడ్ ఆక్షేపించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..ఏ జిల్లాలో ఉన్న అభ్యర్థులను ఆ జిల్లాలో కనీసం ఉమ్మడి జిల్లాలోనైనా సెంటర్లు కేటాయించాల్సిందన్నారు. 80 నుంచి 150 కి.మీ పైగా దూరంలో, ఇతర జిల్లాలలో సెంటర్లను కేటాయించడంతో ముఖ్యంగా మహిళా అభ్యర్థులు చలిలో తీవ్ర ఇబ్బందులకు గురవుతారన్నారు. ఇది అభ్యర్థులపై కక్ష సాధింపేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉ. 8:45 గంటలకు పరీక్షా కేంద్రాల వద్ద 15 నిమిషాలు ముందే రావాలని నిబంధనలు విధించడం సరైంది కాదన్నారు. 'టెట్' అభ్యర్థులందరికీ ఉచిత ప్రయాణ వసతి కల్పించాలని కోరారు.



## తెలంగాణ ఉద్యమకారుడి మాతృమూర్తికి నివాళులు



**విశ్వంభర, ఆమనగల్లు:** తెలంగాణ ఉద్యమ కారుడు బీఆర్ఎస్ నాయకుడు ఎంగలి రఘు మాతృమూర్తి ఎంగలి సుశీలమ్మ ద్వాదశ దిన కర్మ జరిగింది. ఈ సందర్భంగా శనివారం కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్ యాదవ్ అమనగల్ పట్టణంలోని వారి నివాసంలో ఎంగలిరఘు, ఆయన సోదరులు బాలకిష్టయ్య, యాదగిరి, శ్రీనివాస్, రమేష్ లతో కలిసి వారి అమ్మగారి చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీపతి శ్రీనివాస్ రెడ్డి, ఏ ఎంసీ ఛైర్మన్ యాట గీత నరసింహ, అమనగల్ మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్,వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్ గౌడ్,మాజీ ఏఎంసి ఛైర్మెన్ నాలపురం శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ అనిత విజయ్, డైరెక్టర్లు వస్పుల శ్రీశైలం, మున్సిపాలిటీ వైస్ ఛైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్ విజయ కృష్ణ, వస్పులసాయిలు,కోట శ్రీను,గాజుల శ్రీను,కండె భాస్కర్, భాస్కర్ రావు, మంగ్లీ రాములు, శ్రీనివాస్ రెడ్డి, వివిధ పార్టీల నాయకులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## శని త్రయోదశి ఆదాయం రూ. 4 లక్షల 38 వేలు

**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం శని త్రయోదశి సందర్భంగా ఆలయానికి భక్తులు పోటెత్తారు. నవగ్రహ పూజలు 542, కాలసర్పదోష పూజలు 96, స్వామివారి అభిషేకములు 105, అమ్మవారి కుంకుమార్చనలు 41 జరిగినట్లు ఆలయ అధికారులు తెలిపారు. వివిధ పూజలపై, ప్రసాదాల అమ్మకం ద్వారా ఆదాయం రూ. 4,38,000 లు సమకూరినట్లు ఆలయ వర్గాలు తెలిపారు.



## కస్టమ్ మిల్లింగ్ రైస్ ప్రక్రియ వేగవంతం చేయాలి



**విశ్వంభర, భూపాలపల్లి:** రబీ 202223 వేలం ధాన్యం మరియు రబీ 202324 కస్టమ్ మిల్లింగ్ రైస్ పై సమీక్ష అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రబీ 202223లో వేలం వేసిన ధాన్యాన్ని 2024 డిసెంబర్ 31లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే, రబీ 202324 కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ప్రక్రియను వేగవంతం చేయాలని మిల్లర్లకు సూచించారు. ప్రభుత్వ నిబంధనలు మరియు సమయ పరిమితులను పాటిస్తూ అన్ని ప్రక్రియలను సకాలంలో పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు. రైస్ మిల్లర్లు తగిన చర్యలు తీసుకోవాలని మరియు నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, డీఎం రాములు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

## పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్ దరఖాస్తులు ఆహ్వానం

**- షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం. నరసింహస్వామి**

**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లాలోని 202425 విద్యా సంవత్సరమునకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్ మంజూరు కొరకు దరఖాస్తు చేసుకొనే రెనువల్/ఫ్రెష్ విద్యార్థిని విద్యార్థులు తమ యొక్క దరఖాస్తులను తేది.31.12.2024 లోపు ఆన్ లైన్ లో http://tgepasstelangana.cgg.gov.in/ వెబ్ సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలని, అందుకు సంబంధిత ప్రభుత్వ/ప్రైవేట్ కళాశాల ల ప్రిన్సిపాల్స్ విద్యార్థిని విద్యార్థులు దరఖాస్తు చేసుకొనుటకు ప్రోత్సహించవలేనని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం.నరసింహస్వామి నేడు ఒక ప్రకటనలో తెలిపారు.

## సంకీర్తన ఫౌండేషన్ సేవా సంస్థ క్యాలెండర్ ఆవిష్కరణ



**విశ్వంభర, ఎల్బీనగర్:** సంకీర్తన ఫౌండేషన్ సేవా సంస్థ యొక్క 2025 నూతన క్యాలెండర్ ను ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ సంస్థ ద్వారా గతంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పేద ప్రజలకు మేలు జరిగిందని గుర్తు చేశారు. గత కరోన సమయంలో పేద ప్రజలకు బియ్యం,కూరగాయలు నిత్యవసర సరుకులు వివిధ ఆశ్రమల్లో దుపట్లు, అనాధ పిల్లలు పాఠ్య పుస్తకాలు బ్యాగ్స్ ఇవ్వడం జరిగింది అని తెలిపారు. తప్పకుండా నా యొక్క సహాయ,సహకారాలు అందిస్తామని అని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ మెగావత్ అనిత, జనరల్ సెక్రటరీ మల్లేష్ యాదవ్, హనుమంత్, సైదులు, వినోద్, కొంపల్లి దివ్య, మమత, దివ్య, పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి సన్నిధి కోసం భూమి

**- పూజా కార్యక్రమంలో పాల్గొన్న సబితా ఇంద్రారెడ్డి**

**విశ్వంభర, మహేశ్వరం:** మహేశ్వరం మండలం కేసీ తాండ గ్రామ పరిధిలోని కొత్వాల్ చెరువు కట్ట పై తెలంగాణ రాష్ట్రంలోని ఎతైన విగ్రహంగా పిలువబడే పరమేశ్వరుడి విగ్రహం ప్రక్కన కేసి తాండ గ్రామ అయ్యప్ప స్వామి భక్తుల సన్నిధానం నిర్మిస్తున్న అయ్యప్ప సన్నిధి నిర్మాణం కోసం మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు. వచ్చే సంవత్సరం సన్నిధి అందుబాటులోకి తేవాలని మాజీ సర్పంచ్ మోతిలాల్ చెప్పారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం కేసి తాండ గ్రామ అయ్యప్పస్వామి భక్తులు, ప్రజా ప్రతినిధులు, బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# మామిడి తోటలలో తీసుకోవలసిన సస్య రక్షణ చర్యలు



**విశ్వంభర, మహబూబాబాద్:** బయ్యారం మండలంలోని పలు గ్రామాలను జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ అధికారి జినుగు మరియన్న సందర్శించారు. సాగు లో వున్న ఆయిల్ పామ్, మిరప, మామిడి, కూరగాయ తోటలను పంటలలో తీసుకోవలసిన మేలైన యాజమాన్య పద్ధతులను తెలియజేశారు. మహబూబాబాద్ జిల్లాలో 13,011 ఎకరాలలో మామిడి తోటలు సాగు అవుతున్న వని, సీజన్ ప్రారంభం అవుతుంది కనుక మామిడి రైతులు మేలైన యాజమాన్య పద్ధతులతో పాటు సస్య రక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. మొగ్గలను ఉత్తేజపరచి తొందరగా పూత తెప్పించడానికి డిసెంబర్ 1520ల మధ్య నీటి వసతి ఉన్న తోటల్లో పాదుల్లో తేలిక పాటి తడి ఇవ్వటం లేదా లీటరు నీటికి పొటాషియం నైట్రేట్ 10 గ్రా, + యూరియా 5 గ్రా. చొప్పున కలిపి చెట్టుపై పిచికారి చేయడం వల్ల పూమొగ్గలు దాదాపు ఒకేసారి చిగురించి పూత త్వరగా వచ్చేలా యవచ్చునన్నారు. పచ్చిపూత దశలో అంటే పూత కాడలు బయటకు వచ్చే పూలు వికసించకుండా ఇంకా మొగ్గ దశలో ఉన్నప్పుడు. లీటరు నీటికి 0.3 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ కలిపి పిచికారి చేయడం ద్వారా తేనె మంచు పురుగులను నివారించుకోవచ్చునన్నారు. పూత చుట్టు పురుగు పూతను గూడుగా ఏర్పరచుకొని, పూతను తిని విపరీతంగా నష్టపరుస్తుంది. ఇది ఆశించిన పూల గుత్తుల్లో పిందెలు ఏర్పడవని ఈ పురుగు నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లీటరు నీటిలో కలిపి పూల గుత్తుల పై పిచికారి చేయాలన్నారు. చల్లని రాత్రులు, వెచ్చని పగటి వాతావరణంలో పూకాడలపై, పూల మీద తెల్లని పొడి లాంటి (బూడిద తెగులు) బూజు ఏర్పడుతుంది. దీని నివారణకు పూమొగ్గలు కనిపించిన దశలో లీటరు నీటికి 3 గ్రా. నీటిలో కరిగే గంధకం కలిపి పిచికారి చేయాలన్నారు. పూత దశలో బూడిద తెగులు కనిపిస్తే లీటరు నీటికి హెక్సాకొనజోల్ 2 మి.లీ. లేదా ప్రొపికొనజోల్ 1 మి.లీ. లేదా డైనోకాప్ 1 మి.లీ. చొప్పున కలిపి పూత కాడలు తడిచేలా పిచికారి చేయాలన్నారు. పూత మాడు తెగులు నివారణకు మొగ్గ బయటకు వచ్చే దశలో 3 గ్రా. కాపర్ ఆక్సీ క్లోరైడ్, పచ్చిపూత మీద 1 గ్రా. కార్బండాజిమ్ లేదా 1 గ్రా. థయోఫినైట్ మిథైల్ ను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలన్నారు. ఉద్యాన పంటల సాగు లాభదాయకం పంట మార్పిడి తో అధిక ఆదాయంపండ్ల తోటలలో అంతర పంటలుగా కూరగాయల సాగు : మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలు సాగు చేయాలని, నిత్యం రోగనిరోధక శక్తికి, ఆరోగ్యంగా ఉండటానికి పోషకాలు అందించే పండ్ల తోటలు అయిన జామ, నిమ్మ, అరటి, బొప్పాయి, సీతాఫలం, పనస, నేరేడు, అవకాడో, ఫ్యాషన్ ఫ్రూట్, కూరగాయలు, ఆకు కూరలు, మునగ, వెదురు మొదలైనవి సాగు చేయాలని తద్వారా ఎకరానికి లక్ష రూపాయలు నికర ఆదాయం పొందాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ప్రతి రైతు పొలం గట్ల మీద, పొలం చుట్టూ, పెరట్లో, ఆయిల్ పామ్, పండ్ల తోటలలో అంతర పంటలుగా, డాబాల మీద, ఇంటి ముంగిట రోజువారి అవసరాల నిమిత్తం అన్ని రకాల కూరగాయలను సాగు చేసుకోవాలని, కూరగాయల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు, నూతన రకాల సాగు, ప్రోట్రేస్లలో నారు పెంపకం, ఎత్తు మడులు, మల్చింగ్, బిందు సేద్యం, ఫర్టిగేషన్, వేప పిండి, ఆముదం పిండి వాడకం, వేప నూనె పిచికారి చేయటం, పసుపు రంగు అట్టల వాడకం, సిఫారసు చేసిన ఎరువులు వాడటం, పందిరిపై కూరగాయల సాగు, ట్రెల్లిస్ మెథడ్ లో టమాటా సాగు మొదలైన పద్ధతులు పాటించాలని అన్నారు. ఈ క్షేత్ర సందర్శనలో ఉద్యాన అధికారి ఏ. జె. శాంతి ప్రియదర్శిని, కార్యాలయ అధికారి ఆర్. శ్రీనివాస రావు, రైతులు ఏలూరి నరసింహ రావు, ఆలె బిక్షం, దరావతు శ్రీనివాసు, దరావతు ఉమ, వెంకటేశ్వర్లు, యాకన్న, బిందు సేద్య అధికారులు ఎం. అశోక్, నవీన్ పాల్గొన్నారు.

## డిఎం అండ్ హెచ్ఓ ఆసుపత్రుల తనిఖీ



**విశ్వంభర,నెల్లికుదురు:** మానుకోట జిల్లా నెల్లికుదురు మండల కేంద్రం పిహెచ్సి, నరసింహుల గూడెం పల్లె దవాఖాన లను జిల్లా వైద్యఆరోగ్యాధికారి డా.మురళీధర్ శనివారం విజిట్ చేశారు. అటెండెన్స్,ఒపి,ఐపి రిజిస్టర్లను పరిశీలించారు. స్టాఫ్ సమావేశంలో అవసరమైన మెడిసిన్స్ అందుబాటులో ఉన్నాయా,ల్యాబ్ సేవలు,నేషనల్ ప్రోగ్రామ్స్ ప్రగతిపై అడిగి తెలుసుకున్నారు. నర్సింహులు గూడెం పల్లె దవాఖాన నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండ్ (ఎన్ క్యూఎఎస్) కోసం ఎంపికకు కావలసిన అవసరాలపై ఆరా తీశారు.ఆయా కార్యక్రమాలలో క్వాలిటీ మేనేజర్ సురేష్,నెల్లికుదురు మెడికలాఫీసర్ ఉల్లి రమ్య,నరసింహుల గూడెం పల్లె దవాఖాన పిడిఎంఒ డా.బి.త్రివేణి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత




**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండలం గట్టు ఇప్పలపల్లి గ్రామానికి చెందిన ఆలూరి ఆంజనేయులుకు కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో 44 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును గ్రామ కాంగ్రెస్ నేతలతో కలిసి రేణు రెడ్డి, ప్రశాంత్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి,డేవిడ్, మాజీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఏదుల శంకర్,యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇంద్రకంటి శివ గౌడ్,మాజీ ఉప సర్పంచ్ చంద్రమౌళి,కిషన్ వాల్మీకి, సొప్పరి శీను,మట్ట అంజయ్య, జక్కుల మల్లేష్,పరమేష్,జాంగిర్, రాహుల్,నవీన్ గౌడ్,పవన్ వాల్మీకి,సురేష్,దుబ్బ కిషోర్, కృష్ణయ్య, మల్లయ్య, వెంకటయ్య, రామచంద్రి, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కప్ క్రీడలను పర్యవేక్షించిన ఎమ్మెల్యే లు



**విశ్వంభర, హనుమకొండ:** తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చీఫ్ మినిస్టర్ కప్ 2024 లో భాగంగా హనుమకొండ జె.ఎన్.ఎస్ స్టేడియం నందు జరుగుతున్న బాల బాలికల హ్యాండ్ బాల్ పోటీలను హనుమకొండ కలెక్టర్ శ్రీమతి పి. ప్రావీణ్య, స్థానిక వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తో కలిసి పర్యవేక్షించి కాసేపు క్రీడాకారులతో కలిసి హ్యాండ్ బాల్ ఆడి వారిలో జోష్ నింపిన వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు హ్యాండ్ బాల్ క్రీడాకారులను పరిచయం చేసుకుని, క్రీడాను వీక్షించారు... ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు.. పట్టణ,గ్రామీణ యువతలోని ప్రతిభను వెలికితీయడం, ప్రతిభావంతులను రాష్ట్ర, జాతీయ స్థాయికి తీసుకెళ్లడం ద్వారా దేశానికి పతకాలు సాధించడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులను వెలికి తీసి జాతీయ, అంతర్జాతీయ పోటీలకు సిద్ధం చేయడం కోసం సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, హనుమకొండ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ అజీజ్ ఖాన్, జిల్లా క్రీడాశాఖ అధికారి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## ఇరుముడి కార్యక్రమంలో సబితా ఇంద్రారెడ్డి



**విశ్వంభర, మహేశ్వరం:** మహేశ్వరం మండలం తుమ్మలూర్ గ్రామంలో గంట వెంకట్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ తుమ్మలూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడిపూజా, ఇరుముడి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కి అయ్యప్పస్వాములు స్వాగతం పలికి ఆ హరిహరపుత్రుడు అయ్యప్పస్వామి వారి తీర్థప్రసాదాలు అందజేసి శాలువ, మెమోంటోతో సత్కరించారు. సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ అయ్యప్పస్వామిలు మండలం ఇన్ని రోజులు దీక్షలో నియమనిష్ఠలతో ఉండి మాలదరణలో ఉన్న రోజులను పండగల జరుపుకునే మీకు,అలాగే మహేశ్వరం నియోజకవర్గ ప్రజలకు ఆ అయ్యప్ప కృపాకటాక్షాలు సుఖశాంతులతో వర్ధిల్లేలా చూడాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారులు వేం నరేందర్ రెడ్డి ని వారి హైదరాబాదులోని ఆయన నివాసం లో తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు గుజ్జుల మహేష్ మర్యాద పూర్వకంగా కలిసి వెం నరేందర్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలిపారు.**
**- విశ్వంభర, హైదరాబాద్**



# దళిత ఉపాధ్యాయుడిపై దాడి

*** ఖండించిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ**



**విశ్వంభర, తుక్కుగూడ:** రంగారెడ్డి మహేశ్వరం మండలం తుక్కుగూడ గ్రామ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు రాములు పై మతోన్మాద మూకలు భక్తి ముసుగు వేసుకుని ఉద్దేశ పూర్వకంగా చేసిన దాడిని కందుకూరు డివిజన్ ఎస్సీ , ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ రంగారెడ్డి జిల్లా తరపున ఖండిస్తున్నాం. సదరు బడిలో డిసెంబర్ న విద్యార్థులను లెక్కలు అడిగిన పాపానికి, సరిగా లెక్కలు అప్పచెప్పనందుకు, విద్యార్థిని పక్కకు నిలబెట్టినందుకు ప్రతిగా, కాలితో అయ్యప్ప మాల వేసుకున్న స్టూడెంట్ ను తన్నాడనే దుష్ప్రచారం చేసి దాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేసి, 23 వతేదీ వరకు ఒక సెక్షన్ ను సమీకరించి, ప్రణాళిక బద్ధంగా అతనిపై దాడి చేసి, క్షమాపణ చెప్పినా వినకుండా, అక్కడున్న మాలను ధరించిన విద్యార్థి, మరియు ఇతర స్వాములు కాళ్లకు మొక్కించడం అత్యంత హేయమైన చర్ అన్నారు. దాడికి గురైన బాధిత టీచర్ దళితుడు కావడం ఇక్కడ గమనార్హం. ఆ పాఠశాలలో వందలాది మంది విద్యార్థులు ఉండగా ఈ సంఘటన జరగడం ఉపాధ్యాయుల యొక్క మానసిక స్థైర్యాన్ని దెబ్బతీస్తుందన్నారు.
అంతేకాకుండా ఈ సంఘటన జరిగినప్పుడు విద్యార్తి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు లేకుండా హిందుత్వ సంఘాలు, స్వాములు అనే వాళ్ళు ఈ విషయాన్ని పూర్తిగా తమ పరిధిలోకి తీసుకొని, కొట్టడం చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని భయభ్రాంతులకు గురి చేయడం, చట్ట వ్యతిరేకమైనది అమానవీయమైనదని పేర్కొన్నారు.
విద్యార్థులు తమ కాళ్ళ మీద తాము నిలబడాలని, సమాజంలోని ఎలాంటి మూఢ విశ్వాసాలకు బానిసగా మారి, శిరస్సు వంచడం, పాదాలకు నమస్కరించడం వంటి పనులు చేయకూడదని చెప్పే ఉపాధ్యాయుల చేతనే విద్యార్థుల కాళ్లు మొక్కించడం, దాని వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేయడం,కుట్రపూరితంగా ప్రణాళిక బద్ధంగా చేసిన భౌతిక, మానసిక దాడిగా పరిగణిస్తున్నామన్నారు.
అంతే కాకుండా దాడికి సూత్ర దారులైన నిందితులపై, ఉపాధ్యాయుడు రాములు పెట్టిన కేసును అక్కడి పెద్దలంతా ఒత్తిడి చేసి, విరమించుకునేలా చేయడం కూడా అత్యంత దుర్మార్గమైనదిగా స్పష్టం చేస్తున్నాము. కనుక ఈ దాడి విషయాన్ని ప్రభుత్వం, పోలీసులు సీరియస్ గా తీసుకొని నిందితులపై కేసులను నమోదు చేసి చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. పాఠశాలలు శాస్త్రీయ భావనలను పెంపొందించాలని, ప్రధానంగా విద్యార్థులలో,సమాజంలో, శాస్త్రీయ భావనలని, ఆలోచన విధానాన్ని ప్రోది చేసేందుకే ఉంటాయని, మూఢ విశ్వాసాలకు, అందులో చోటు ఉండకూడదని,ఈ దిశగా ప్రభుత్వం కదిలేలా సమాజం ఒత్తిడి చేయాల్సిన అవసరం ఉన్నది. అంతే కాకుండా ఉపాధ్యాయులకు పని చేసే చోట్ల భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సాటి ఉపాధ్యాయులు, ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, విద్యార్థి సంఘాలు ఈ సంఘటనను ఖండించి బాధితుని పక్షంలో నిలబడాలని రంగారెడ్డి జిల్లా కందుకూరు డివిజన్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ విన్నవించింది.

# ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన ఎమ్మెల్యే నాగరాజు



విశ్వంభర, వరంగల్ : గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 44 పరిధిలోని కడిపికొండ ఇందిరమ్మ కాలనీ రాజీవ్ గృహ కల్ప లో గత 2005 లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదలకు ఇచ్చిన ఇళ్లను అప్పటి నుంచి మరలా ఏర్పడిన ఏ ప్రభుత్వాలు కూడా ఆ ఇళ్ల బాగోగులనూ పట్టించుకున్న పాపాన పోలేదు. గత అసెంబ్లీ ఎన్నికలో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం శనివారం జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, నగర కమిషనర్ అశ్విని తానాజి వాకడే, నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి తో కలిసి బ్లాక్ ఉన్నవారినీ అడిగి వారి సమస్యలు తెలుసుకొని దిన వ్యవస్థలో ఉన్న బిల్డింగ్ పై వాటర్ లీకేజీ నీ పరిశీలించి, అలాగే డ్రైనేజీ వ్యవస్థను అధికారులతో కలిసి పర్యవేక్షించి త్వరితగత సమ్యసలు పూర్తి చేసే విధంగా కృషి చేయాలని అధికారులకు సూచించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు. అనంతరం కలెక్టర్, కమిషనర్ మేయర్ సానుకూలంగా స్పందించి త్వరితీగతన పనులు పూర్తి చేసే విధంగా కృషి చేస్తామన్నారు.అనంతరం ఇల్లు లేని నిరుపేదల కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం త్వరలోనే ఇల్లు నిరుపేదలకు ఇల్లు కట్టించేందుకు ఐదు లక్షల రూపాయలు సహాయం చెయ్యబోతుందన్నారు. కావున ఎవరూ ప్రతిపక్షాల మాటలను నమ్మి అపోహలకు పోయి మోసపోవద్దని అన్నారు. ఇల్లు లేని నిరుపేదలందరికీ అందించే బాధ్యత మన ప్రభుత్వం తీసుకుంటుందన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధికారులు కాలనీ ప్రజానీకం తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు లయన్స్ క్లబ్ అండ

**ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఫ్యాన్ల అందజేత**



**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండల పరిధిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు మల్టిపుల్ ఎల్సిఐఎఫ్ ఏరియా లీడర్ లయన్ సందడి నరేందర్ రెడ్డి సమకూర్చిన రూ .25వేల విలువగల పది ఫ్యాన్ లను ఉన్నత పాఠశాలకు లైన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ కండే ఓంకారం అందజేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు లైన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఎప్పుడు అండగా ఉంటుందని లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ కండె ఓంకారం తెలిపారు. నేటి విద్యార్థులే రేపటి భావిభారత పౌరులని విద్యార్థులకు, పాఠశాలలకు మౌలిక వసతులు ఏర్పాటు చేయడంతో లయన్స్ క్లబ్ ఆమనగల్లు ఎప్పుడు ముందంజలో ఉంటుందన్నారు. లైన్స్ క్లబ్ ఆమనగల్ వారి ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయిలో పాఠశాలకు వాటర్ ట్యాంకులు, బెంచీలు, అందజేసినట్లు జిల్లా చైర్మన్ కండె ఓంకారం తెలిపారు. ఉన్నత పాఠశాలకు 10 ఫ్యాన్స్ అందజేసినట్లు క్లబ్ పీఆర్ఓ పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్లు అంజయ్య గుప్త, అజీమ్, లైన్స్ క్లబ్ సభ్యులు డి. మోహన్ రెడ్డి, పండగ అంజయ్య, శ్రీనివాస్ రెడ్డి, క్లబ్ పిఆర్వో పాషా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఝాన్సీ లక్ష్మి, ఉపాధ్యాయులు క్రాంతి కుమార్, రాజేశ్వర్ రెడ్డి, కబీర్, పాండు, కృష్ణ, సుష్మ పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా కారం నాగేంద్రబాబు



**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం 12 మంది సభ్యులతో కలిసి నూతన క్లబ్ ఏర్పాటు చేసుకున్నారు. క్లబ్ అధ్యక్షులుగా కారం నాగేంద్రబాబు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాగేంద్రబాబు మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నన్ను క్లబ్ అధ్యక్షులుగా ఎన్నుకున్న సభ్యులందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. నాపై నమ్మకం ఉంచినందుకు నేను క్లబ్ ను ముందుకు నడిపించడంలో, ప్రజా సమస్యలపై నిత్యం పోరాటం చేయడానికి ముందు ఉంటానని మన ప్రెస్ క్లబ్ దమ్మపేటలో నీ ఏం టైమ్ లోనైన ప్రజల సమస్యల పై సంప్రదించొచ్చు అని కారం నాగేంద్రబాబు తెలిపారు.

## అయ్యప్ప స్వామి మహా పడిపూజ మహోత్సవం



**విశ్వంభర, గౌలిపుర:** యాకుత్పురా నియోజకవర్గం గౌలీపురాలోని శ్రీ కన్యకా పరమేశ్వరి ట్రస్ట్ భవనం నందు అయ్యప్ప స్వామి మహా పడిపూజ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సరాబు శివకృష్ణ కన్య స్వామి, సరాబు సంతోష్ కుమార్, సరాబు విశ్వేశ్వరయ్య గుప్తా , రంగి సంతోష్ కుమార్ కన్నె స్వామి, వేదాంతము రాజసింహచార్యులు చే ఉదయం 9 గంటల దీపారాధన, 10 గంటలకు అభిషేకం, మధ్యాహ్నం 12:30 నిమిషాలకు పరిహారతి నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పడిపూజ కార్యక్రమం విజయవంతం చేశారు.


## ధాన్యం కొనుగోలు కేంద్రాలు పరిశీలించిన అదనపు కలెక్టర్



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లాలోని వెలిషాలపల్లి, భాస్కర్‌గడ్డ ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్శనలో కొనుగోలు. కేంద్రాల్లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమీక్షించి, సౌకర్యాలను పరిశీలించి రైతులతో ముఖాముఖి అయ్యారు. రైతుల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి తగిన సూచనలు చేశారు. ధాన్యం. మిల్లులకు రవాణా చేయడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం, ప్యాకింగ్ వంటి కార్యకలాపాలు సజావుగా జరుగుతున్నాయా లేదా అని రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు మరింత సులభతరంగా, పారదర్శకంగా సేవలందించడానికి అధికారులు కృషి చేయాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, సహకార అధికారి వాలియా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాలలో సౌకర్యాలు కల్పించాలి: కలెక్టర్

**విశ్వంభర, భూపాలపల్లి:** అంగన్వాడీ కేంద్రాలు మరమ్మతులు, రంగులు, మంచినీరు, మరుగుదొడ్డి సౌకర్యాలు కల్పన పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పంచాయతి రాజ్, టీజీఈడబ్ల్యూఐడీసీ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమ, పంచాయతి రాజ్, టీజీ ఈడబ్ల్యూఐడీసీ ఇంజినీరింగ్ అధికారులతో పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 కేంద్రాలు అప్ గ్రేడ్, 50 కేంద్రాల్లో మంచినీరు, 64 కేంద్రాల్లో మరుగుదొడ్లు, 64 కేంద్రాలకు రంగులు వేయు పనులు చేపట్టినట్లు తెలిపారు. అట్టి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సంక్షేమ అధికారి చిన్నయ్య, పీఆర్, టీజీఈడబ్ల్యూ ఐడీసీ ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# బీఎస్పీ రాష్ట్ర కార్యాలయ ముట్టడి

**విశ్వంభర, హైదరాబాద్:** స్వచ్ఛంద సంస్థ ముసుగులో బి.ఎస్.పి రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ పేద ప్రజలను, సొంత పార్టీ కార్యకర్తలను మోసం చేస్తున్నారని పలువురు బాధితులు ఆరోపించారు.

గ్రామాలలో ఇళ్లు కట్టిస్తానని, నాబార్డు నుంచి వివిధ పథకాల సబ్సిడీ తోపాటు డైరీ, వ్యవసాయ, చేపల పెంపకం వంటి రుణాలు ఇప్పిస్తానని, మార్జిన్ మనీ, ఖర్చుల పేరుతో కోట్లాది రూపాయలను వసూలు చేసి మోసం చేసిన మంద ప్రభాకర్, మాల్యవి కరుణోదయ స్వచ్ఛంధ సంస్థ నిర్వాహకురాలు కొండ కృష్ణమ్మలపై తగిన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితులు పోలీసులకు, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా డబ్బులు ఇచ్చి మోసపోయిన వందలాది బాధితులు శనివారం హైదరాబాద్ లక్డిక పుల్ లోని



బి.ఎస్.పి రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టండించారు. బి.ఎస్.పి కార్యాలయం ముందు బైఠాయించి మంద ప్రభాకర్, కొండ కృష్ణమ్మలపై చర్యలు తీసుకోవాలి, తమ డబ్బులు తమకు ఇప్పించి న్యాయం చేయాలని ప్లకార్డులు చేతబూని పెద్దఎత్తున నినాదాను చేసారు. విషయాన్ని తీవ్రంగా పరిగణించి నిరుపేద బహుజనులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

మంద ప్రభాకర్ లాంటి దుర్మార్గులు బి.ఎస్.పి రాష్ట్ర అధ్యక్ష పదవిలో ఉండడం, పార్టీని నడిపించడం వల్ల పేద ప్రజలకు హాని జరుగుతుందని, వెంటనే ఆయనను పదవి నుంచి తొలగించాలని వారు కోరారు.

ప్రభుత్వం తక్షణమే స్పందించి తమకు తగిన న్యాయం చేసి, డబ్బులు ఇచ్చించాలని వారు విజ్ఞప్తి చేసారు. ఈ సందర్భంగా బాధితులు పల్లేటీ రవీందర్, గుర్రాల నాగయ్య, ముడిగి భిక్షపతి, నాతూరామ్, గ్యార జంగయ్య, పూదరి నరసింహా, జిల్లా రవి, వంగ కృష్ణయ్య, అజ్జాలపురం శ్రీనివాస్ తదితరులు మీడియాతో మాట్లాడారు.

## మాస్టర్ అర్జున్‌ని ప్రశంసించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



**విశ్వంభర, వెల్దండ:** ఇటీవల జరిగిన 68వ ఆల్ ఇండియా నేషనల్ స్కూల్ గేమ్స్ లో వెల్దండ మండలం నగరగడ్డ తండాకు చెందిన అర్జున్ మురళీ అండర్ 14 కరాటే విభాగంలో 202425 తెలంగాణ కు తొలిసారిగా రజత పతకం సాధించిన సందర్భంగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అర్జున్ని అభినందించారు. మన రాష్ట్రానికి నిజంగా గర్వించదగిన, మరపురాని క్షణం అని అన్నారు. కోచ్ ప్రవీణ్ తండ్రి మురళీ మోహన్ సారధ్యంలో అర్జున్ మురళీ ఇంకా ఎన్నో పతకాలు సాధించాలని ఆశీర్వదించి అతన్ని శాలువాతో సన్మానించారు.

## బీజేపీని మరింత పటిష్టం చేయాలి


*** బిజెపి నేత గౌతమ్ రావు**



**విశ్వంభర, హైదరాబాద్:** భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చెయ్యాలని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డా. ఎన్. గౌతమ్ రావు అన్నాడు. కాచిగూడ లోని 231 వ బూత్ అధ్యక్షులుగా రాజును నియమిస్తున్నట్లు గౌతమ్ రావు బీజేపీ నగర కార్యాలయంలో ప్రకటించారు. ఈ సందర్భంగా గౌతమ్ రావు మాట్లాడుతూ బీజేపీతోనే ప్రగతి సాధ్యం అవుతుందని ఆయన పేర్కోన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఉమా రమేష్ యాదవ్, నేతలు సూర్య ప్రకాష్ సింగ్, చిట్టి శ్రీధర్, రమేష్ యాదవ్, బుచ్చిరెడ్డి, శ్యామ్ రాజ్, సుభాష్ పాటిల్, శీర్ సాగర్, కృష్ణ కుమార్, భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గోన్నారు.

## "మన దేశం మన రాజ్యాంగం" పుస్తక ఆవిష్కరణ

**విశ్వంభర, హైదరాబాద్:** కత్తి పద్మారావు రాసిన "మన దేశం మన రాజ్యాంగం" పుస్తకాన్ని అంబేద్కర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఘంటా చక్రపాణి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, ఇది ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకం. మత గ్రంథాలన్నింటికన్నా రాజ్యాంగమే ఈ దేశానికి అవసరమైన గ్రంథం. ఇందులోని ప్రతీ వ్యాసం రాజ్యాంగం అవసరం ఏంటనేది తెలియజేస్తుంది. ఇది బాబా సాహెబ్ అంబేద్కర్ కి ఇచ్చిన గొప్ప నివాళి ఈ పుస్తకం అన్నారు. కత్తి చేతన్ మాట్లాడుతూ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించే అవకాశం రావడం నాకు దక్కిన అదృష్టం. ఇటు బీ.ఎస్. రాములు మాట్లాడుతూ నిత్య జీవితంలో భారత రాజ్యాంగం పాత్ర ఎలాంటిదో ఈ పుస్తకం ద్వారా కత్తి పద్మారావు వివరించారు అని బీ.ఎస్. రాములు అన్నారు. కత్తి పద్మారావు విభిన్న ప్రక్రియల్లో సాధికారమైన పుస్తకాలను తీసుకొచ్చారు అని కోయి కోటేశ్వరరావు అన్నారు. జర్నలిస్టు బుచ్చన్న మాట్లాడుతూ భారతదేశ వ్యాప్తంగా భారత రాజ్యాంగం మీద చర్చలు జరుగుతున్నాయి. 1980, 90 లో ఒక చైతన్యానికి ప్రతిబింబం కత్తి పద్మారావు. ఇప్పటికి ఆయన మాటల్లో శక్తి తగ్గలేదు. భారత రాజ్యాంగాన్ని పద్మారావు కోణంలో చదివితే దేశంలో ఏం జరుగుతుందో సులువుగా అర్థం అవుతుంది అన్నారు. రియాజ్ మాట్లాడుతూ 70 ఏళ్ళ తర్వాత రాజ్యాంగం మీద దేశంలో ప్రధానంగా చర్చ జరుగుతోంది. ఆయన ప్రయాణం, పోరాటం సుదీర్ఘమైంది. ఎవరైతే భారత రాజ్యాంగాన్ని పాటిస్తారో వాళ్ళే అసలైన పౌరులు. కత్తి పద్మారావు రాసిన "మన దేశం, మన రాజ్యాంగం" పుస్తకం పాఠకులు, ముఖ్యంగా విద్యార్థులు చదవాల్సిన అవసరం ఉంది. అందరి చేతుల్లో ఈ పుస్తకం ఉండాలి అని అన్నారు.




## ఘనంగా ఒమేగా జూనియర్ కళాశాల వార్షికోత్సవం




**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ హబ్సిగూడ ఒమేగా జూనియర్ కళాశాల 24 వార్షికోత్సవం శనివారం నగరంలో ఘనంగా జరిగింది. గణపతి పాటతో నృత్యం చేస్తూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంస్కృతిక కార్యక్రమాల లో భాగంగా విద్యార్థిని విద్యార్థుల ర్యాంపు వాక్, జానపద నృత్యలు, లఘు నాటికలు అతిథులను ఆకట్టుకున్నవి. కార్యక్రమానికి ముఖ్య అతిదులు గా ఒమేగా గ్రూప్ ఆఫ్ కాలేజెస్ ఛైర్మన్ నాగ మోహన్ రెడ్డి వైస్ ఛైర్ కసిరెడ్డి మాలతి రెడ్డి మాట్లాడుతూ చదువుకునే విద్యార్థులు భవిష్యత్తులో తమ తల్లిదండ్రులు తలెత్తుకునే విధంగావారి నడవడిక కొనసాగాలని, కన్న కలలను సార్ధకం చేయాల్సిన బాధ్యత ప్రతి విద్యార్థిది అని అన్నారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్ డైరీ ఆవిష్కరణ చేసి కళాశాల వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేసి వారిని అభినందించారు.

## ఓయూ ఆర్ట్స్ కళాశాలకు ట్రేడ్ మార్క్ గుర్తింపు దక్కడం పట్ల హర్షం



**విశ్వంభర, మిర్యాలగూడ:** వంద సంవత్సరాల చరిత్ర కల్గిన ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల భవనానికి అరుదైన గౌరవం దక్కడం పట్ల బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం కాలంలో నిర్మించిన ఈ భవన నిర్మాణానికి ప్రతిష్టాత్మక భారత ప్రభుత్వ ట్రేడ్ మార్క్ గుర్తింపు లభించడం గొప్ప విషయమని ఇప్పటివరకు దేశంలో కేవలం రెండింటికి మాత్రమే ఈ అరుదైన అవకాశం దక్కిందని ముంబైలోని తాజ్ మహల్ హోటల్ కు మరియు స్టాక్ ఎక్స్చేంజ్ భవనాలకు మాత్రమే గుర్తింపు కలిగి ఉన్నదని మూడవదిగా ఆర్ట్స్ కళాశాల నిలవడం చాలా గొప్ప విషయం అన్నారు.

## అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ గా తాటి పాముల సునీత

**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం గుంపెల్ల గూడెం గ్రామానికి చెందిన తాటి పాముల సునీత గత పది సంవత్సరాలుగా లాయర్ గా మహబూబాబాద్ కోర్టు నందు పనిచేస్తున్నారు.ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన ఉత్తర్వులలో మహబూబాబాద్ జూనియర్ సివిల్ జడ్జిస్ కోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ తాటి పాముల సునీత ను ప్రభుత్వం నియమించడం తో శుక్రవారం ఆమె విధుల్లో చేరారు.గత పది సంవత్సరాలుగా అనేకమంది నిరుపేదలను ఎన్నో విధాల ఆదరిస్తూ తన వంతు సాయంగా ఉచితంగా అనేక కేసులను పరిష్కరించారు. రాబోవు కాలంలో అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు తన వంతు బాధ్యతగా సేవ చేయడమే తన కర్తవ్యమని మీడియాకు తెలిపారు.ఇంత చిన్న వయసులోనే ప్రభుత్వం తనను గుర్తించి అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ గా బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వానికి మరియు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, సీనియర్ న్యాయవాదులకు, తోటి కోర్టు కార్యాలయ ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్నేహితులు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు,బార్ అసోసియేషన్ సభ్యులు తదితరులు తాటి పాముల సునీతను అభినందించారు.



## గంజాయి విక్రయిస్తూ పట్టుబడ్డ విద్యార్థి



**విశ్వంభర, పోచారం:** మేడ్చల్ జిల్లా పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధి రాంపల్లి డబుల్ బెడ్ రూమ్స్ వద్ద గంజాయి విక్రయిస్తూ మణికంఠ (21) అనే హోటల్ మేనేజ్మెంట్ విద్యార్థి పట్టుబడ్డాడు. మణికంఠ ను అదుపులోకి తీసుకొని 5కేజీల గంజాయిని పోలీసులు స్వాదీనం చేసుకొన్నారు. మల్లాపూర్ లో ఉండే మణికంఠ, హోటల్ మేనేజ్మెంట్ రెండోవ సంవత్సరం చదువుతున్నాడు. 1.5 కేజీల గంజాయి తీసుకొచ్చి, రాంపల్లి డబుల్ బెడ్ రూమ్ ప్రాంతంలో అధిక ధరలకు అమ్ముతూ మణికంఠ పోలీసులకు చిక్కాడు. పోలీసులు అతన్ని ఆరస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.

## బీసీలకు 42% వాటా కల్పించిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

*** దళిత బహుజన ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్**



**విశ్వంభర, హనుమకొండ:** కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి లో ప్రకటించిన విధంగా బీసీ డిక్లరేషన్ అమలు చేసి 42 శాతం రిజర్వేషన్ కల్పించిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని దళిత బహుజన ఫ్రంట్ (డిబీఎఫ్)జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండలోని ఏకశిలా పార్కు వద్ద బీసీ ఆజాది ఫెడరేషన్ రాష్ట్ర యూత్ అధ్యక్షుడు జక్కని సంజయ్ చేపట్టిన సత్యాగ్రహ దీక్షకు ఆయన మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా అన్ని రాజకీయ పార్టీలు బీసీలను మోసం చేశాయని పోరాటాల ద్వారానే బీసీలకు న్యాయం జరుగుతుందని మరో పోరాటానికి బీసీలు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. బీసీల హక్కుల సాధన కోసం దళిత బహుజన ఫ్రంట్ తరపున పోరాడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గే, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేడల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్ఏ ఉద్యోగులకు పీఆర్టీయూ ఆర్థిక చేయూత

**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** 19 రోజులుగా న్యాయమైన హక్కుల కోసం సమ్మె చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులకు పీఆర్టీయూ పాపన్నపేట మండల శాఖ సంఘీభావం తెలిపి వారికి మౌలిక అవసరాల నిమిత్తం 18 వేల రూపాయలు ఆర్థిక సహకారం అందించింది.ఈ సందర్భంగా మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజు, సురేష్ మాట్లాడుతూ న్యాయమైన వారి డిమాండ్లు వెంటనే పరిష్కరించి సమ్మెను విరమింపజేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత రెండు దశాబ్దాలుగా విద్యాశాఖలో భాగమై చాలీ చాలని వేతనంతో ఇన్నాళ్లు పని చేశారని పెరిగిన నిత్యవసర ధరలు దృష్టిలో ఉంచుకొని వారికి మినిమం టైం స్కేల్ వర్తింపచేయాలని, ఉన్నత పాఠశాలల్లో నుండి మహిళా ఉపాధ్యాయినిలకు కేజీవీబీ లో ఎస్వోలుగా నియామక ఉత్తర్వులు వెంటనే నిలిపివేయాలని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు వారిని రెగ్యులరైజ్ చేస్తూ సమ్మె విరమింపజేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పత్రికా సంపాదకులు వెంకటరామిరెడ్డి, కృష్ణమూర్తి, అంజనా చారి, భవాని ప్రసాద్, నర్సింలు,మహేష్



కుమార్, సతీష్ గౌడ్, నింగప్ప, వెంకటరమణ, జనార్ధన్, విక్రాంత్, తాళ్ల శ్రీనివాస్, దేవయ్య, రాఘవేందర్ ,సిద్దేశ్వర్, పవన్ కుమార్, సిద్దిరా ములు, స్వామి, ప్రవీణ్ కుమార్, నాగేశ్వరరావు, సంతోష్ కుమార్, అన పోతారెడ్డి, సంపత్ కుమారి, శ్యామల, సుబ్బమ్మ, మధుసూదన్, మరియు పీఆర్టీయూ పాపన్నపేట మండల బాధ్యులు పాల్గొన్నారు.

## మాజీ ప్రధానికి ఘన నివాళి



**విశ్వంభర, మహబూబ్ నగర్:** మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలో మూడ కార్యాలయంలో భారత మాజీ ప్రధాని దివంగత మన్మోహన్ సింగ్ కు శనివారం నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్నగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యన్నెం శ్రీనివాస్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, మూడ ఛైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మహబూబ్ నగర్ మున్సిపల్ ఛైర్మన్ ఆనంద్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా డీజే నిర్వహిస్తే కఠిన చర్యలు


విశ్వంభర, తంగళ్ళపల్లి: తంగళ్ళపల్లి మండలం లో నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా డీజే నిర్వహించినట్లైతే కఠిన తీసుకుంటామని తెలియజేస్తూ తంగళ్ళపల్లి మండలంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ కిష్టయ్య వచ్చిన సమాచారం మేరకు మండలంలోని బాలమల్లు పల్లి గ్రామంలో రాత్రి 12 గంటల సమయంలో రోడ్డుపై డీజేను అడ్డంగా పెట్టి అంతరాయం కలిగించే విధంగా డాన్సులు మరియు న్యూసెన్స్ చేస్తున్నారనే సమాచారం మేరకు అక్కడికి వెళ్లిన పెట్రోలింగ్ సిబ్బందితో దృశ్య ప్రవర్తించిన వారి విధులకు ఆటంకం కలిగించిన డీజే ఓనర్ కంది కట్ల చంద్రయ్య కుమారుడు సాయి, నల్లవెల్లి రమేష్, నల్లవెల్లి శ్రీనివాస్, అనిమిట్ల రవీందర్ రెడ్డి, అనిమెట్ల సురేందర్ రెడ్డి, చిలుకల రాజశేఖర్, మరి కొంతమంది పై కేసు నమోదు చేసి డీజే సామాగ్రిని సీజ్ చేసి సామాగ్రిని పోలీస్ స్టేషన్కు తరలించడం జరిగిందని ఈ సందర్భంగా తెలియజేశారు. సుప్రీంకోర్టు నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా తంగళ్ళపల్లి మండలంలో డీజే నడిపినట్లైతే వారిపై కఠించిన తీసుకుంటామని తంగళ్ళపల్లి ఎస్సై రామ్మోహన్ తెలియజేశారు.



## ఇందిరమ్మ ఇళ్ల సర్వే వేగవంతం చేయాలి

**- మెదక్ డీ.ఎల్.పి.ఓ సురేష్ బాబు**

**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** గ్రామాలలో ఇందిరమ్మ సర్వేను వేగవంతం చేయాలని మెదక్ డీ.ఎల్.పి.ఓ సురేష్ బాబు అన్నారు. శనివారం పెద్ద శంకరంపేట లోని గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను ఆయన పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడడంతో పాటు ఇందిరమ్మ యాప్ లో వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. గ్రామాలలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రఫిక్ ఉన్నిసా, ఎంపీఓ విట్టల్ రెడ్డి. పంచాయతీ కార్యదర్శి వెంకట రాములు తదితరులు పాల్గొన్నారు.



## వికలాంగుల డబుల్ బెడ్ రూం ఇళ్లను పరిశీలించిన ఎమ్మెల్యే, కలెక్టర్

**విశ్వంభర, వరంగల్:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 3వ డివిజన్ పరిధి లోని పైడిపల్లి గ్రామ శివారు లో వికలాంగుల కోసం నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లలు అన్యాక్రాంతం అవుతున్నాయని వికలాంగులు వినతి పత్రం అందించగా త్వరలోనే మీ సమస్య పరిష్కరించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చి, ఇచ్చిన మాట ప్రకారం నేడు గౌరవ వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి తో కలిసి ఇళ్లను పరిశీలించి, అంతర్గతంగా ఉన్న చిన్న చిన్న పనులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. మొదటిగా డబుల్ బెడ్ రూమ్స్ వికలాంగులకు ఇచ్చే విధంగా కృషి చేయాలని కలెక్టర్ ని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కోరారు. అనంతరం కలెక్టర్ సానుకూలంగా స్పందించి వికలాంగుల కోసం నిర్మించిన ఇళ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి త్వరితిగతన అన్ని పనులు పూర్తి చేయించి అందించే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## డ్రగ్స్ ఫ్రీ తెలంగాణగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం

*** ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్ రెడ్డి**

**విశ్వంభర, హైదరాబాద్:** ఎక్సైజ్‌శాఖ ప్రధానంగా డ్రగ్స్, గంజాయి, నిర్మూలన లక్ష్యంగా ముందుకు సాగుతుందని ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి. కమలాసన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంట్ వార్షిక ప్రగతిపై హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోని గాంధి సెంటనరీ హాల్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎక్సైజ్ ప్రగతిపై ఆయన మాట్లాడారు.




ఎక్సైజ్ శాఖలో డ్రగ్స్, గంజాయి, నాన్‌డ్యూటి పెయిడ్ లిక్కర్, ఇతర క్రైమ్‌లపై ఎన్ ఫోర్స్‌మెంట్ టీమ్‌లో చాల భాగం పని చేస్తున్నాయని అన్నారు. రాబోయే సంవత్సంలో కూడ ప్రభుత్వం ఇచ్చిన అదేశాల మేరకు జీహెచ్‌ఎంసీతో పాటు తెలంగాణను డ్రగ్స్ ఫ్రీ రాష్ట్రంగా చేయడానికి ఎక్సైశాఖ పూర్తి స్థాయిలో శ్రమిస్తామన్నారు. నూతన వేడుకల్లో నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్ వినియోగం, డగ్స్ వాడకం, అమ్మకాలు రవాణపై ఎక్సైజ్‌శాఖ 42 ప్రత్యేక టీమ్‌లతో తనిఖీలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో డజాయింట్ కమిషనర్లు ఖురేషి, కేఏబీ శాస్త్రీ, డిప్యూటి కమిషనర్ దశరథ్, అడిషనల్ ఎస్పీ భాస్కర్, అసిస్టేంట్ కమిషనర్లు ఆర్.కిషన్, ప్రణవీ, అనిల్ కుమార్‌రెడ్డి,ఎక్సైజ్ అధికారులు పాల్గన్నారు.

# జమ్మూకశ్మీర్‌లో భారీగా హిమపాతం..

### రవాణా సర్వీసులకు అంతరాయం

**శ్రీనగర్:** ఉత్తర భారతం చలికి వణుకుతోంది. జమ్మూకశ్మీర్ , హిమాచల్ ప్రదేశ్‌లలో భారీగా మంచు కురుస్తోంది. శుక్రవారం నుంచి విపరీతంగా మంచు కురుస్తుండటంతో జమ్మూకశ్మీర్‌లోని పలు ప్రాంతాలు శ్వేతవర్ణంలోకి మారిపోయాయి. దీంతో పలు రవాణా సర్వీసులకు అంతరాయం కలిగినట్లు అధికారులు పేర్కొన్నారు. శ్రీనగర్-జమ్మూ జాతీయ రహదారి, మొఘల్ రోడ్డును మూసివేసినట్లు తెలిపారు. ప్రతికూల వాతావరణం కారణంగా శ్రీనగర్ విమానాశ్రయం నుంచి సర్వీసులు నిలిపివేశామన్నారు. రైల్వే ట్రాక్‌లపై భారీగా మంచు పేరుకుపోవడంతో బనిహాల్-బారాముల్లాల మధ్య పలు రైళ్లను రద్దు చేశామని పేర్కొన్నారు.

### రహదారిపై నిలిచిపోయిన 2వేల వాహనాలు..

విపరీతంగాకురుస్తున్న హిమపాతంవల్ల శ్రీనగర్-జమ్మూ జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడిందని, దాదాపు 2,000 వాహనాలు నిలిచిపోయాయని అధికారులు తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సోషల్‌మీడియా వేదికగా స్పందిస్తూ.. "నేను జమ్మూ నుంచి శ్రీనగర్‌కి వెళ్లాను. బనిహాల్ నుంచి శ్రీనగర్ వరకు మంచు తెరిపివ్వకుండా కురుస్తూనే ఉంది. పరిస్థితులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఖాజిగుండ్ వద్ద దాదాపు 2,000 వాహనాలు మంచులో కూరుకుపోయాయి. ముందుగా భారీ వాహనాలను తరలించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు" అని పేర్కొన్నారు.

ఈనేపథ్యంలో వాతావరణ పరిస్థితుల్లో విపరీతమైన మార్పు కారణంగా శ్రీనగర్‌కు వెళ్లే విమానాలను రద్దు చేసినట్లు ఇండిగో ఎయిర్‌లైన్స్ తెలిపింది. మరోవైపు కశ్మీర్ విశ్వవిద్యాలయం పరిధిలో శనివారం జరగాల్సిన అన్ని పరీక్షలను వాయిదా వేసినట్లు విద్యాశాఖాధికారులు పేర్కొన్నారు. శ్రీనగర్‌తో పాటు, గందంబల్, అనంత్‌నాగ్, కుల్గాం, షోపియాన్, పుల్వామా జిల్లాల



మైదానాల్లో కూడా ఈ సీజన్‌లో మొదటి హిమపాతం నమోదైంది. గుల్‌మార్గ్‌లోని ప్రసిద్ధ స్కీ రిసార్ట్, సోనామార్గ్, పహల్గామ్, గురేజ్, మొఘల్ రోడ్, బండిపోరా, బారాముల్లా, కుప్వారా జిల్లాల్లోని అనేక ప్రాంతాల్లో కూడా మంచు కురుస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## రూ.6 వేల కోట్ల పోంజీ స్కామ్.. నిందితుడి అరెస్ట్

**గాంధీనగర్:** బ్యాంకుల కంటే అధిక వడ్డీ ఇస్తామని ప్రజలను మోసం చేసి.. రూ.6 వేల కోట్ల పోంజీ స్కామ్‌కు పాల్పడిన నిందితుడిని పోలీసులు ఎట్టకేలకు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఫైనాన్షియల్ సర్వీస్, బీజెడ్ గ్రూప్ సీఈవో భూపేంద్రసింగ్ ఝులా అనే వ్యక్తి తమ సంస్థ ద్వారా బ్యాంకుల కంటే ఎక్కువ వడ్డీ రేటు ఇస్తామని గుజరాత్‌లోని పలు ప్రాంతాల ప్రజలను నమ్మించారు. కొద్దికాలం తర్వాత సంస్థ పనితీరుపై అనుమానం రావడంతో ఈవిషయంపై మూడు నెలల క్రితం కొందరు వ్యక్తులు సీఐడీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ఫైనాన్షియల్ సర్వీస్ సంస్థకు చెందిన గాంధీనగర్, ఆరావళి, సబర్‌కాంత, మెహసానా, వడోదరలోని కార్యాలయాలపై దర్యాప్తు సంస్థ అధికారులు దాడులు చేశారు. ఈ కేసులో ఇప్పటివరకు సంస్థకు చెందిన 10 మందికి పైగా ఏజెంట్లను అధికారులు అరెస్ట్ చేశారు. నాటినుంచి గ్రూప్ సీఈవో భూపేంద్రసింగ్ ఝులా పరారీలో ఉండడంతో అతడిపై లుకౌట్ నోటీసులు జారీ చేశారు. గుజరాత్‌లోని మెహసానా జిల్లాలోని ఓ ఫామ్‌హౌస్‌లో అతడు దాక్కున్నట్లు సీఐడీ అధికారులకు సమాచారం అందడంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. నిందితుడు ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్న పిటిషన్‌ను స్థానిక కోర్టు కొట్టివేసినట్లు తెలిపారు. ప్రజల డబ్బుతో నిందితుడు పలు విలాసవంతమైన కార్లు, భవనాలు కొనుగోలు చేసినట్లు, వివిధ విద్యాసంస్థల్లో పెట్టుబడులు పెట్టినట్లు గుర్తించామన్నారు.

## రైతు సంఘాల నేతలపై సుప్రీం ఆగ్రహం.. క్షేమం కోరేవారైతే అలా చేయొద్దు!



**ఢిల్లీ:** రైతు సంఘాల నేతలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ ఆరోగ్యం రోజురోజుకీ క్షీణిస్తున్నా.. ఆయనకు వైద్య సహాయం అందకుండా అడ్డుకుంటున్న రైతు సంఘాల తీరును అత్యున్నత న్యాయస్థానం తప్పుబట్టింది. నిజంగా ఆయన క్షేమం కోరుకునే వారైతే అలా అడ్డుకోరనే విషయాన్ని వారికి తెలియజేయాలని జస్టిస్ సూర్యకాంత్ పంజాబ్ చీఫ్ సెక్రటరీకి సూచించారు.
దల్లేవాల్‌కు వైద్య సహాయం అందించాలన్న ఆదేశాలను అమలుచేయకుండా కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారంటూ పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)కు వ్యతిరేకంగా దాఖలైన వ్యాజ్యంపై విచారణలో భాగంగా అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. నిరవధిక దీక్షను కొనసాగిస్తున్న దల్లేవాల్‌కు వైద్యసహాయం అందేలా చూడాలని తాము పంజాబ్ ప్రభుత్వానికి ఆదేశాలు ఇచ్చామని.. అయితే వాటిని అమలుచేయడానికి రాష్ట్రం చేస్తున్న ప్రయత్నాలపై కోర్టు సంతృప్తి చెందలేదని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ఈ విషయంలో పంజాబ్ రాష్ట్రానికి ఏదైనా సహాయం అవసరమైతే, కేంద్ర ప్రభుత్వం మద్దతివ్వాలని సుప్రీం తన ఆదేశాల్లో పేర్కొంది. ఈ కేసుపై తదుపరి విచారణను డిసెంబర్ 31న చేపట్టనున్నట్లు వెల్లడించింది. పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం వంటి డిమాండ్లతో నవంబరు 26 నుంచి జగ్జీత్ సింగ్ దల్లేవాల్ పంజాబ్-హరియాణా సరిహద్దులోని ఖనౌరీ శిబిరం వద్ద నిరవధిక నిరసన దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే.

## ఆయన వల్లే పౌర అణు ఒప్పందం సాధ్యమైంది..

### మన్మోహన్‌సింగ్ మృతిపట్ల జో బైడెన్ సంతాపం




**వాషింగ్టన్:** మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి పట్ల అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన 'నిజమైన రాజనీతిజ్ఞుడు', 'గొప్ప ప్రజా సేవకుడు' అంటూ కొనియాడారు. 'మన్మోహన్ సింగ్ ఓ గొప్ప రాజనీతిజ్ఞుడు. అద్భుతమైన ప్రజా సేవకుడు. ఆయన వ్యూహాత్మక దృక్పథం లేకుంటే భారత్ - అమెరికా మధ్య అపూర్వమైన సహకారం సాధ్యమయ్యేదే కాదు. చారిత్రాత్మకమైన భారతదేశం-అమెరికా పౌర అణు ఒప్పందం నుంచి ఇండో %-% పసిఫిక్ భాగస్వాముల కోసం క్వాడ్‌ను ప్రారంభించడం వరకూ ఆయన కృషి మరవలేనిది' అంటూ పేర్కొన్నారు. జో బైడెన్, జిల్ బైడెన్.. మన్మోహన్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ మేరకు వైట్‌హౌస్ ఓ ప్రకటన విడుదల చేసింది.
2004 నుంచి 2014 వరకు భారత ప్రధానిగా సేవలందించిన మన్మోహన్ సింగ్ మొదటి పర్యాయంలోనే దేశంలో ఎన్నో సంస్కరణలను తీసుకొచ్చారు. పైకి మృదుస్వభావిలా కనిపించినా దేశం కోసం తీసుకునే నిర్ణయాల్లో అత్యంత కఠినంగా వ్యవహరించారు. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పాటు, ఉపాధి హామీ పథకం ప్రారంభం వంటి ఎన్నో కీలక పరిణామాలు ఆయన ప్రధానిగా ఉన్నప్పుడే చోటుచేసుకున్నాయి. 2008లో చారిత్రాత్మకమైన భారతదేశం-అమెరికా పౌర అణు ఒప్పందంపై సంతకం చేశారు. భారతదేశం ప్రపంచ అణు మార్కెట్లోకి ప్రవేశించడానికి, ఇంధన సంక్షోభాన్ని అధిగమించడానికి ఈ ఒప్పందం దోహదపడింది. యూపీఏ ప్రభుత్వానికి బయటి నుంచి మద్దతిచ్చిన లెఫ్ట్ పార్టీలు ఈ ఒప్పందాన్ని తీవ్రంగా వ్యతిరేకించాయి. మద్దతు ఉపసంహరించుకున్నాయి. అయినా మన్మోహన్ సింగ్ ఎక్కడా వెనక్కి తగ్గలేదు. అవసరమైతే ప్రధాని పదవికి రాజీనామా చేసేందుకు కూడా సిద్ధమయ్యారు.

## ప్రణబ్ ముఖర్జీ మరణించినప్పుడు మీరేం చేశారు.. కాంగ్రెస్‌కు శర్మిష్ఠా ముఖర్జీ ప్రశ్న





ఢిల్లీ: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు శనివారం అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నారు. అంత్యక్రియలు నిర్వహించే ప్రదేశంలోనే స్మారక స్థలం నిర్మించాలని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ప్రధాని మోదీని కోరిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కుమార్తె శర్మిష్ఠా ముఖర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. తన తండ్రి చనిపోతే నివాళులర్పించడానికి కనీసం సీడబ్ల్యూసీ సమావేశం కూడా ఏర్పాటుచేయలేదని ధ్వజమెత్తారు. ఈమేరకు ఆమె ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ 2020లో కన్నుమూశారు. ఆ సమయంలో ఆయనకు నివాళులర్పించేందుకు సీడబ్ల్యూసీ సమావేశం కూడా ఏర్పాటుచేయలేదని శర్మిష్ఠా పేర్కొన్నారు. ఈవిషయంలో కాంగ్రెస్ తనను తప్పుదోవ పట్టించిందని కూడా ఆరోపించారు. రాష్ట్రపతులకు ఆ సంప్రదాయం పాటించడం లేదని కాంగ్రెస్‌లోని ఓ సీనియర్ నేత తనకు చెప్పారన్నారు. అయితే.. తన తండ్రి డైరీని చదివితే అది నిజం కాదని తెలిసిందన్నారు. రాష్ట్రపతి కె.ఆర్.నారాయణన్‌కు నివాళులర్పించేందుకు సీడబ్ల్యూసీ సమావేశం నిర్వహించినట్లు అందులో ఉందని వెల్లడించారు. ఈసందర్భంగా మన్మోహన్ సింగ్ మీడియా సలహాదారు సంజయ్ బారు రాసిన 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్' అనే పుస్తకం గురించి ఆమె ప్రస్తావించారు. అందులో 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ మాజీ ప్రధాని దివంగత పీవీ నరసింహారావు స్మారక చిహ్నాన్ని నిర్మించలేదన్నారు. దీంతోపాటు ఆయన అంత్యక్రియలు దిల్లీలో కాకుండా స్వస్థలమైన హైదరాబాద్‌లో జరగాలని కాంగ్రెస్ కోరిన విషయం ఆ పుస్తకంలో ఉందన్నారు.

## ఉత్తర కొరియా సైనికులకు రష్యా కనీస రక్షణ ఇవ్వలేదు: జెలెన్‌స్కీ



**కీవ్:** ఉక్రెయిన్‌తో జరుగుతోన్న యుద్ధంలో రష్యాకు మద్దతుగా ఉత్తరకొరియా సైన్యం పోరాడుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మాస్కోపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీవ్ర ఆరోపణలు చేశారు. కిమ్ సైనికులకు రష్యా కనీస రక్షణ సౌకర్యాలు కల్పించకుండా యుద్ధరంగంలోకి దించిందని పేర్కొన్నారు. 'మాపై యుద్ధంలో పాల్గొన్న ఉత్తరకొరియా సైనికులకు సంబంధించిన నివేదికలు అందాయి. పోరులో గాయపడిన సైనికులను మా దళాలు బంధించాయి. ఆ తర్వాత వారు చనిపోయారు. తీవ్రంగా గాయపడి ఉండటంతో మేము వారిని కాపాడలేకపోయాం' అని జెలెన్‌స్కీ తెలిపారు. కీవ్‌పై యుద్ధంలో పాల్గొన్న కిమ్ సైనికులను ఉక్రెయిన్ బలగాలు బంధించాయని దక్షిణ కొరియా స్పై ఏజెన్సీ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొంది. తాజాగా జెలెన్‌స్కీ ఇదే విషయాన్ని ధ్రువీకరించారు. మరోవైపు.. దక్షిణ కొరియా స్పై ఏజెన్సీ ప్రకటనపై వైట్ హౌస్ స్పందించింది. 'ఉత్తర కొరియా సైనికులు ఉక్రెయిన్ దళాలకు లొంగిపోకుండా తమ ప్రాణాలను తీసుకుంటున్నట్లు మాకు నివేదికలు అందాయి. వారి కుటుంబాలపై ప్రతీకారం తీర్చుకుంటారనే భయంతో కావొచ్చు' అని అమెరికా జాతీయ భద్రతా అధికార ప్రతినిధి జాన్ కిర్బీ వెల్లడించారు. 2022 ప్రారంభం నుంచి రష్యా- ఉక్రెయిన్ల మధ్య యుద్ధం నడుస్తోంది. ముగింపుఛాయలు ఎక్కడా కనిపించడం లేదు. ఉక్రెయిన్ చొరబాటును అరికట్టేందుకు ప్రయత్నిస్తోన్న రష్యా .. సరిహద్దు ప్రాంతమైన కుర్స్క్‌లో భారీస్థాయిలో సైన్యాన్ని మోహరించింది. ఇందులో భాగంగా మూడు గ్రామాల్లో దాదాపు 10వేల మంది కిమ్ సైనికులు పోరాడుతున్నారు. తొలుత వీరికి ప్రత్యేక శిక్షణ ఇప్పించిన అనంతరం కదన రంగంలోకి దింపారు. అయినప్పటికీ భాష సమస్య కారణంగా మాస్కో, కొరియన్ సేనల మధ్య సమన్వయం లోపించి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కథనాలు వచ్చాయి. తొలి వారాల్లోనే ప్రతీ పది మంది కిమ్ సైనికుల్లో ఒకరు ప్రాణాలు కోల్పోయారని ద.కొరియా తెలిపింది. యుద్ధంలో పోరాడే శక్తి కిమ్ దళాలకు లేకపోవడంతో ప్రాణనష్టం ఎక్కువగా ఉంటోందని అమెరికా సైతం అభిప్రాయం వ్యక్తంచేసింది. వేల మంది కొరియన్ సైనికులు చనిపోయి ఉండడమో లేదా గాయపడటమో జరిగిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వెల్లడించారు. మరోవైపు చనిపోయిన సైనికుల ముఖాలను గుర్తుపట్టకుండా పుతిన్ సేనలు కాల్చేస్తున్నాయని ఆయన ఆరోపించారు.

## జోష్ నింపిన న్యూఇయర్.. సిమ్లా, మనాలికి పోటెత్తిన పర్యాటకులు..



**సిమ్లా:** 2024 సంవత్సరం ముగింపునకు వచ్చేసింది. 2025 సంవత్సరానికి వెల్‌కం చెప్పేందుకు అందరూ రెడీ అవుతున్నారు. అయితే, చాలా మంది వినూత్నంగా న్యూ ఇయర్‌ను సెలబ్రేట్ చేసుకునేందుకు సిద్ధమయ్యారు. స్నేహితులు, కుటుంబీకులతో కలిసి పార్టీలు జరుపుకోవడంతోపాటు విహార యాత్రలకు తరలివెళ్తున్నారు. ఈ క్రమంలోనే హిల్ స్టేట్ హిమాచల్ ప్రదేశ్ పర్యాటకులతో కళకళలాడుతోంది. హిమాచల్‌లో భారీగా మంచు పడుతోంది. లాహౌల్ %-% స్పితి, మనాలి ఎగువ ప్రాంతాల్లో భారీగా మంచు కురిసింది. సోలాంగ్ వ్యాలీ, రోహ్‌తంగ్‌పాస్, అటల్ టన్నెల్ ప్రాంతాలు మంచుతో పర్యాటకుల ఆహ్వానిస్తున్నాయి. న్యూఇయర్‌కి తోడు మంచు అందాలు పర్యాటకులను ఆహ్వానిస్తున్నాయి. దీంతో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు కొండ ప్రాంతానికి పోటెత్తుతున్నారు. సిమ్లా, మనాలి, కసోల్ తదితర ప్రాంతాలు పర్యాటకులతో సందడిగా మారాయి. మరోవైపు భారీగా వాహనాలు రావడంతో ట్రాఫిక్ రద్దీ నెలకొంది.

## మన్మోహన్ సింగ్ అంత్యక్రియలపై రాజకీయాలొద్దు : మాయావతి



**లక్నో:** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు, స్మారకంపై రాజకీయాలు చేయడాన్నిబీఎస్పీ చీఫ్ మాయావతి తీవ్రంగా ఖండించారు. మన్మోహన్ సింగ్ కుటుంబం, సిక్కు మతం యొక్క సెంటిమెంట్స్‌ను కేంద్ర సర్కారు గౌరవించాలని ఆమె హితవుపలికారు. మన్మోహన్ సింగ్ కుటుంబం ఎక్కడైతే ఆయన స్మారకాన్ని నిర్మించాలని కోరుతున్నదో అక్కడే నిర్మించాలని సూచించారు. ఈ విషయంలో ఎవరికీ రాజకీయాలు చేసే హక్కు లేదని, కేంద్ర ప్రభుత్వం మన్మోహన్ సింగ్ కుటుంబం కోరిన చోటనే ఆయన స్మారకాన్ని నిర్మించాలని మాయ డిమాండ్ చేశారు. మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు జరిగిన చోటనే ఆయన స్మారకాన్ని నిర్మించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుండగా.. అక్కడ కుదరదని ఆయన స్మారకాన్ని ఎక్కడ నిర్మించాలనేది త్వరలో నిర్ణయిస్తామని కేంద్రం చెబుతోంది. ఈ నేపథ్యంలోమాయావతితాజావ్యాఖ్యలు చేశారు.

## సుంకాల భయం.. అమెరికాతో కెనడా మంత్రుల మంతనాలు



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం కెనడా, మెక్సికో దేశాల ఎగుమతులపై 25 శాతం సుంకం విధించనున్నట్లు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ట్రంప్‌తో ఇప్పటికే భేటీ అయ్యారు. డ్రగ్స్ అక్రమ రవాణాను సరిహద్దుల్లోనే కట్టడి చేయాలని, లేనిపక్షంలో సుంకాలు పెంచుతానంటూ ట్రంప్ ఆయనను హెచ్చరించినట్లు సమాచారం.అంతేకాదు, ఇందులో విఫల మైతే అమెరికాలో 51వ రాష్ట్రంగా చేరాలని ట్రూడోకు చురకలు అంటించినట్లు అమెరికా మీడియాలో వార్తలు వచ్చాయి. ఈనేపథ్యంలో ట్రంప్ వాణిజ్య మంత్రిగా ఎంపిక చేసిన హొవార్డ్ లుట్నిక్‌తో కెనడా ఆర్థిక మంత్రి డొమినిక్ లే బ్లాంక్, విదేశాంగశాఖ మంత్రి మెలానీ జోలీ భేటీ అయ్యారు.ఈ భేటీపై కెనడా మంత్రులు మాట్లాడుతూ ఇరుదేశాల మధ్య ఫలవంతమైన చర్చలు జరిగాయని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని చర్చలు జరపనున్నట్లు పేర్కొన్నారు. కాగా కెనడాతో యూఎస్ వాణిజ్య లోటుపై అమెరికన్లు స్థిరంగా ఉన్నారని ఓ అధికారి చెప్పారు. ఈనెల మొదట్లో ట్రంప్, ట్రూడో భేటీకి కొనసాగింపుగా ఈ చర్చలు జరిగినట్లు తెలిపారు.అమెరికా-కెనడా సరిహద్దు వద్ద భద్రతను పెంచడానికి తాము తీసుకోబోయే చర్యల గురించి, 'ఫెంటనిల్' డ్రగ్ వల్ల అమెరికా, కెనడా ప్రజలకు కలిగే హానిని ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన భాగస్వామ్య చర్యలపై మాట్లాడినట్లు పేర్కొన్నారు. కాగా ఈ డ్రగ్‌ను చైనా తమ దేశంలోకి డంప్ చేస్తుందనే కారణంతో ఆ దేశంపై 25శాతం అదనపు టారిఫ్‌ను విధిస్తానని ట్రంప్ ఇప్పటికే హెచ్చరించారు.
గతేడాది కెనడా నుంచి అమెరికాకు దాదాపు 423 బిలియన్ డాలర్ల ఉత్పత్తులు ఎగుమతయ్యాయి. వీటిపై 20 లక్షల మంది కెనడా వాసుల ఉద్యోగాలు ఆధారపడ్డాయి. కెనడా వస్తు, సేవల ఎగుమతుల్లో 75శాతం అమెరికాకే ఉంటాయి. ఈక్రమంలో తాను అధికారంలోకి వచ్చిన తర్వాత కెనడా, మెక్సికోలపై 25 శాతం సుంకం విధించనున్నట్లు ట్రంప్ చెప్పడంతో ట్రూడో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ సుంకాలు పెంచితే ఆర్థిక వ్యవస్థపై తీవ్ర భారం పడుతుందని ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది.

## ఆప్ పథకాలు ఆపేందుకు బీజేపీ, కాంగ్రెస్ కలిశాయి: అరవింద్ కేజ్రీవాల్



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) చీఫ్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలపై మండిపడ్డారు. తమ పార్టీ ప్రతిపాదించిన పథకాలను ఆపేందుకు ఈ రెండు పార్టీలు కలిసి పని చేస్తున్నాయని ఆరోపించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ప్రతిపాదించిన సంక్షేమ పథకాలపై కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్ ఫిర్యాదు చేశారు. దీంతో లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా విచారణకు ఆదేశించారు.కాగా, అరవింద్ కేజ్రీవాల్ శనివారం దీనిపై స్పందించారు. బీజేపీ, కాంగ్రెస్‌లపై మండిపడ్డారు. ఢిల్లీ ఎన్నికలకు ముందు మహిళలు, వృద్ధుల కోసం ఆప్ ప్రతిపాదించిన పథకాలను ఆపడానికి రెండు పార్టీలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. 'బీజేపీకి నేరుగా వ్యవహరించే ధైర్యం లేకపోవడంతో కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్‌తో ఫిర్యాదు చేయించింది. ఆప్‌ను అడ్డుకునేందుకు కాంగ్రెస్, బీజేపీ కలిసి పనిచేస్తున్నాయి' అని మీడియాతో అన్నారు.మరోవైపు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన తర్వాత మహిళలకు రూ.2,100, 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఉచిత వైద్యం అందిస్తామని అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. ఈ రెండు పథకాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. 'ఇప్పటికే లక్షల మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారు. దీనిపట్ల బీజేపీ భయాందోళనలకు గురవుతోంది' అని ఆయన విమర్శించారు.

## ట్రంప్ అధికారం చేపట్టేవరకు టిక్‌టాక్‌పై నిషేధం వద్దు




**వాషింగ్టన్:** చైనాకు చెందిన సోషల్ మీడియా యాప్ టిక్‌టాక్‌ను అమెరికాలో నిషేధం విధించే అవకాశాలపై కీలక పరిణామం చోటుచేసుకున్నాయి. అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ అధికార బాధ్యతలు చేపట్టేవరకు దానిపై నిషేధం విధించవద్దని ఆయన తరఫు లాయర్లు సుప్రీంకోర్టును కోరారు. వచ్చే ఏడాది జనవరి 20న ట్రంప్ అధికార బాధ్యతలు చేపట్టనున్నారు. ఈక్రమంలో టిక్‌టాక్ నిషేధం కేసుకు సంబంధించి మరింత సమయం ఇవ్వాలని ట్రంప్ న్యాయవాదులు సుప్రీం కోర్టును అభ్యర్థించారు. దీనిపై రాజకీయ తీర్మానం చేపట్టే అవకాశం ఉందని వారు కోర్టుకు తెలియజేశారు. యూజర్ల సమాచారం సేకరిస్తున్నారనే ఆరోపణలతో భారత్ సహా పలు దేశాలు టిక్‌టాక్‌పై నిషేధం విధించాయి. గతంలో డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో అమెరికా కూడా దీనిపై చర్యలకు సిద్ధమైంది. కానీ, న్యాయపరమైన సమస్యల కారణంగా అది కార్యరూపం దాల్చలేదు. అప్పట్లో ట్రంప్ ఆ యాప్ నిషేధానికి తీవ్రంగా ప్రయత్నించారు. జాతీయ భద్రతకు టిక్‌టాక్ పెద్ద ముప్పుగా ఉందంటూ ఆరోపణలు చేశారు. ఆ తర్వాత అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన జో బైడెన్ దాని నిషేధంపై బిల్లు ప్రవేశపెట్టారు. దీనికి మద్దతుగా 352 మంది ఓటు వేయగా.. 65 మంది వ్యతిరేకించారు. దీంతో ఆ బిల్లు ఆమోదం పొందింది. ఈనేపథ్యంలో ఈ బిల్లుకు ట్రంప్ పరోక్షంగా మద్దతు పలికారు. అయితే, కొన్ని రోజుల తర్వాతఆయన టిక్‌టాక్‌లో చేరారు.దీంతో నిషేధంపై తననిర్ణయాన్ని మార్చుకుంటున్నట్లు స్వయంగా తెలిపారు. ఇటీవల అధ్యక్ష ఎన్నికల ప్రచారంలోనూ ఆ యాప్ నిషేధంపై కీలక వ్యాఖ్యలు చేశారు. తాను అధికారంలోకి వస్తే టిక్‌టాక్‌ను నిషేధించబోనంటూ స్పష్టంచేశారు.

# సాంకేతికతతో నేరాలకు అడ్డుకట్ట: డీజీపీ ద్వారకా తిరుమలరావు

విశ్వంభర, అమరావతి: విజయవాడలోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో 2025 మార్చి 31 నాటికి లక్ష సీసీ కెమెరాలు అనుసంధానిస్తామని ఏపీ డీజీపీ ద్వారకా తిరుమల రావు తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో ఇప్పటికే 25 వేలకు పైగా సీసీ కెమెరాలను నేర నియంత్రణకు వినియోగిస్తున్నామన్నారు. గతంతో పోలిస్తే సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. ఈ ఏడాదిలో సైబర్ క్రైమ్‌కు సంబంధించి 916 కేసులు నమోదు కాగా.. సుమారు రూ.1,229 కోట్ల మేర నగదును సైబర్ నేరగాళ్లు కాజేశారని పేర్కొన్నారు. డిజిటల్ అరెస్టు అనేది లేదని.. అలాంటి కాల్స్‌ను ప్రజలు నమ్మొద్దన్నారు. "కొత్తగా ప్రతి జిల్లాలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నాం. గంజాయి, డ్రగ్స్ కేసుల వ్యవహారంలో 'ఈగల్' వ్యవస్థ ప్రజల్లోకిబలంగానేవెళ్తోంది. 10,380ఎకరాల్లో గంజాయి పంటను ధ్వంసం చేసి ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాల్సిందిగా గిరిజనులకు అవగాహన కల్పిస్తున్నాం. స్మార్ట్ పోలీసింగ్‌లో భాగంగా దేశంలోనే తొలిసారి ఏపీలో 'స్మార్ట్ పోలీస్ ఏఐ' వ్యవస్థను వినియోగిస్తున్నాం. ప్రస్తుతం ఏలూరు జిల్లా పోలీసులు ఈ స్మార్ట్ పోలీస్ ఏఐను అమలు చేస్తున్నారు. కేసు నమోదు నుంచి విచారణ వరకూ ఈ స్మార్ట్ పోలీస్ ఏఐ విచారణాధికారికి సహకరిస్తుంది. ట్రాఫిక్, క్రౌడ్ మేనేజ్‌మెంట్ కోసం విజయవాడ పోలీసులు 'ఏఐ వజ్రాస్త్రం' పేరిట ఏఐ సాంకేతికత వినియోగిస్తున్నారు" అని డీజీపీ తెలిపారు. "డిప్యూటీ సీఎం భద్రతా వలయంలోకి నకిలీ ఐపీఎస్ రావడంపై విచారణ చేస్తున్నాం. అది భద్రతాపరమైన లోటు కాదని భావిస్తున్నాం. భూకబ్జాలు, ఇసుక అక్రమ తవ్వకాలు, రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడేవారిపై పీడీ యాక్టు నమోదు చేస్తున్నాం. సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టుల వ్యవహారంపై ఇప్పటివరకూ 572 కేసులు నమోదయ్యాయి. ఈ తరహా కేసుల్లో నిందితులపై రౌడీషీట్, సైబర్ షీట్‌లను నమోదు చేస్తున్నాం" అని డీజీపీ వెల్లడించారు.



## టీటీడీ కియోస్క్ మిషన్ల ద్వారా రూ. 55 లక్షలు విరాళం



విశ్వంభర, తిరుమల : టీటీడీ అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.1 నుంచి రూ.లక్షలోపు విరాళం ఇవ్వదలచిన భక్తుల కోసం పలు చోట్ల నెలకొల్పిన కియోస్క్ మిషన్ల ద్వారా 50 రోజుల్లో రూ. 55 లక్షల విరాళం వచ్చిందని టీటీడీ అధికారులు తెలిపారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, ఒంటిమిట్ట కోదండ రామాలయం, బెంగుళూరులో శ్రీవారి ఆలయాల్లో టీటీడీ ఈ మిషన్లు ఏర్పాటు చేసింది. పేరూరు సమీపంలోని శ్రీ వకుళామాత ఆలయంలో శనివారం ఈ కియోస్క్ మిషన్ ను టీటీడీ అడిషనల్ ఈవో ప్రారంభించారు. మరో వారం రోజుల్లో విజయవాడ, చెన్నై, హైదరాబాద్ లోని శ్రీవారి ఆలయాల్లో కియోస్క్ మిషన్లను భక్తులకు అందుబాటులో తీసుకురానున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం అన్న ప్రసాదం ట్రస్టుకు మాత్రమే విరాళం ఇచ్చే అవకాశం ఉందని, త్వరలో టీటీడీ ఆలయాల్లోని అన్ని సేవలకు ఈ మిషన్ల ద్వారా నగదు రహిత చెల్లింపు చేసే విధానాన్ని టీటీడీ అందుబాటులోకి తీసుకురానుందని వెల్లడించారు.

## నేను ఈ వ్యక్తికి అభిమానిని అయ్యాను.. వైరల్ వీడియో షేర్ చేసిన లోకేశ్



విశ్వంభర, అమరావతి: సోషల్ మీడియాలో వైరలయ్యే వీడియోలు ప్రముఖులను ఆకర్షిస్తుంటాయి. తాజాగా ఏపీ సీఎం చంద్రబాబుని ఇమిటేట్ చేసిన ఓ వ్యక్తి వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అయిన విషయం తెలిసిందే. ఈ వీడియో మంత్రి లోకేశ్ వరకూ చేరింది. ఆయన దీన్ని షేర్ చేశారు. 'నేను ఇతడికి అభిమానిగా మారిపోయాను. చంద్రబాబుగారిలా మాట్లాడడానికి, కనిపించడానికి అతడు ఎంత కష్టపడ్డాడో చూడండి' అని ఆ వీడియోను షేర్ చేశారు. ఇటీవల జరిగిన ఓ పెళ్లిలో మిమిక్రీ ఆర్టిస్టు ఒకరు అచ్చం చంద్రబాబులా వేషధారణలో హాజరయ్యారు. వేదికపైకి వచ్చి ఆయనలానే మాట్లాడి వధూవరులను ఆశీర్వదించారు. ఆయనలానేమాట్లాడి అక్కడున్న వారందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ వీడియో రెండురోజుల నుంచి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీన్ని ఓ అభిమాని షేర్ చేసి 'వామ్మో..సడెన్‌గా చూసి మా పెద్దాయన అనుకున్నా. సేమ్ బాబుగారి లానే ఉన్నారు' అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆ పోస్ట్‌ను షేర్ చేస్తూ లోకేశ్ కూడా ఆశ్చర్యానికి గురి కావడం అందరినీ ఆకర్షిస్తోంది.

ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు..

## తెలుగువారికి గర్వకారణం: సీఎం చంద్రబాబు



విశ్వంభర, విజయవాడ: ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు నిర్వహించుకోవడం తెలుగువారికి గర్వకారణమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. మాతృభాషను భవిష్యత్ తరాలకు పది లంగా అందించడమే లక్ష్యంగా ఈ మహాసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం జరిగే ప్రాంగణానికి అమంజీవి పొట్టి శ్రీరాములు పేరును పెట్టడం, ఆ మహానుభావుడు తెలుగు జాతి కోసం చేసిన త్యాగాన్ని ప్రతి ఒక్కరికీ గుర్తు చేస్తోందన్నారు. ప్రధాన వేదికకు తెలుగు భాషాభివృద్ధి కోసం గణనీయ కృషి చేసిన రామోజీ రావు పేరు పెట్టడం అభినందనీయమని చెప్పారు. ఈ మహాసభలకు విచ్చేసిన అతిథులకు, పాల్గొంటున్న తెల ఎగు భాషాభిమానులకు సీఎం ధన్యవాదాలుతెలి పారు. కార్యక్రమంవిజయవంతం కావాలని కోరుకుంటూ.. నిర్వాహకు లకు చంద్రబాబు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## పవన్ కల్యాణ్ పర్యటనలో నకిలీ ఐపీఎస్ అధికారి



విశ్వంభర,విజయనగరం: ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇటీవల పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు, మక్కువ మండలం బాగోజాలలో పర్యటించారు. ఈ పర్యటనలో నకిలీ ఐపీఎస్ అధికారి పాల్గొన్నట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నకిలీ ఐపీఎస్ అవతారం ఎత్తిన వ్యక్తిని విజయనగరం జిల్లా గరివిడికి చెందిన మాజీ సైనికుడు సూర్యప్రకాష్‌గా అనుమానిస్తున్నారు. దీనిపై పోలీసు అధికారులు విచారణ చేపట్టారు.

# ఇది వైసీపీ రాజ్యం అనుకుంటున్నారా.. ఖబడ్దార్: పవన్ కల్యాణ్



విశ్వంభర, కడప: కడప రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబును డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితుడికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం పవన్ మీడియాతో మాట్లాడారు. "గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబును అమానుషంగా కొట్టారు. అధికారులపై దాడి చేయడం వైకాపాకు కొత్త కాదు. ఆధిపత్యం, అహంకారంతో అధికారులపై దాడులు చేస్తే ఎలాంటి శిక్షలు పడతాయో చూపిస్తాం. అహంకారంతో వైకాపా నేతలకు కళ్లు నెత్తికెక్కాయి. ఇది కూటమి ప్రభుత్వం.. వైసీపీ రాజ్యం అనుకుంటున్నారా.. ఖబడ్దార్. ఇష్టారాజ్యంగా చేయలేరు. మీ అహంకారం ఎలా అణచివేయాలో మాకు తెలుసు. చేసి చూపిస్తాం. అధికారులపై దాడి చేస్తే తోలు తీస్తాం" అని పవన్ హెచ్చరించారు. పులివెందుల నియోజకవర్గంలో ఓ రైతు కుటుంబం ఆత్మహత్యపై పవన్ స్పందించారు. ఆ ఘటన బాధాకరమని.. దీనిపై విచారణ జరుగుతోందని పేర్కొన్నారు. రెండ్రోజుల క్రితం రైతు తన భూమి మ్యుటేషన్ పెట్టుకున్నారని.. ఎలాంటి పరిస్థితుల్లో ఈ ఘటన జరిగిందో నివేదిక వచ్చాక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

### దాడి ఘటన.. 13 మందిపై కేసు..

గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై దాడి ఘటనలో పోలీసులు 13 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. వీరిలో ప్రధాన నిందితుడు, వైకాపా నేత సుదర్శన్ రెడ్డి ఉన్నారు. ఎంపీడీవో జవహర్‌బాబు ఫిర్యాదు మేరకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే ప్రధాన నిందితుడు సుదర్శన్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు.

### ఏం జరిగిందంటే?

గాలివీడు ఎంపీపీ పద్మావతమ్మ కుమారుడు, వైసీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి 20 మంది అనుచరులతో కలిసి శుక్రవారం ఉదయం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చారు. ఎంపీపీ ఛాంబర్ తాళం ఇవ్వాలని అడగ్గా.. ఎంపీపీకి మాత్రమే ఛాంబర్ తాళాలు ఇస్తామని ఎంపీడీవో స్పష్టం చేశారు. మాకే ఎదురు చెబుతావా? అంటూ జవహర్‌బాబుపై సుదర్శన్ రెడ్డి, అతని అనుచరులు ఒక్కసారిగా దాడికి దిగారు. కుర్చీలో నుంచి కిందపడిపోయినా ఆగకుండా కాళ్లతో తన్నుతూ పిడిగుద్దులు గుద్దారు. తీవ్రంగా గాయపడిన ఎంపీడీవో జవహర్‌బాబును పోలీసులు రాయచోటి ఆసుపత్రికి తరలించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు సుదర్శన్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని ఎస్పీ కార్యాలయానికి తరలించారు. దాడిలో పాల్గొన్న అతని అనుచరుల కోసం గాలిస్తున్నారు.

# నన్ను, నాకుమారుడిని అరెస్టు చేయవచ్చని అనుమానం

## మాజీ మంత్రి పేర్నినాని సంచలన వ్యాఖ్యలు..



విశ్వంభర, అమరావతి : గోదాం నుంచి బియ్యం మాయం కేసులో తనను, తన కుమారుడిని జనవరి 2వ తేదీలోగా పోలీసులు అరెస్టు చేయవచ్చని వైసీపీ మాజీ మంత్రి పేర్నినాని సంచలన వ్యాఖ్యలు చేశారు. నా భార్యను అరెస్ట్ చేయడానికి ఓ మంత్రి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తన భార్య పేరిట ఉన్న గోదాం నుంచి బియ్యం మాయం కేసులో తనను ఒక్కరోజైనా జైలులో పెట్టాలనే ఆలోచన జిల్లాకు చెందిన మంత్రి ఒకరు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. తన భార్యను కూడా జైలుకు పంపాలని సీఎం చంద్రబాబు దగ్గర ప్రస్తావించినప్పటికీ ఇంట్లోని ఆడవారి జోలికి వెళ్లవద్దని ఆదేశించడం అభినందనీయమని నాని పేర్కొన్నారు. చంద్రబాబు చెప్పినప్పటికీ వారు ప్రయత్నాలు ఆపడం లేదని కొంత మంది ఎమ్మెల్యేలు, అధికారులు ఇందుకు సాక్ష్యమని పేర్కొన్నారు. నా భార్య జయసుధపై కేసు పెట్టిననాటి నుంచి నేటి వరకు తన కుటుంబాన్ని అరెస్టుకు మంత్రి ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. 2వ తేదీన తమ గోదాం మేనేజర్ క్వాష్ పిటిషన్ విచారణ ఉంది. ఆలోగా నన్ను, నా కుమారుడిని పోలీసులు అరెస్టు చేయవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. తమ రాజకీయాలు, కక్ష సాధింపు కోసం ఇంట్లోని ఆడవాళ్ల జోలికి రావడం బాధాకరమని ఆయన అన్నారు.

# పరకామణిలో రూ.100 కోట్ల కుంభకోణం: భానుప్రకాశ్‌రెడ్డి



విశ్వంభర, అమరావతి: టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ ప్రతినిధుల బృందం ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావును కలిసింది. తిరుమల పరకామణి కేసు విషయంలో ఆయనకు నేతలు ఫిర్యాదు చేశారు. టీటీడీ పరకామణిలో విదేశీ డాలర్లు మాయం ఘటనపై విచారణ చేయాలని అందులో పేర్కొన్నారు. ఈ మేరకు భానుప్రకాశ్‌రెడ్డి, పాతూరి నాగభూషణం నాలుగు పేజీల లేఖను డీజీపీకి అందజేశారు. సమగ్ర విచారణ జరపాలని కోరారు. పరకా మణిలో రూ.100 కోట్ల కుంభకోణం జరిగిందని భానుప్రకాశ్‌రెడ్డి ఆరోపించారు. రహస్య అర అమర్చి డబ్బులు తరలించారని చెప్పారు. తరలించిన మొత్తాన్ని వెనక్కి రప్పించాలని డీజీపీని బీజేపీ బృందం కోరింది.

## ఘనంగా ప్రారంభమైన సీపీఎం జిల్లా మహాసభలు

విశ్వంభర, పెందుర్తి: విశాఖ జిల్లా పెందుర్తి మండలం సుజాతనగర్ లో సీపీఎం పార్టీ విశాఖ జిల్లా 24వ మహాసభలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సీపీఎం పార్టీ గోపాలపట్నం కార్యదర్శి బి. జగన్ ఆధ్వర్యంలో పెందుర్తి కూడలి నుంచి సుజాతానగర్ వరకు భారీ మహా ప్రదర్శన జరిగింది. జిల్లా నాయకులు, కార్యకర్తలు వందలాదిగా పాల్గొని నినాదాలు చేశారు. మధ్యాహ్నం 12గంటల నుంచి బహిరంగ సభ జరగనుంది.

## బస్ బే ప్రాంగణం ప్రారంభం

విశ్వంభర, భీమునిపట్నం: భీమునిపట్నంలో బస్సుల కోసం వేచిఉండే పాతబస్ స్టాండ్లో ప్రయాణీలకుల కోసం రూ.22.50 లక్షలతో అన్నిరకాల సదుపాయాలు కల్గిన అధునాతన బస్ బే ప్రాంగణాన్ని నిర్మించారు. పాతబస్ స్టాండ్లో ప్రయాణీకులకు ఎటువంటి సౌకర్యాలేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు దీంతో స్థానికులు చేసుకున్న విన్నపం మేరకు జీవీఎంసీ కేటాయించిన నిధులతో ఈ నిర్మాణాన్ని పూర్తిచేశారు త్వరలోనే దీనిని స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావుతో ప్రారంభిస్తామని జీవీఎంసీ సహాయ ఇంజనీరు జి. సురేష్ పేర్కొన్నారు.

## విద్యార్థి వైద్యానికి ఆర్థిక సహాయం

విశ్వంభర, భీమునిపట్నం: భీమునిపట్నం ప్రాంతంలో రోడ్డు ప్రమాదానికి గురయిన ఒక విద్యార్థి వైద్యసహాయానికి సన్మూలు విద్యార్థులు రూ. 30వేల ఆర్థిక సహాయాన్ని అందించి ఆదుకున్నారు భీమునిపట్నం బ్యాంక్ కాలనీకి చెందిన బర్ల చందు అనే విద్యార్థి ఈనెల 26న రోడ్డు ప్రమాదంలో తనకు బలమైన గాయమయి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని గుర్తించిన సన్మూలు కరస్పాండెంట్ కె. శ్రీనివాస రావు సూచన మేరకు విద్యార్థులు చందాలు వేసుకుని తోటి విద్యార్థికి ఈ సహాయాన్ని అందించారు.

## ఏటా రూ. 6 కోట్ల అక్రమాలు జరుగుతున్నాయి

విశ్వంభర, విశాఖ : నైట్ ఫుడ్ స్ట్రీట్ అక్రమాలపై విచారణ జరపాలని కూటమి కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. శనివారం టీడీపీ ఫ్లోర్ లీడర్ కార్యాలయంలో 67వ కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడుతూ, ఫుడ్ స్ట్రీట్ ఆదాయం జీవీఎంసీ కి కాకుండా వైసీపీ నాయకులకు వెళుతు%శీ%దన్నారు. యేటా రూ. 6 కోట్ల అక్రమాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఫుడ్ కోర్ట్ ఖాళీ చేయించి, అర్హులకు కేటాయించాలని కోరారు. విలేకరుల సమావేశంలో కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, పీతల మూర్తి యాదవ్ పాల్గొన్నారు.

## జడ్పీ ఉన్నత పాఠశాల తనిఖీ

విశ్వంభర, నందిగామ: నందిగామ మండలం ఐతవరం జడ్పీ ఉన్నత పాఠశాలను విద్యాశాఖ ఆర్జేడీ నాగమణి సందర్శించారు. పదవ తరగతి విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించేలా స్ఫూర్తి దాయక ప్రసంగం ఇచ్చారు. 100 రోజుల ప్రణాళిక ప్రకారం 10వ తరగతి విద్యార్థుల అభ్యసనం జరగాలని, ప్రతి రోజూ ప్రతి సబ్జెక్టులోనూ రివిజన్ టెస్టులు రాయాలని వివరించారు.

## బంగారం కోసం తల్లినే హత్య చేసిన కుమారుడు, కోడలు

విశ్వంభర, విజయవాడ: ఒంటిపై ఉన్న బంగారం కోసం తల్లిని హత్య చేసిన కుమారుడు, సహకరించిన కోడలు. ఈ సంఘటన విజయవాడ గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలోనిమధురనగర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మధురనగర్ పప్పులమిల్ వద్ద గత కొంత కాలంగా నివాసం ఉంటున్న లక్ష్మి(62)ని ఆమె పెద్ద కుమారుడు సాంబ శివరావు ఆస్తి తగాదాల నేపథ్యంలో అతని భార్యతో కలిసి దిండుతో ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. మొదట అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేశారు. తరువాత కుమారుడే హత్య చేశాడని నిర్ధారణకు వచ్చి సాంబశివరావు దంపతులను అదుపులోకి తీసుకొని విచారించారు. వారి నుంచి రూ.4లక్షల ఖరీదు చేసే 49గ్రాముల బంగారు అభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు.

## మెల్‌బోర్న్‌లో విశాఖ కుర్రాడు నితీష్‌రెడ్డి సెంచరీ.. అభినందనలు తెలిపిన మంత్రి నారా లోకేష్



విశ్వంభర, అమరావతి : భారత్, ఆస్ట్రేలియా మధ్య మెల్‌బోర్న్‌లో జరుగుతున్న బాక్సింగ్ డే టెస్ట్ మ్యాచ్‌లో మూడో రోజు సెంచరీ చేసిన విశాఖ కుర్రాడు పై అభినందనలు వ్యక్తమవుతున్నాయి. భారత్ జట్టు మొదటి ఇన్నింగ్‌లో వికెట్లు పడుతున్న సమయంలో ఓపికగా పిచ్‌పై నిలబడి ఫాస్ట్‌బౌలర్లను సైతం ధాటిగా ఎదుర్కొని సెంచరీ చేయడం పట్ల ఏపీ మంత్రి నారా లోకేష్ ట్విటర్ వేదిక ద్వారా అభినందనలు తెలిపారు. మెల్‌బోర్న్‌లో వైజాగ్ అబ్బాయి నితీష్ కుమార్ రెడ్డి సెంచరీ చేయడం గర్వంగా ఉందని అన్నారు. ఆసీస్‌పై ఒత్తిడిలో అద్భుతమైన ధైర్యం, పట్టుదల, సంకల్ప శక్తిని ప్రదర్శించి తొలి సెంచరీని సాధించినందుకు మిమ్మల్ని చూసి గర్విస్తున్నామని పేర్కొన్నారు. తన పోరాటాన్ని ఇలానే కొనసాగించాలని సూచించారు. మీరు చేసే ప్రతి పరుగును చూసి ఆనందిస్తామని 2024 సంవత్సరం ముగింపులో తన బ్యాట్‌తో ఆంధ్రప్రదేశ్ గొప్పతనాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటినందుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## యువ క్రికెటర్ నితీశ్‌కుమార్‌రెడ్డికి నగదు ప్రోత్సాహకం ప్రకటించిన ఏసీఏ



విశ్వంభర, విజయవాడ: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) తరఫున యువ క్రికెటర్ నితీశ్ కుమార్‌రెడ్డికి ఏసీఏ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ రూ.25 లక్షల నగదు బహుమతి ప్రకటించారు. ఇండియన్ క్రికెట్ టీమ్‌కు సెలెక్ట్ అయిన నితీశ్‌కు అభినందనలు తెలిపారు. త్వరలోనే సీఎం చేతుల మీదుగా నగదు బహుమతిని అందిస్తామన్నారు. బోర్డర్-గావస్కర్ ట్రోఫీ నాలుగో టెస్టులో ఆల్‌రౌండర్‌గా నితీశ్ అద్భుతంగా రాణిస్తున్నాడని వ్యాఖ్యానించారు. ఇలాంటి యువ క్రికెటర్లను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని.. నేటి యువతకు నితీశ్ రోల్ మోడల్ అన్నారు. దేశంలోనే అత్యాధునిక వసతులతో కూడిన స్టేడియంను అమరావతిలో నిర్మిస్తామని పేర్కొన్నారు. ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడే విధంగా విశాఖపట్నం స్టేడియంను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కూడా ఐపీఎల్ టీమ్ సిద్ధం చేసేలా ఏసీఏ ఆలోచన చేస్తోందన్నారు.

## ఏపీ ప్రయాణికులకు గుడ్‌న్యూస్.. పండుగకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సులు



విశ్వంభర, అమరావతి : సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలకు ఏపీఎస్‌ఆర్టీసీ గుడ్‌న్యూస్ తెలిపింది. పండుగకు హైదరాబాద్ నుంచి ఏపీలోని సొంత గ్రామాలకు వెళ్లడానికి ప్రత్యేక బస్సులు నడిపేందుకు చర్యలు చేపట్టింది. రెగ్యులర్‌గా నడిచే సర్వీసులతో పాటు 2,400 బస్సులను అదనంగా ఏర్పాటు చేయనున్నట్లు డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజన్ ఎల్. విజయలక్ష్మి తెలిపారు. ప్రత్యేక బస్సులు జనవరి 9 నుంచి 13వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి సాధారణ చార్జీలతోనే ఈ బస్సులు బయలుదేరుతాయని తెలిపారు. ప్రయాణికులు ఏపీఎస్‌ఆర్టీసీ వెబ్‌సైట్ నుంచి లేదా అధీకృత టికెట్ బుకింగ్ ఏజెంట్ల నుంచి ముందస్తుగా బుక్ చేసుకోవచ్చని వివరించారు. ఎంజీబీఎస్‌లో ప్రయాణికులు, బస్సుల రద్దీ దృష్ట్యా జనవరి 10 నుంచి 12 వరకు కర్నూలు, చిత్తూరు, నెల్లూరు. అనంతపురం, మాచర్ల, ఒంగోలు వైపు వెళ్లే రెగ్యులర్, ప్రత్యేక బస్సులను గౌలిగూడ సీబీఎస్ నుంచి నడుపుతారని తెలిపారు.

# ఆపద్బాంధవుడు నితీశ్

## పాలోఆన్ గండాన్ని గట్టెక్కించిన నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్

**మూడో రోజు ఆటముగిసే సమయానికి టీమ్ఇండియా 358/9**

**బ్యాడ్‌లైట్ కారణంగా ముందే ముగిసిన ఆట..**

**టెస్టు కెరీర్‌లో తొలి సెంచరీ.. టాప్ స్కోరర్‌గా నిలిచిన నితీశ్..**



**మెల్‌బోర్న్:** బాక్సింగ్ డే టెస్టులో భారత బ్యాట్స్‌మెన్ అద్భుత పోరాటపటిమ కనబర్చారు. 221కే 7 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో ఉన్న జట్టును ఆల్‌రౌండర్లు నితీశ్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్ ఆదుకున్నారు. ఫాలోఆన్ గండాన్ని గట్టెక్కించిన ఈ బ్యాటింగ్ ద్వయం జట్టు స్కోరును 350 దాటించారు. ఈ క్రమంలో నితీశ్ కుమార్ టెస్టుల్లో తొలి సెంచరీ నమోదుచేయగా, సుందర్ నాలుగో హాఫ్ సెంచరీ చేశాడు. ఇద్దరూ కలిసి ఎనిమిదో వికెట్‌కు 127 పరుగుల భాగస్వామ్యాన్ని నిర్మించారు. అయితే సుందర్ 162 బాల్స్‌లో 50 రన్స్ చేసి నాథన్ బౌలింగ్‌లో క్యాచౌట్‌గా వెనుతిరగడంతో ఈ జోడీ జోరుకు బ్రేక్‌పడింది. అయితే ఆ తర్వాత వచ్చిన బుమ్రా కూడా వెంటనే వెనుతిరగడంతో నితీశ్‌కు సెంచరీ చేసే అవకాశం వస్తుందా అనే టెన్షన్ అందరిలో నిండిపోయింది. అప్పటికే 97 రన్స్ చేసిన నితీశ్.. రెండు పరుగులు చేసి 99కి చేరాడు. ఆ తర్వాత బోలాండ్ బౌలింగ్‌లో (ఇన్నింగ్స్ 114.3 ఓవర్) ఫోర్ కొట్టి టెస్టుల్లో తొలి సెంచరీ నమోదుచేశాడు.

కాగా, నితీశ్ తన తొలి సెంచరీ తర్వాత మరో రెండు పరుగులు జోడించిన తర్వాత.. బ్యాడ్ లైట్ కారణంగా అంపైర్లు మ్యాచ్ నిలిపివేశారు. దీంతో గ్రౌండ్ స్టాఫ్ పిచ్‌ను కవర్స్‌తో కప్పేయడంతో మూడో ఆట ముగిసింది. మూడో రోజు మూడు వికెట్లే కోల్పోయిన టీమ్ఇండియా 191 రన్స్ చేసింది. మొత్తంగా 9 వికెట్లు కోల్పోయి 355 రన్స్ చేసింది. ప్రస్తుతం నితీశ్ (104), సిరాజ్ (2) రన్స్‌తో నాటౌట్‌గా ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ మరో 116 రన్స్ వెనుకపడి ఉన్నది. పంత్ (28), జడేజా (17) రన్స్ చేశారు. టీమ్ఇండియా తరఫున నితీశ్ 104 రన్స్‌తో టాప్ స్కోరర్‌గా

## టెస్టు కెరీర్‌లో తొలి సెంచరీ.. టాప్ స్కోరర్‌గా నిలిచిన నితీశ్..

తెలుగు కుర్రాడు నితీశ్‌కుమార్ రెడ్డి ఆస్ట్రేలియా పర్యటనలో అదరగొట్టేస్తున్నాడు. పేస్ ఆల్‌రౌండర్‌గా జట్టులోకి వచ్చిన అతడు మెల్‌బోర్న్ టెస్టులో జట్టును ఫాల్ ఆన్ గండం నుంచి బయటపడేశాడు. ఈక్రమంలో టెస్టు కెరీర్‌లో 171 బంతుల్లో తొలి శతకం సాధించాడు. ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన నితీశ్ .. తొలి బంతి నుంచి నిలకడైన ఆటతీరును ప్రదర్శించాడు. ప్రత్యర్థి బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. ఆస్ట్రేలియా గడ్డపై 8వ స్థానంలో వచ్చి అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా నిలిచాడు. ఇంతకుముందు స్పిన్ దిగ్గజం అనిల్ కుంబ్లే (87) పేరిట ఈ రికార్డు ఉండేది. ఇప్పుడు దానిని అధిగమించాడు. సుందర్‌తో కలిసి భారత ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించిన నితీశ్ సెంచరీ సమయంలో టెన్షన్ వాతావరణం నెలకొంది. స్వల్ప వ్యవధిలో రెండు వికెట్లను భారత్ కోల్పోయింది. చివరి వికెట్‌గా సిరాజ్ మాత్రమే ఉన్నాడు. అప్పుడు నాన్‌స్ట్రైకింగ్ ఎండ్‌లో నితీశ్ 99 పరుగుల మీద ఉండటం.. కమిన్స్, బోలాండ్ కట్టుదిట్టంగా బంతులేయడంతో అభిమానుల్లో ఆందోళన రేగింది. అయితే, సిరాజ్ చక్కటి డిఫెన్స్‌తో ఆడి నితీశ్‌కు స్ట్రైకింగ్ ఇచ్చాడు. బోలాండ్ బౌలింగ్‌లో బౌండరీతో సెంచరీని పూర్తి చేశాడు. నితీశ్.. సెంచరీని బాహుబలి స్టైల్‌లో సెలబ్రేట్ చేసుకున్నాడు. గాల్లోకి పంచ్ విసుతూ.. మోకాలిపై కూర్చుని బ్యాట్ హ్యాండిల్‌కు హెల్మెట్ పెట్టి భగవంతునికి కృతజ్ఞత తెలిపాడు. ఈ సమయంలో ప్రేక్షకులతోకలిసి మ్యాచ్ చూస్తున్న నితీశ్ తండ్రి ఆనందం వ్యక్తం చేశాడు. దీంతో ప్రేక్షకుల్లో ఉన్న నితీశ్ తండ్రి ముత్యాలరెడ్డిని అభినందిస్తూ ఫ్యాన్స్ సంబరాలు చేసుకున్నారు.కుమారుడి తొలి సెంచరీని చూసి భావోద్వేగానికి లోనయ్యారు. సంతోషంతో కన్నీరుపెట్టారు. ప్రస్తుతం ఆ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది.



నిలిచారు. ఆస్ట్రేలియా బౌలర్లలో కమిన్స్, బోలాండ్ 3 వికెట్ల చొప్పున తీయగా, నాథన్ 2 వికెట్లు పడగొట్టాడు.

**వాషింగ్టన్ సుందర్ అర్ధశతకం**

నితీశ్‌తోపాటు సుందర్ (50) కూడా కీలక ఇన్నింగ్స్ ఆడాడు. తొమ్మిదో స్థానంలో వచ్చిన అతడు హాఫ్ సెంచరీ సాధించాడు. క్రీజ్‌లో పాతుకుపోయిన సుందర్ 146 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేశాడు. అతడి కెరీర్‌లో ఇది నాలుగో హాఫ్ సెంచరీ. సెంచరీ హీరో నితీశ్‌తో కలిసి ఎనిమిదో వికెట్‌కు శతకం (127 పరుగులు) భాగస్వామ్యం నిర్మించాడు. నాథన్ లైయన్ బౌలింగ్‌లో స్లిప్‌లో క్యాచ్ ఇచ్చి 8వ వికెట్ రూపంలో పెవిలియన్‌కు చేరాడు.

**ముందే ముగిసిన ఆట..**

నితీశ్ సెంచరీ పూర్తయ్యాక బ్యాడ్‌లైటింగ్ కారణంగా ఆట నిలిచిపోయింది. అప్పటికి భారత్ స్కోరు 358/9. క్రీజ్‌లో నితీశ్ (105*), సిరాజ్ (2*) ఉన్నారు. ఇంకా భారత్ 116 పరుగులు వెనకబడి ఉంది. అయితే, వర్షం వచ్చేయడంతో పిచ్‌ను కవర్లతో సిబ్బంది కప్పేశారు. ఎంతకీ తగ్గకపోవడంతో ఆటను నిలిపేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. దీంతో మూడో రోజు ఆట ముగిసింది. భారత్ నాలుగు వికెట్లను కోల్పోయి 194 పరుగులు రాబట్టింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 474 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

### నితీశ్ రెడ్డి ఆ విషయం గుర్తుంచుకోవాలి: సునీల్ గావస్కర్

నితీశ్‌పై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ ప్రశంసలు కురిపించాడు. 'నితీశ్‌కిది టెస్టుల్లో తొలి సెంచరీ. అతను సమీప భవిష్యత్తులో మరిన్ని సెంచరీలు చేయబోతున్నాడు. భవిష్యత్‌లో అతను వేలాది పరుగులు సాధించాలని కోరుకుంటున్నా. మెల్‌బోర్న్‌లో అతను చేసిన ఈ సెంచరీ భారత క్రికెట్ చరిత్రలో అత్యుత్తమ సెంచరీలలో ఒకటిగా నిలవాలి. పరిస్థితులకు అనుగుణంగా ఆడగలనని చూపిస్తున్నాడు. షాట్ సెలక్షన్ కూడా బాగుంది' అని గావస్కర్ పేర్కొన్నాడు. అదే సమయంలో నితీశ్‌కు గావస్కర్ కీలక సూచన చేశాడు. అతను ఈ స్థాయికి చేరుకోవడానికి తన తండ్రి, కుటుంబసభ్యులు చేసిన త్యాగాలను గుర్తుంచుకోవాలన్నాడు. 'తన తండ్రి, ఇతర కుటుంబ సభ్యులు చేసిన త్యాగాలను నితీశ్ గుర్తుంచుకోవాలి. భారత క్రికెట్ కారణంగా నితీశ్‌కు ఈ గుర్తింపు దక్కింది. ఇక నుంచి కూడా అతను ఆటను తేలిగ్గా తీసుకోకూడదు. నితీశ్ ఇదే ఆటతీరును కొనసాగిస్తే అద్భుతమైన కెరీర్ అతని సొంతమవుతుంది' అని సూచించాడు.

# కార్ల్‌సన్‌పై అనర్హత వేటు వేయలేదు

## నిరభ్యంతరంగా ఆడొచ్చు: ఫిడే సీఈవో



**విశ్వంభర (క్రీడలు):** ప్రపంచ ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ ఛాంపియన్‌షిప్ నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించిన చెస్ ప్లేయర్ మాగ్నస్ కార్ల్‌సన్ వ్యవహారంపై ఫిడే సీఈవో ఎమిల్ సుటోవ్స్కీ స్పందించారు. జీన్స్ వేసుకొని వచ్చి డ్రెస్ కోడ్‌ను ఉల్లంఘించడంతో తనపై వేటు వేసినట్లు మాగ్నస్ తెలిపాడు. దీంతో తాను టోర్నీ నుంచి వైదొలిగినట్లు వెల్లడించాడు. ఇప్పుడు సుటోవ్స్కీ వివరణ ఇస్తూ.. కార్ల్‌సన్ పోటీల్లో పాల్గొనొచ్చని స్పష్టం చేశారు. దుస్తులను మార్చుకొనేందుకు కార్ల్‌సన్‌కు అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. ''ఈ టోర్నీలో ఆడకుండా మాగ్నస్‌ను ఫిడే నిషేధించలేదు. ఆదివారం కొనసాగేందుకు వీలుంది. దుస్తులను మార్చుకొనేందుకు సమయం ఇచ్చాం. కానీ, ఇంటర్వ్యూల్లో మాత్రం వేరేగా స్పందించాడు. అతడినే టార్గెట్ చేస్తున్నట్లుగా మాట్లాడాడు. కానీ, నిబంధనలు అందరికీ ఒకేలా ఉంటాయి. డ్రెస్ కోడ్‌ను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత. గతంలోనూ డ్రెస్ కోడ్‌ను ఉల్లంఘించిన వారికి జరిమానా విధించాం. ఇదేమీ తాము వేయడం లేదు. అథ్లెట్ కమిషన్ సూచన మేరకు ఉంటుంది. ఈ కమిషన్‌లో గ్రాండ్‌మాస్టర్లు ఉంటారు'' అని ఫిడే సీఈవో వెల్లడించారు.

**అతడి కుటుంబమంటే మాకు గౌరవమే**

''ఇలాంటి పరిణామాలు ఎదురైనందుకు విచారం వ్యక్తం చేస్తున్నాం. మాగ్నస్‌ను అతడి ఫ్యామిలీని సాదరంగా ఆహ్వానిస్తున్నాం. అతడి కుటుంబం పట్ల మాకు గౌరవం ఉంది. అయితే, చీఫ్ ఆర్బిటర్ అలెక్స్ తీసుకున్న నిర్ణయానికి పూర్తి మద్దతు తెలుపుతున్నా. అదే సమయంలో కార్ల్‌సన్ నిరభ్యంతరంగా టోర్నీలో కొనసాగొచ్చు'' అని సుటోవ్స్కీ స్పష్టం చేశారు. అంతకుముందు రష్యా గ్రాండ్ మాస్టర్ ఇయాన్ నెపోమ్‌నియాట్చికి జరిమానా పడింది. వెంటనే తన దుస్తులను మార్చుకొంటానని కోరాడు. ఆ తర్వాత టోర్నీలో కొనసాగాడు.

# 'స్టుపిడ్' అంటూ రిషబ్ పంత్‌ను తిట్టిన సునీల్ గావస్కర్



**మెల్‌బోర్న్:** బోర్డర్-గావస్కర్ టోర్నమెంట్‌లో భాగంగా జరుగుతున్న నాలుగో టెస్ట్‌లో మరోసారి తన ఆటతో విమర్శలకు గురయ్యాడు బ్యాటర్ రిషబ్ పంత్. నాలుగో టెస్ట్ మూడో రోజు ఆటలో భాగంగా.. కీలక దశలో ఉన్నప్పటికీ రిషబ్ పంత్ తన మార్క్ షాట్‌ను ఆడేందుకు ప్రయత్నిస్తూ విఫలమయ్యాడు. స్కాట్ బోలాండ్ బౌలింగ్‌లో షాట్‌ను కొట్టేందుకు ప్రయత్నించి నాథన్‌కి క్యాచ్ ఇచ్చాడు. దీంతో ఈ చెత్త షాట్‌పై సునీల్ గావస్కర్ తీవ్రంగా స్పందించారు. రిషబ్ పంత్‌ని తిడుతూ.. స్టుపిడ్.. స్టుపిడ్.. స్టుపిడ్ షాట్ అంటూ.. అగ్రహాం వ్యక్తం చేశాడు. రిషబ్ భారత్ డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లొద్దు. ఇతర డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లాలి.. అతడి ఆడిన వాటిలో ఇదే అత్యంత చెత్త షాట్ వెల్లడించారు. కాగా ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

# ఆస్ట్రేలియాలో తొలి భారత బ్యాటర్‌గా నితీశ్ రెడ్డి సిక్సర్ల రికార్డు

ఆస్ట్రేలియాతో జరుగుతున్న బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో తెలుగు కుర్రాడు నితీశ్‌కుమార్ రెడ్డి అద్భుతమైన ఆటతీరు కనబరుస్తున్నాడు. క్లిష్ట సమయాల్లో కీలక ఇన్నింగ్స్‌లు ఆడుతూ జట్టుకు ఆపద్బాంధవుడిలా మారుతున్నాడు. మెల్‌బోర్న్ వేదికగా జరుగుతున్న బాక్సింగ్ డే టెస్టులో ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి నితీశ్ (105*; 176 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్స్) శతకం బాదేశాడు. దీంతో టీమ్ఇండియా ఫాలోఆన్ గండం నుంచి గట్టెక్కింది. తొలి ఇన్నింగ్స్‌లో ఒక సిక్సర్ బాది ఈ పర్యటనలో ఎనిమిది సిక్సర్లు పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలోనే ఆస్ట్రేలియా-



లో ఒక టెస్టు సిరీస్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన తొలి భారత బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. నితీశ్ కంటే ముందు విదేశీ బ్యాటర్లలో మైకేల్ వాన్ (2022-03), క్రిస్ గేల్ (2009-10) ఈ ఘనత సాధించారు. ఈ సెంచరీతో నితీశ్ మరో రికార్డు కూడా అందుకున్నాడు. ఆస్ట్రేలియా గడ్డపై 8వ స్థానంలో వచ్చి అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా నిలిచాడు. ఇంతకుముందు స్పిన్ దిగ్గజం అనిల్ కుంబ్లే (87) పేరిట ఈ రికార్డు ఉండేది. ఇప్పుడు దానిని అధిగమించాడు.

**ఈ సెంచరీ ఎప్పటికీ గుర్తుండిపోతుంది: వాషింగ్టన్ సుందర్**

మెల్‌బోర్న్‌లో నితీశ్ సాధించిన సెంచరీ ఎప్పటికీ గుర్తుండిపోతుందని భారత స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్అన్నాడు. నితీశ్‌తోపాటు సుందర్ (50; 162 బంతుల్లో) కూడా కీలక ఇన్నింగ్స్ ఆడిన విషయం తెలిసిందే. తొమ్మిదో స్థానంలో వచ్చిన సుందర్ నితీశ్‌తో కలిసి ఎనిమిదో వికెట్‌కు శతకం (127 పరుగులు) భాగస్వామ్యం నిర్మించాడు. 'నితీశ్ రెడ్డి అద్భుతమైన ఆటగాడు. మానసికంగా చాలా దృఢంగా ఉంటాడు. ఎంసీజీ (మెల్‌బోర్న్ క్రికెట్ స్టేడియం)లో అతను చేసిన ఈ సెంచరీ ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఏ పని అప్పగించినా వంద శాతం దానికి న్యాయం చేస్తాడు. అతను సెంచరీ చేయడం చూస్తుంటే మా అందరికీ చాలా ఆనందంగా ఉంది' అని వాషింగ్టన్ సుందర్ పేర్కొన్నాడు.

# అఫ్గానిస్థాన్‌తో టెస్టు.. జింబాబ్వే రికార్డు స్కోరు



**బులవాయొ :** టెస్టులలో జింబాబ్వే రికార్డు స్కోరు సాధించింది. అఫ్గానిస్థాన్‌తో బులవాయొలో జరుగుతున్న తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 586 పరుగులు చేసింది. టెస్టులలో జింబాబ్వేకు ఇదే అత్యుత్తమ స్కోరు (అంతకుముందు వెస్టిండీస్‌తో 563/9). జింబాబ్వే బ్యాటర్లలో సీన్ విలియమ్స్ (154), బ్రియాన్ బెన్నెట్ (110), కెప్టెన్ క్రెయిగ్ ఎర్విన్ (104) శతకాలతో మెరవగా బెన్ కరన్ (68) రాణించాడు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన అఫ్గాన్.. 30 ఓవర్లలో 95/2 పరుగులు చేసింది.

# వచ్చే వారమూ ఐపీఓల హవా.. 3 సబ్‌స్క్రిప్షన్లు, 6 లిస్టింగ్‌లు

**ముంబయి:** ఈ ఏడాది దేశీయ మార్కెట్లో ఐపీఓల హవా కొనసాగింది. 2024లో ఇప్పటివరకు మెయిన్ బోర్డ్ నుంచి 91 కంపెనీలు ఐపీఓకు వచ్చాయి. పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.1.59 లక్షల కోట్ల నిధుల్ని సమీకరించాయి. దలాల్ స్ట్రీట్‌లో వచ్చే వారం కూడా ఐపీఓల సందడి కొనసాగనుంది. మెయిన్ బోర్డ్ నుంచి ఇండో ఫార్మ్ ఎక్విప్‌మెంట్ కంపెనీ సంస్థ ఐపీఓకు రానుంది. ఎస్ఎంఈ కేటగిరీ నుంచి రెండు కంపెనీలు పబ్లిక్ ఇష్యూకు రానున్నాయి. వీటితో పాటు ఆరు కంపెనీలు మార్కెట్లో లిస్ట్ కానున్నాయి.

**ఇండో ఫార్మ్ ఎక్విప్‌మెంట్**

మెయిన్ బోర్డ్ సెగ్మెంట్ నుంచి ఇండో ఫార్మ్ ఎక్విప్‌మెంట్ పబ్లిక్ ఇష్యూ సబ్‌స్క్రిప్షన్ డిసెంబర్ 31న ప్రారంభం కానుంది. ట్రాక్టర్లు, క్రేన్లు తయారుచేసే ఈ సంస్థ ఐపీఓ ద్వారా రూ.260.15 కోట్లు సమీకరించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా 1,21,00,000 షేర్లను జారీ చేయనున్నారు. ధరల శ్రేణి రూ.204- రూ. 215గా కంపెనీ నిర్ణయించింది. సబ్‌స్క్రిప్షన్ జనవరి 2తో ముగియనుంది. షేర్ల అలాట్‌మెంట్, లిస్టింగ్ తేదీలను కంపెనీ ఇంకా వెల్లడించలేదు.

**డ్రై ఫ్రూట్స్ అండ్ స్పైసెస్**

ఎస్ఎంఈ విభాగం నుంచి లియో డ్రై ఫ్రూట్స్ అండ్ స్పైసెస్ ఐపీఓకు రానుంది. డ్రై ఫ్రూట్స్, ఇతర మసాలా ఉత్పత్తుల్ని తయారుచేసే ఈ సంస్థ పబ్లిక్ ఇష్యూ జనవరి 1 న ప్రారంభమై 3న ముగుస్తుంది. ధరల శ్రేణి రూ.51-52గా కంపెనీ నిర్ణయించింది. ఐపీఓ ద్వారా రూ.25.12 కోట్లు సమీకరించనుంది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా 48.3 లక్షల తాజా షేర్లను జారీ చేయనుంది. మార్కెట్‌లో లిస్టింగ్ తేదీని కంపెనీ ఇంకా వెల్లడించలేదు.

**టెక్నికెమ్ ఆర్గానిక్స్**

రసాయనాల్ని ఉత్పత్తి చేసే టెక్నికెమ్ ఆర్గానిక్స్ పబ్లిక్ ఇష్యూకు రానుంది. ఎస్ఎంఈ విభాగం నుంచి వస్తోన్న మరో సంస్థ ఐపీఓ ద్వారా రూ.25.25 కోట్లు సమీకరించేందుకు సిద్ధమవుతోంది. డిసెంబర్ 31 నుంచి బిడ్లు దాఖలు చేయొచ్చు. పబ్లిక్ ఇష్యూలో భాగంగా 45.9 లక్షల తాజా షేర్లను జారీ చేయనుంది. ధరల శ్రేణి రూ.52 -55గా కంపెనీ నిర్ణయించింది. జనవరి 2న సబ్‌స్క్రిప్షన్ ముగియనుంది.

**లిస్టింగ్‌లు ఇవే..**

మెయిన్ బోర్డ్ నుంచి కారారో ఇండియా, సెనోర్స్ ఫార్మాస్యూటికల్స్, వెంటివ్ హాస్పిటల్స్ డిసెంబర్ 30న మార్కెట్‌లో లిస్ట్ కానున్నాయి. యూనిమెక్ ఏరోస్పేస్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ షేర్లు డిసెంబర్ 31న దలాల్ స్ట్రీట్‌లో అరంగేట్రం చేయనున్నాయి. ఇక ఎస్ఎంఈ కేటగిరీలో అన్యా పాలిటెక్ అండ్ ఫెర్టిలైజర్ లిమిటెడ్ షేర్లు జనవరి 2న, సిటీకెమ్ ఇండియా లిమిటెడ్ షేర్లు జనవరి 3 మార్కెట్లోకి ఎంట్రీ ఇవ్వనున్నాయి.





# సినీ ప్రముఖుల మీటింగ్‌తో ఆ అపోహ తొలగిపోయింది

## తమ్మారెడ్డి భరద్వాజ

చిత్ర పరిశ్రమలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై ఫిల్మ్ ఛాంబర్ మాజీ అధ్యక్షుడు, నిర్మాత, దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ ప్రెస్‌మీట్ పెట్టారు. తాజాగా సినీ ప్రముఖులు సీఎంను కలవడం గురించి మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టే అవగాహన కార్యక్రమాలపై నటీనటులందరూ వీడియోలు చేయాలని కోరారు. ''అందరినీ సమన్వయపరచడానికే ఫిల్మ్ ఛాంబర్ ఉంది. తాజాగా సినీ ప్రముఖులంతా ప్రభుత్వాన్ని కలిశారు. ఎఫ్‌డీసీ ఛైర్మన్ తరపున వెళ్లారు. ఇండస్ట్రీకి, ప్రభుత్వానికి మధ్య గ్యాప్ వచ్చిందనే అపోహ నిన్నటి మీటింగ్‌తో తొలగిపోయింది. అది బెస్ట్ మీటింగ్ అని అక్కడికి వెళ్లినవాళ్లు నాతో చెప్పారు. ఫిల్మ్ ఛాంబర్ తరపున మేము గతంలో ప్రభుత్వాన్ని కలిశాం. గద్దర్ అవార్డుల విషయంలో కొన్ని సలహాలిచ్చాం. గతంలో మేము కూడా కొన్ని సినిమాలకు బెనిఫిట్ షోలు వేశాం. కానీ, ఉచితంగా ప్రదర్శించాం. ప్రస్తుతం ఆ పరిస్థితి మారిపోయింది. దీని గురించి ప్రేక్షకులు, నిర్మాతలు ఆలోచించాలి. తాజాగా విడుదలైన 'పుష్ప2' అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది. అంటే మనం ఇప్పటికే ఇంటర్నేషనల్ స్థాయికి చేరాం. అన్ని భాషల్లో సినిమాలు తీస్తున్నాం. ప్రేక్షకులను అలరిస్తున్నాం''

''తాజాగా జరిగిన మీటింగ్‌లో వాళ్లు సినిమాల గురించి మాట్లాడలేదు. ఇండస్ట్రీ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి మరింత సహకారం కోరడానికి వెళ్లారు. ప్రభుత్వం చేపట్టే అవగాహన కార్యక్రమాలకు మన హీరోలందరూ సపోర్ట్ చేస్తూనే ఉన్నారు. అది మన డ్యూటీ. మనం సినిమాతో డబ్బులు సొంతం చేసుకుంటున్నప్పుడు సమాజానికి ఎంతోకొంత ఉపయోగపడే వీడియో చేయడం తప్పులేదు. సినిమాల రిలీజ్ సమయంలోనే కాదు ఎప్పుడూ సమాజానికి ఉపయోగపడే పనులు చేస్తూనే ఉండాలని నా అభిప్రాయం. లంచం తీసుకొని టికెట్ ధరలు పెంచారని వచ్చిన వార్తల గురించి ఇండస్ట్రీ ప్రముఖులతో సీఎం మాట్లాడినట్లు సమాచారం. ఇండస్ట్రీ వాళ్లకు గవర్నమెంట్ దగ్గరకు తరచూ వెళ్లాల్సిన అవసరం లేదు. ఏదైనా సమస్యలు ఉన్నప్పుడే కలుస్తాం. పుట్టినరోజుకు శుభాకాంక్షలు చెప్పలేదనేది అసలు విషయమే కాదు.. అందరూ అందరినీ విష్ చేయలేరు కదా''

''గతంలో చెన్నై నుంచి ఇండస్ట్రీ హైదరాబాద్ రావడానికి 40 ఏళ్లు పట్టింది. ఇక్కడి నుంచి మరోచోటకు వెళ్లాలన్నా అంత సమయమే పడుతుంది. చిరంజీవి కుటుంబం నుంచి మీటింగ్‌కు ఎవరూ ఎందుకు వెళ్లలేదో నాకు తెలియదు. బహుశా వారికి ఏమైనా ముఖ్యమైన పనులు ఉన్నాయేమో. ఇండస్ట్రీలో ఉన్న వారందరూ నాకు పిల్లలతో సమానం. అల్లు అర్జున్‌కు నేషనల్ అవార్డు వచ్చినప్పుడు సంతోషించాను. అలానే సంధ్య థియేటర్ ఘటనపై కూడా తాజాగా నా అభిప్రాయాన్ని చెప్పాను. నా ఉద్దేశం ఎవరినీ బాధపెట్టడం కాదు. నా పిల్లలతో సమానం కాబట్టి వాళ్ల గురించి మాట్లాడతాను. కొందరి మాట వింటే భవిష్యత్తు బాగుంటుంది. మరి కొందరికి దూరంగా ఉండండి అని చెప్పడానికి ప్రయత్నం చేస్తుంటాను'' అని తమ్మారెడ్డి భరద్వాజ చెప్పారు.

# తెలంగాణ నేపథ్యంలో సాయి పల్లవి సినిమా?

## సాయి పల్లవి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం

**సౌత్ ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో అందరు హీరోయిన్స్ తమ ప్రొఫెషన్ పరంగా ఒకేలా ఉండరని చెప్పాలి. ఒకో హీరోయిన్ ఒకో స్టేచర్‌ని మైంటైన్ చేస్తూ తమ శైలిలో సినిమాలు చేస్తూ వెళుతుంటారు. అయితే కొందరు మాత్రం ఎక్స్ పోజింగ్ స్కిన్ షోస్ లాంటివి చేసి మరీ స్టార్ హీరోయిన్స్ అవుతారు. కానీ ఇంకొందరు మాత్రం అవేవి లేకుండా కేవలం తమ పెర్ఫామెన్స్ లుక్స్ తో మాత్రమే అలరిస్తూ స్టార్‌డమ్ సంపాదించుకుంటారు.**

వీరిలో రెండో క్యాటగిరీకి చెందిన హీరోయిన్స్ లో ప్రెజెంట్ ఉన్న తరంలో వినిపించే పేరు సాయి పల్లవి అని చెప్పొచ్చు. మలయాళ సినిమాలో ఎంట్రీ ఇచ్చినప్పటికీ తెలుగులో తన మొదటి సినిమాకే సంచలన విజయాన్ని అందుకుని ఒక్కసారిగా స్టార్ హీరోయిన్ అయిపోయింది సాయి పల్లవి. అక్కడి నుంచి సాయి పల్లవి సెలెక్టెడ్ గానే సినిమాలు చేస్తూ హిట్స్ కొడుతోంది.

అయితే సాయి పల్లవి తెలుగులో చేసిన అన్ని చిత్రాల్లో చాలా వరకు బాక్సాఫీస్ దగ్గర విఫలం అయ్యాయి. కానీ అందులో తన రోల్ కి ఇంపార్టెన్స్ కానీ, తన రోల్‌లో ఆమె పెర్ఫామెన్స్ లకి కానీ ఎక్కువ మార్కులే పడ్డాయి. కాగా సాయి పల్లవి తెలుగులో చేసిన అన్ని సినిమాల్లో తెలంగాణ బ్యాక్ డ్రాప్ చేసే సినిమాలకి ఒక ట్రాక్ రికార్డు ఉందని చెప్పొచ్చు. తన మొదటి సినిమా "ఫిదా" తోనే అంత క్రేజ్ రావడానికి తన సొంత డబ్బింగ్ లో తెలంగాణ యాసను అచ్చు అక్కడి అమ్మాయిలానే పలికించడం గట్టి కారణం అని విశ్లేషకులు అంటూ ఉంటారు. ఈ కోవలోనే వచ్చిన నెక్స్ట రెండు సినిమాలు లవ్ స్టోరీ ఆ తర్వాత విరాట పర్వంలలో లవ్ స్టోరీ హిట్ అయ్యింది. విరాట పర్వం కంటెంట్ బాగున్నప్పటికీ బాక్సాఫీస్ వద్ద నిరాశ పరిచింది. దీనితో మళ్ళీ అక్కడి నుంచి ఇలాంటి నేపథ్యం ఉన్న సినిమాలను సాయి పల్లవి టచ్ చేయలేదు.

అయితే ఫైనల్ గా సాయి పల్లవి మళ్ళీ ఇదే నేపథ్యంలో సినిమా ఓకే చేసినట్టుగా ఫిలింనగర్‌లో రూమర్స్ వినిపిస్తున్నాయి. లేటెస్ట్ కథనాల ప్రకారం సాయి పల్లవి దగ్గరికి సాలిడ్ స్క్రిప్ట్ వెళ్లిందట. ఆ సినిమా ఎవరితోనో కాదు తెలంగాణ నేపథ్యంలో అద్భుతమైన ఎమోషనల్ హిట్ ఇచ్చిన బలగం ఫేమ్ వేణు యెల్దండి రాసుకున్న మరో చిత్రం "ఎల్లమ్మ" అని తెలుస్తుంది. ఈ సబ్జెక్టుకి సాయి పల్లవి కరెక్ట్ అని మేకర్స్ అనుకుంటున్నారట. దీనితో ఈమెని అప్రోచ్ కాగా తన రోల్ సినిమాలో చాలా స్ట్రాంగ్ అని తెలిసే సాయి పల్లవి గ్రీన్ సిగ్నల్ కూడా ఇచ్చినట్టుగా సోషల్ మీడియాలో గాసిప్స్ వినిపిస్తున్నాయి. మరి ఇది కానీ నిజం అయితే తెలుగులో సాయి పల్లవి తెలంగాణ నేపథ్యంలో మరో సినిమా చేస్తున్నట్టే అని చెప్పాలి. ఇంట్రెస్టింగ్ గా తనకి ఈ నేపథ్యంలో వచ్చిన అన్ని సినిమాల్లో తనదే మెయిన్ లీడ్ . మరి బలగం వేణు.. సాయి పల్లవిని ఎలా ప్రెజెంట్ చేస్తాడో చూడాల్సిందే.






# మహేశ్ బాబు-రాజమౌళి సినిమాలో ఛాన్స్ కొట్టేసిన బాలీవుడ్ బ్యూటీ!


టాలీవుడ్ దర్శక దిగ్గజం ఎస్.ఎస్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబోలో SSMB 29 మూవీ తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ మూవీకి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా సాగుతున్నాయి. ఇక షూటింగ్ ప్రారంభం కావడమే ఆలస్యం. మూవీ లవర్స్ కూడా ఈ సినిమా కోసం ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు. హాలీవుడ్ సినిమాను తలపించేలా ఈ సినిమా ఉండబోతుందని రాజమౌళి ఇప్పటికే హింట్ ఇచ్చాడు.అయితే మహేశ్ బాబు సరసన బాలీవుడ్ బ్యూటీ ఛాన్స్ కొట్టేసినట్లు ఫిలిం ఇండస్ట్రీలో వినిపిస్తోంది. ప్రియాంక చోప్రా ఈ మూవీలో నటిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ తర్వాత SSMB 29 మూవీ షూటింగ్ ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లన్నీ కూడా పూర్తయినట్లు సమాచారం. హైదరాబాద్ రామోజీ ఫిల్మ్‌సిటీతోపాటు, నగర శివార్లలో కొన్ని భారీ సెట్లను కూడా రూపొందించారు. తొలి షెడ్యూల్ వాటిలోనే జరుగుతుందట. తర్వాతి షెడ్యూల్ విదేశాలలో ఉంటుందట. ఈ సినిమా అధికారిక ప్రకటనకు సంబంధించిన గ్లింప్స్ ఇప్పటికే సిద్ధమైందని, త్వరలో ఇతర నటీనటుల్ని కూడా పరిచయం చేసే అవకాశం ఉందని చిత్రబృందం చెబుతున్నది. అనవాయితీ ప్రకారం త్వరలోనే ఓ ప్రెస్‌మీట్‌ను కూడా రాజమౌళి పెట్టనున్నారట. వెయ్యికోట్ల బడ్జెట్‌తో రెండు భాగాలుగా ఈ సినిమాను నిర్మాత కె.ఎల్.నారాయణ నిర్మిస్తున్నారు.

# కేరళలో రికార్డు బద్దలు కొడుతున్న 'మార్కో'.. తెలుగు ట్రైలర్

ఉన్ని ముకుందన్ కథానాయకుడిగా హనీఫ్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ థ్రిల్లర్ 'మార్కో' (Marco). ఇటీవల మలయాళంలో విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తోంది. రూ.30కోట్లతో నిర్మించిన ఈ చిత్రం విడుదలైన వారంలో రోజుల్లోనే రూ.80కోట్లకు పైగా వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాలు లెక్కగట్టాయి. ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. నూతన సంవత్సరం సందర్భంగా జనవరి 1న ఈ చిత్రం విడుదల కానుంది. తాజాగా చిత్ర ట్రైలర్ విడుదలైంది. యాక్షన్ సన్నివేశాలను పెద్ద పీట వేసినట్లు ప్రచార చిత్రాలు చూస్తే అర్థమవుతోంది.



# సల్మాన్ ఖాన్ 'సికందర్' టీజర్ వచ్చేసింది




**ముంబయి:** బాలీవుడ్ కథానాయకుడు సల్మాన్‌ఖాన్, రష్మిక ప్రధాన పాత్రలో నటిస్తోన్న చిత్రం 'సికందర్'. ఈ చిత్రానికి ఎ.ఆర్ మురుగదాస్ దర్శకత్వం వహిస్తున్నారు. భావోద్వేగాలతో కూడిన ఈ యాక్షన్ చిత్రాన్ని సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఇది చిత్రీకరణ దశలో ఉంది. సల్మాన్ ఖాన్ పుట్టినరోజును (శుక్రవారం డిసెంబర్ 27) పురస్కరించుకొని తాజాగా ఈసినిమా టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. సినిమాలో సల్మాన్ ఖాన్ పాత్ర తీరును తెలియజేసేలా దీనిని సిద్ధం చేశారు. తనపై దాడి చేయడానికి వచ్చిన వారితో ఆయన ఫైట్ చేస్తూ కనిపించారు. వచ్చే ఏడాది రంజాన్ కానుకగా దీనిని విడుదల చేయనున్నట్లు టీమ్ ప్రకటించింది.



# ఆ నటి నా డబ్బు వృథా చేసింది: సింగర్ ఫైర్

ముంబయి: బాలీవుడ్ జంట బిపాసా బసు, ఆమె భర్త కరణ్ సింగ్ గ్రోవర్‌ను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు ప్రముఖ సింగర్ మికా సింగ్ . వారితో వర్క్ చేయడం తనకు దారుణమైన అనుభవాన్ని మిగిల్చిందని ఆయన వాపోయారు. వారు తన డబ్బును వృథా చేశారని ఆరోపించారు. వాళ్ల ప్రవర్తన వల్ల.. తాను మళ్లీ సినిమా, సిరీస్ నిర్మాణంలోకి రాకూడదని నిర్ణయించుకున్నానని వెల్లడించారు.''ఎన్నో విధాలుగా ఆలోచించి నేను నిర్మించిన ఏకైక ప్రాజెక్ట్ 'డేంజరస్'. ప్రముఖ దర్శకుడు విక్రమ్ భట్ దీనికి కథ అందించారు. క్యాస్టింగ్ విషయంలోనూ పలు ఆలోచనలు చేశా. కరణ్ సింగ్ గ్రోవర్ అయితే కథకు సెట్ అవుతారనిపించింది. ఆయనకు జంటగా నూతన నటిని ఎంచుకుంటే బడ్జెట్ పరిధి దాటదనుకున్నా. అలాంటి సమయంలో బిపాసా బసు మా టీమ్‌లోకి అడుగుపెట్టారు. హీరోయిన్‌గా తాను యాక్ట్ చేస్తానని అన్నారు. ఆమె ఇష్టాన్ని కాదనలేక ఓకే చెప్పా. ఆ తర్వాత ఈ జంట నాకు ఎన్నో సమస్యలు సృష్టించారు. మూడు నెలల్లో పూర్తి కావాల్సిన ప్రాజెక్ట్‌ను ఆరు నెలలు సాగ దీశారు.

# 'సల్మాన్, మీరు డేట్ చేశారా?'

## నటిని ప్రశ్నించిన నెటిజన్

**ముంబయి:** బాలీవుడ్ నటి ప్రీతి జింటా కు ఊహించని ప్రశ్న ఎదురైంది. సల్మాన్ ఖాన్ పుట్టినరోజు సందర్భంగా ఆమె ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. దీనిపై ఓ నెటిజన్ స్పందిస్తూ.. ''మీ ఇద్దరూ ఎప్పుడైనా డేట్‌లో ఉన్నారా?'' అని ప్రశ్నించాడు. దీనిపై ఆమె తనదైన శైలిలో బదులిచ్చారు. సల్మాన్ తనకు కుటుంబసభ్యుడితో సమానం అని స్పష్టంచేశారు.

''మేమిద్దరం అస్సలు డేట్ చేయలేదు. తను నాకు కుటుంబసభ్యుడితో సమానం. అలాగే నా భర్తకూ అతను మంచి స్నేహితుడు. నా సమాధానంతో మీరు ఆశ్చర్యానికి గురైతే నన్ను క్షమించండి'' అని తెలిపారు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. నెటిజన్ తీరుపై పలువురు అసహనం వ్యక్తంచేశారు. పెళ్లైన తర్వాత ఒక నటిని ఇలాంటి ప్రశ్నలు వేయడం ఏమాత్రం సరికాదని హితవు పలికారు. అలాగే నటిని మెచ్చుకుంటున్నారు.

1998లో విడుదలైన 'దిల్ సే'తో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు ప్రీతి జింటా. ఎన్నో ప్రేమకథా చిత్రాల్లో యాక్ట్ చేసి సినీప్రియుల మది దోచారీ నటి. 'ప్రేమంటే ఇదేరా', 'రాజ కుమారుడు' వంటి చిత్రాలతో తెలుగువారికి చేరువయ్యారు. 2018లో విడుదలైన 'భయాజీ సూపర్‌హిట్' తర్వాత ఆమె సినిమాలకు దూరంగా ఉన్నారు. ప్రస్తుతం 'లాహోర్ 1947' కోసం వర్క్ చేస్తున్నారు.'హర్ దిల్ జో ప్యార్ కరేగా', 'చోరీ చోరీ చుప్కే చుప్కే' వంటి హిందీ చిత్రాలతో ఆన్‌స్క్రీన్ జోడీగా మంచి పేరు తెచ్చుకున్నారు ప్రీతి జింటా, సల్మాన్‌ఖాన్. ఆయా చిత్రాల వల్ల వీరి మధ్య మంచి స్నేహం ఏర్పడింది. ఈ క్రమంలోనే సల్మాన్ పుట్టినరోజును పురస్కరించుకొని ప్రతి ఏడాది ఆమె విషెస్ తెలుపుతుంటారు. శుక్రవారం (సల్మాన్ ఖాన్ పుట్టినరోజు డిసెంబర్ 27) కూడా అదేవిధంగా పోస్ట్ పెట్టారు. పలు సందర్భాల్లో ఆయనతో దిగిన ఫొటోలను ఆమె షేర్ చేశారు. ''హ్యాపీ బర్త్‌డే సల్మాన్. లవ్ యూ మోస్ట్. మిగిలిన విషయాలు మనం కలిసినప్పుడు చెబుతా. మనం కలిసి ఎన్నో ఫొటోలు దిగాలి. లేదంటే ఆ పాత ఫొటోలనే నేను ప్రతిసారీ పోస్ట్ చేస్తా'' అని సరదాగా తెలిపారు. ఈ ఫొటోలు సినీప్రియుల దృష్టిని ఆకర్షించాయి.



Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com